

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
సంక్రాంతి సంచిక
ఓ...పయనమయే ప్రియతమ....
...నను మరచి పోకుమా.....
అబ్బ! ఒక్కటుంటే ఒక్క ముగ్గు వేసి ఇప్పుడే వస్తానండీ!....
బాపు
22-1-82
150 పైసలు



కమెండో సంస్థనుండి వెలువడుతున్న మాసపత్రిక

వెరయిటీ

జనవరి సంచికలో..

మూడువందల వివిధ ప్రపంచభాషల ప్రచురణలూ, ఒక్క దేశంలో ప్రచురణల్లోనే రెండువందల పునర్ముద్రణలూ పొంది అనేక కోట్లప్రతులు అమ్ముడయి. ఒక మేటిప్రపంచ సినిమాగా తయారయినవిప్లవనవల

అమ్మ

MOTHER
by
MAXIM GORKY

ఈనవలతో కొత్త
మరో 25 శీర్షికలున్నాయ్

సినీ భయంకరసామ్రాట్
—హిచ్ కాక్

ఖజురహోను అరెస్టుచేస్తే—

అనే-చిత్రకళలో నగ్నపురుషుడు!

లైంగికమార్పులు
జరుగుతున్న వేళ!

ఫాంటమ్ బ్రహ్మ

జాతి హీరోలు

రండి ఈ ప్రపంచాన్ని జయిద్దాం.

అంతర్జాతీయ నేరస్తుడు – జాకాల్

పెళ్ళిమంత్రాల్లో చెబుతున్న
వేమిటో మీకు తెలుసా?

మావోగారి జీవితేచ్ఛ

ముట్లుడిగే మగవాళ్ళు

ఆబోతుల్తో పోరాడే ఆడవాళ్ళు!

మీ ఆయనకు గాస్ట్రిక్ ట్రబులా,
అయ్యో పాపం!

7 లక్షల రూపాయలకు
ఒకేఒక్క ఆపిల్ పండు!

భార్యను నరుక్కుని తింటానంటున్న
ప్రపంచ చిత్రకారుడు

ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన
సెక్సీతారలు!


మగవాళ్ళూ పిల్లల్ని కనగలరుట!

కాలేజీ అమ్మాయిలమధ్య రాగ్గింగ్

జాక్వెలిన్ కెనడీ ఏం చేస్తోంది?

నెపోలియన్‌ను ఆటపట్టించిన
దిసమొల పిల్ల!

లోకంపోకడ * ఊమెన్



ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభు ప్రసాద్
సంపాదకుడు
[1938 1972]

సంచిక 22-1-'82
దుర్మతినామ సం. పుష్య బ. త్రయోదశి
సంపుటము 75 సంచిక 20

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

విడిప్రతి వెల రు. 1-50 పైసలు
ఆంధ్ర పత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003


విషయానుక్రమణిక

ముఖచిత్రం : "బాబు"

ఎస్కార్ట్స్
కాలంకన్నా ముందంజ

ESCORTS

ప్రతి లీటర్ చమురుతో ఎక్కువ కిలో మీటర్ల దూరం ప్రయాణించేట్టు చమురు ఖర్చు బాగా తగ్గించి పని తీరు తెన్నులు సర్వోత్కృష్టంగా ఉండేట్టు చూసేందుకు ఎస్కార్ట్స్ ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానం సంతరించుకుంటోంది




ఎస్కార్ట్స్ లావణ్య మార్పులకు సదా తత్పరతతో ఉంటుందని, ముందు ముందు ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనేందుకు సమర్థంగా ఉంటుంది.

మోటార్ సైకిళ్ళ మార్కెట్లో ముందంజ వేసిన ఎస్కార్ట్స్, మారుతున్న భారతీయ పరిస్థితులలో, తన విశేష ప్రజ్ఞా పాటవాల ప్రతిభావాన్ని, జపాన్ నుంచి సంపాదించుకున్న కొన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యంగా మేళవించింది. దేశంలో లభించే ఇతర మోటార్ సైకిళ్ళకన్నా 400 సిసి స్థాయి వరకు సాంకేతికంగా ఉన్నతమైన సంపూర్ణ శ్రేణిని ఉత్పత్తి చేయగల శక్తి సామర్థ్యాలను ఎస్కార్ట్స్ త్వర త్వరగా అభివృద్ధి చేసుకుంటోంది.

మోటారు సైకిళ్ళ పరిశ్రమ రంగంలో ఎంతో పటిష్టమైన కార్యా లయాలు, స్పేర్ పార్టులు, సబ్ అసెంబ్లీలు, ఎలక్ట్రికల్ పరికరాలు, ఇతరత్రా పరికరాలు మొదలైన ప్రపంచపు అధునాతన అనుబంధ పరిశ్రమల మొత్తం శ్రేణికి సహా ప్రవేశపెట్టడం ఈ సమగ్ర సాంకేతిక పరిజ్ఞానంలో ఉంది ఈ అనుబంధ పరిశ్రమలలో చాలా వాటిని లక్నోలోని పద్ధతి చేసి 500 అనుబంధ పరిశ్రమల వారికి అప్పగించారు.

దీని ఫలితంగా దేశంలోని మోటారు సైకిళ్ళు ఉపయోగించే ప్రతి ఒకరికి రాబోయే రోజుల్లో మరింత శక్తిని, మన్నికను, మరింత పనిని ఇచ్చే మోటార్ సైకిళ్ళు లభిస్తాయి. ఈ పాటు బాగా ఎక్కువ మైలేజీ ప్రతిభావాన్ని ఇచ్చే అధునాతన కార్బ్యురేటర్లను ఉత్పత్తి చేయటం అప్పుడే మొదలయింది. ప్రపంచంలో కార్బ్యురేటర్ల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న జపాన్ సంస్థ మికుని సాంకేతిక సహకార సహాయంతో ఎస్కార్ట్స్ ఎంప్లాయీస్ ఏన్సిలరీస్ వింగ్ ఏటేటా ఉత్పత్తి చేస్తోంది.



భారత దేశపు మొట్టమొదటి 2-స్ట్రోక్, 2-సిలిండర్, 350 సిసి 39 బిహెచ్‌పి ఇంజన్ను జపాన్‌కు చెందిన యమహా సాంకేతిక సహకారంతో ఎస్కార్ట్స్ ఉత్పత్తి చేస్తుంది.

HTD-ESC-6939

భారతదేశపు జీవనావసరాలకు సరిపడే అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరిస్తోంది.

ఎస్కార్ట్స్ లిమిటెడ్

11 ఇండియా హౌస్, కన్నాట్ సర్కస్, న్యూ ఢిల్లీ-110001.

మోటారు సైకిళ్ళు * ట్రాక్టర్లు-వ్యవసాయ యంత్ర సామగ్రి * ఆటోమోటివ్ ఏన్సిలరీస్ * ఇండస్ట్రియల్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ * రెల్వే ఏన్సిలరీస్ * హీటింగ్ ఎలిమెంట్స్


మనలో మాట

మా పాఠకులు, రచయిత(త్రు)లు, ఏజంట్లు, ప్రకటనకర్తలందరికీ మా సంక్రాంతి శుభాకాంక్షలు.

1981 దీపావళి కథల పోటీలో రు 600 లు బహుమతి పొందిన అయిదు కథలపై మేము నిర్వహించిన పాఠకుల బాలట్, వ్యాసరచన పోటీలలో ఎంతో ఉత్సాహంతో పాల్గొని దానిని జయప్రదం చేసిన వారందరికీ మా కృతజ్ఞతలు.

పాఠకులు 'బాలట్'లో మొదటిదిగా 'నిజమైన పుత్రుడు' కథని ఎన్నుకున్నారు. రెండవ కథగా 'కోరిక' ఎన్నికైతే, మూడవదిగా 'మానవత్వం' వచ్చింది.


ఇక మిగిలిన నాలుగు, అయిదు స్థానాలలో వరుసగా 'ఇది ప్రశ్న-ఇది జవాబు', 'పద్మతోరణం' కథలు నిలిచాయి.



'అన్నపూర్ణ'
శ్రీ కె. పి. శాస్త్రి

బాలట్‌లో మొదటిదిగా ఎన్నికై మరో రు. 600 లు అదనపు బహుమతిని అందుకున్న 'నిజమైన పుత్రుడు' కథారచయిత కలం పేరు "అన్నపూర్ణ", అసలు పేరు శ్రీ కప్పగంతు పూర్ణచంద్ర శాస్త్రి. వీరి కథలు వివిధ పత్రికలలో, దాదాపు 20 పైగా వెలువడ్డాయి. ఆంధ్రసచిత్రవారపత్రిక సీరియల్‌గా ప్రచురించిన 'ఈ సంఘంలో కుటుంబమే ఇది' (1975), 'కాలమిచ్చిన తీర్పు' (1976) వీరి రచనలే. "అన్నపూర్ణ" అన్న కలంపేరు ఆడపేరని మిత్రులు విమర్శిస్తున్నందువల్ల ఇకపై తమ అసలు పేరు స్ఫురించేలా 'కె. పి. శాస్త్రి' పేరుతో రచనలు చెయ్యాలని నిర్ణయించుకున్నట్లు తెలియచేస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మంజిల్లాలోని సత్తుపల్లిలో ఉద్యోగం చేస్తున్నారు.

రెండో కథగా ఎన్నికై అదనపు బహుమతిగా మరో రు. 500 లు పొందిన 'కోరిక' రచయిత శ్రీ కంచుమర్తి వెంకటేశ్వరరావు వయస్సు 22 సంవత్సరాలు, 1960 లో తూ. గో. జిల్లా మండపలి లో జన్మించారు. అయినా పెరిగిందీ, చదువుకున్నదీ, ప్రస్తుతం ఉంటున్నదీ విజయనగరంలో. 1980 లో బి. ఎస్సీ పాసైనారు. నిరుద్యోగిగా ఒక సంవత్సరం




శ్రీ కంచుమర్తి వెంకటేశ్వరరావు

అనుభవాన్ని సంపాదించిన ఈ రచయిత ఇంకా ఎన్ని సంవత్సరాలో... ? అని అంటున్నారు.

వీరివి యింతవరకూ నాలుగు కథలు ప్రచురితమైనాయి మరో అరడజను వివిధ పత్రికల పరిశీలనలో ఉన్నాయట తనలో సాహితీ జిజ్ఞాస కలిగించిన గురువు 'రామసూరి', మిత్రుడు సాల్మన్ రాజకుమార్ గార్లకి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. అభిమాన రచయిత శ్రీ మంధా వెంకట రమణారావు అని రాశారు

వీరి మొదటి కథ 8 9 78 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురితమైంది. మొదటి కథ ప్రచురించినదీ, తొలిసారిగా బహుమతి యిచ్చి ప్రోత్సహించినదీ ఆంధ్ర సచిత్ర వారపత్రికే అని అంటున్నారు.



శ్రీ బెహరా వెంకట సుబ్బారావు

'కోరిక' కథని తమ తల్లిదండ్రులు శ్రీమతి రత్నమ్మ, శ్రీ మంగరాజుగార్లకి అంకితమిస్తున్నట్లు తెలియజేశారు.

మూడో కథగా ఎన్నికై రు. 400 లు అదనపు బహుమతి నందుకున్న 'మానవత్వం' రచయిత శ్రీ బెహరా వెంకట సుబ్బారావు 45 ఏళ్ల కిందట తూ. గో. జిల్లాలో జన్మించారు. ప్రస్తుతం విజయనగరం కంటోన్మెంటు పోస్టాఫీసులో క్లర్కుగా పని చేస్తున్నారు. 1957 లో రచనలు ప్రారంభించారు. ఆ ఏడాదిలోనే నాలుగు కథలు, రెండు గేయాలు ప్రచురితమైనాయి. వీరి మొట్టమొదటి కథ 1957 ఆంధ్ర

పత్రిక ఉగాది సంచికలో పడింది. 1957 నుంచి 1975 వరకూ రచనలు చెయ్యలేదు. ఆ తర్వాత నుంచీ ఈనాటివరకూ సుమారు అరవై కథలు అన్ని ప్రముఖ దిన, వార, మాస పత్రికలలో పడినట్లు, రెండు కథానికలు ఆకాశవాణిలో ప్రసారమైనట్లు తెలియచేశారు. ప్రముఖ మాసపత్రికలు రెండింటిలో వీరి కథలకి కన్సొలేషన్ బహుమతులు వచ్చాయి. 1977 లో ఆంధ్ర సచిత్ర వారపత్రిక నిర్వహించిన కథల పోటీలో వీరి కథ 'వన్‌మినిట్' సంపాదకుని ఎన్నికలో బహుమతి పొంది, పాఠకుల బాలట్‌లో మొదటి బహుమతి నందుకున్నది. సంతానం ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. చదరంగం, కారమ్స్ అంటే చాలా యిష్టం అని రాశారు.

ఇక కన్సొలేషన్ బహుమతులుగా ఒక్కొక్క దానికీ రు. 250 లు పొందిన చివరి రెండు కథలలో 'ఇది ప్రశ్న – అది జవాబు' నాలుగో స్థానంలో వచ్చింది. 1962 నుంచీ తెలుగు పాఠక లోకానికి 'విహారి' అన్న కలం పేరుతో సుపరిచితులైన శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు రాసిన కథ ఇది. గతసంవత్సరం ఆంధ్ర సచిత్ర వారపత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీలో వీరి కథ 'చలనం' బహుమతి పొంది 'బాలట్'లో మూడవదిగా ఎన్నిక అయింది. 1978 లో వీరు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డుని అందుకున్నారు. వీరి వచన కవితా సంపుటి 'చలనమ్' అశేష పాఠకుల ఆదరణని, విమర్శకుల ప్రశంసలని పొందింది.

ప్రస్తుతం కడపలో జీవితభీమా సంస్థ డివిజనల్ ఆఫీసులో ఆఫీసరుగా ఉన్నారు. బి. ఏ. డిగ్రీతోపాటు ఇన్స్యూరెన్స్‌లో ఎఫ్. ఐ. ఐ. ఐ. డిప్లొమా కూడా ఉంది.

1941లో తెనాలిలో పుట్టి ఇరవై ఏళ్ళు అక్కడే పెరిగినా స్వస్థలం మచిలీపట్నం అనే చెప్పుకోవాలని అంటున్నారు.

పాఠకుల బాలట్‌లో చిట్టచివరి కథగా వచ్చిన 'పచ్చతోరణం' శ్రీ శివల జగన్నాధరావు రాశారు. 1966 లో విశాఖపట్నంలోని డాబాతోటలో జన్మించారు. తొలి కథ 'సీత' ఆంధ్ర సచిత్ర వారపత్రికలోనే పడింది. తదాదిగా వివిధ పత్రికలలో వంద కథలు, ఆరు నవలలు వెలువడినట్లు తెలియచేస్తు




శ్రీ 'విహారి'

న్నారు. ఒక మాస పత్రిక నిర్వహించిన నవలల పోటీలో రెండవ బహుమతి పొందిన వీరి నవల 'భాను' కన్నడంలోకి అనువదించబడి వెలువడింది. కొన్ని రేడియో నాటికలు, కవితలు వచ్చాయి. విశాఖ సాహితికి కార్యనిర్వాహక సభ్యులైన వీరికి శ్రీ గణపతిరాజు అచ్యుత రామరాజు, శ్రీ అప్పాజీగార్లు మిత్రులు, శ్రేయోభిలాషులు అని తెలియచేశారు.

ఈ అయిదుగురు రచయితలకీ మా ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నాము.

దీపావళి కథలపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో మొదటి బహుమతి రు. 250 లు అనంతపురం జిల్లా, హిందుపూర్ తాలూకాకి చెందిన కొడిగెన హళ్ళి నుంచి కుమారి జొన్నలగడ్డ వెంకట లక్ష్మి రాసిన వ్యాసానికి లభించింది.



శ్రీ శివల జగన్నాధరావు

కరీంనగర్ నుంచి కుమారి వేమూరి శ్రీదేవి రాసి పంపిన వ్యాసానికి రెండవ బహుమతి రు. 150 లు లభించింది.

మూడవ బహుమతి రు. 100 లు అందుకున్న వ్యాస రచయిత శ్రీ దివి మురళీ కృష్ణ మచిలీపట్నానికి చెందినవారు.

ఈ ఇద్దరు రచయిత్రులకీ, రచయితకీ మా అభినందనలు. బహుమతి పొందిన మూడు వ్యాసాలనీ ఈ సంచికలోనే వేశాము.

ఎప్పటివలెనే ఈ ఏడాది కూడా సినిమా బాలట్ నిర్వహిస్తున్నాము. పాఠకుల సౌకర్యం కోసం 1981 లో విడుదలైన తెలుగు చిత్రాలు, వాటి దర్శకులు, సంగీత దర్శకుల పేర్లని ఈ సంచికలోనే వేశాము. పాఠకులందరూ ఉత్సాహంతో పాల్గొని సినిమా బాలట్‌ని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాము.

'పెద్దకథ' ప్రారంభం!

పెన్ ఫ్రెండ్

టి.యస్.వి. కృష్ణమూర్తి



దూరం నుండి కూతపెడ్తూ వస్తున్న రైలుబండి చేస్తున్న శబ్దాల వల్ల నా నిద్రమత్తు వదిలిపోయింది.

మంచంమీద లేచికూర్చుని "కరాగ్రే వసతే లక్ష్మి, కరమధ్యే సరస్వతి, కరమూలేతు గోవిందః! అని మనసులోనే అనుకుని అరచేతిని చూసుకుని మంచం ప్రక్కనేవున్న కిటికీ రెక్కలు తెరిచాను.

దూరంగా డబుల్‌లైన్ రైలు రోడ్డు కన్పిస్తోంది. కొంచెం దూరంలో వస్తున్న రైలు తాలూకు గుప్పుగుప్పు మనే శబ్దాలూ, కూతలూ స్పష్టంగా విన్పిస్తున్నాయి. చీకటి తెరలు తొలగిపోతూ వెలుగు రేఖలు పొడచూపుతున్న మసక వెలుతురులో అందంగా సాగిపోయింది బొగ్గు ఇంజను కలిగివున్న ప్యాసింజరు రైలుబండి కొన్ని నిముషాలలో.

ఉదయాన్నే నిద్రలేవగానే ఈ రైలు బండిని చూస్తే నా మనసంతా ప్రశాంతంగా, ఉల్లాసంగా తయారవుతుంది, రోజంతా ఉత్సాహంగా వుంటుంది. ఆ రైలు ఏ రోజైనా చాలా ఆలస్యంగా రావడం జరిగినా, లేదా దాని బదులు ఏ డీజలు ఇంజను కలిగిన రైలో, ఎలక్ట్రిక్ ఇంజను కలిగిన రైలో ఆ సమయంలో రావడం జరిగినా నాకు ఏదో పోగొట్టుకున్నట్లు అయిపోయి వెడ్డ చిరాకు కూడా కలుగుతుంది. నాకు చిన్నతనం నుండీ కూడా బొగ్గు బళ్ళు అంటే మహా ఇష్టం. ఆ ఇష్టం ఎలా ఏర్పడిందో, ఎలా వృద్ధి అయిందో సరిగ్గా జ్ఞాపకంలేదు. బొగ్గు ఇంజనును చూస్తే ఆప్తమిత్రున్ని చూసినంత ఆనందం కలుగుతుంది నాకు. అయితే ఈ ఫీలింగ్ నాకు డీజల్, ఎలక్ట్రిక్ ఇంజన్లను చూస్తే కలుగదు.

ప్రభాత సమయంలో అందమైన ప్రకృతిమధ్య సాగిపోయే ఈ రైలుబండిని ప్రతిరోజూ చూసి అవ్యక్తమైన ఆనందాన్ని అనుభవించడం కోసమే నేను ఊరికి మరీ దూరంగా వెల్లూరు రోడ్డులో ప్రక్కగా ఉన్న ఈ ఒంటరి మేడమీద గదిలో నివసిస్తున్నాను మూడుసంవత్సరాలుగా, నా మిత్రుడు శంకరంతో పాటు. ఈ గది కన్నా సౌకర్యాలు ఎక్కువకలిగి ఊర్లోనే మా ఆఫీసుకు దగ్గరగా ఎన్నో గదులు ఖాళీ అయినా నేను ఈ గదిని వదిలి పెట్టలేదు.

రైలు వెళ్ళిపోయాక కొన్ని నిముషాల పాటు రైలు లైన్లనూ, అవతలి వైపు పచ్చటి పొలాలనూ, ఇంకాదూరంలో గుబురుగా కన్పిస్తున్న చెట్ల గుంపులనూ, వాటి అవతల దూరంగా వున్న గుట్టలనూ, కొండలనూ చూస్తూ కూర్చున్నాను.

"ఎవరి పిచ్చి వారికానందం" అన్నాడు శంకరం.

నేను ప్రకృతినిచూడ్డం మానేసి వెనక్కి తిరిగి చూశాను.

శంకరం తన మంచం మీద కూర్చుని టేబిలులైటు మంచంమీదే ఉంచుకుని ఏదో వ్రాసుకుంటున్నాడు.

ఉదయాన్నే ఏదో వ్రాసుకునేవాడు కానుకోక నన్ను పరిహసించిన





వేలాది కుటుంబాలు అనాదిగా వాడబడుతున్న
లవంగనూనె ప్రభావాలన్నింటినీ ప్రామిస్‌లో మళ్ళీచూసారు.
లవంగనూనెతో కూడిన
సాటిలేని టూత్‌పేస్ట్
ప్రామిస్
మీరూ ఎందుకు వాడి చూడకూడదు మరి!
అరే, చిత్రం! ప్రామిస్‌లాంటి టూత్‌పేస్ట్ ఇంతవరకూ రాలేదెందుకో మరి!
ప్రామిస్
దంతక్షయంనుండి రక్షణకు
తోడ్పడుతుంది. నోటినితాజాగా
రూపొందించి
దుర్వాసనను అరికడుతుంది.
The unique toothpaste with time tested CLOVE OIL
Promise
for healthier teeth and gums, fresher breath
బల్సారా ఉత్పాదన
ఆరోగ్యంచిందే పళ్ళు,
చిగుళ్ళు, తాజాశ్వాస–
అదే మరి ప్రామిస్ వాగ్దానం.
CHAITRA-BLS-463 TEL

పెన్ ఫ్రెండ్

శంకరాన్ని నేనేమీ అనలేదు. చిన్నగా నవ్వుకుని మంచం దిగాను.

నేను గది వెనుక డాబాలో గెడ్డం గీక్కొని, పండ్లు తోముకుని, స్నానం కూడా చేసి వచ్చాక కూడా శంకరం అలాగే వ్రాసుకుంటూ కూర్చుని వున్నాడు మంచంమీదే. అతనిలో అంత ఓపిక చాల అరుదు.

"ఏమిట్రా, అంత సీరియస్‌గా వ్రాసేస్తున్నావు?" అని అడిగాను.

"ఆ మధ్య పరిచయం అయిన 'పెన్ ఫ్రెండ్'కి ఉత్తరం వ్రాస్తున్నాను" అన్నాడు శంకరం.

శంకరం హాబీలలో ముఖ్యమైనది పెన్ ఫ్రెండ్‌షిప్. అయితే అతను ఆడవాళ్ళతో తప్ప పెన్ ఫ్రెండ్‌షిప్ చేయడు. "పెళ్ళంటూ చేసుకుంటే పెన్ ఫ్రెండ్‌గా నాకు సంతృప్తి కలిగించిన అమ్మాయినే చేసుకుంటాను" అంటూ వుంటాడు వాడు. అయితే దురదృష్టవశాత్తు ఇంత కాలం గడిచినా తనకి సంతృప్తి కలిగించిన పెన్ ఫ్రెండ్ లభ్యం కాలేదు.

"నీకు సంతృప్తి కలిగించి, నీలో చలనం కలిగించే పెన్ ఫ్రెండ్ లభ్యం అవుతుందా? లేక నీ నిరీక్షణ ఒక జీవిత కాలం అయిపోతుందా, ఏమిట్రా??" అన్నాను.

"నో... నో... నో! నిరీక్షణా, అన్వేషణా ఇక ఏమీ వుండవు. ఇదిగో ఈ వుత్తరం రాసిందే... ఈ అమ్మాయి పేరు విజయ భారతి. ఈమె భావాలూ, వ్యక్తిత్వం నాకు బాగా నచ్చాయి. పెన్ ఫ్రెండ్‌గా నన్ను సంతృప్తి పరచిన మొదటి అమ్మాయి ఈమే! బహుశా ఇక నన్ను సంతృప్తి పరచగల పెన్ ఫ్రెండ్ కోసం నేను అన్వేషించాల్సిన అవసరం నాకు వుండబోదనుకుంటాను."

అంటూ తన ముందువున్న ఓ వుత్తరాన్ని చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు శంకరం.

"బాప్‌రే, చాల అడ్వాన్సులో వున్నావు కదురా, నాకు చెప్పనేలేదే? ఇంతకూ ఆ అమ్మాయి ఎవరు? ఏవూరు? ఆమె వ్యక్తిత్వం ఎలాంటిది? ఆమె రూపం ఎలా వుంటుంది?" ప్రశ్నలు గుప్పించాను.

"నే నెప్పుడూ అడ్వాన్సులోనే వుంటానురా. నీలా వెనుకబడ్డ ప్రాంతాన్ని కానుగా!

సం-క్రాంతి కేతనం

వ్యక్తి – తనదైన
క్రాంతి కేతనాన్ని ఎగుర
వేసిన తర్వాతనే-
స్వేచ్ఛా సంగీతం వినిపిస్తుంది.
స్వాతంత్ర్య భారతి కనిపిస్తుంది

అలా నిలదొక్కుకున్న వ్యక్తికి,
కాంతి పథం ముందరున్నదే!
నడుస్తుంటే నలుగురూ వస్తారు
అడుగడుగునా అనుసరిస్తారు.

అప్పుడు –
క్రాంతి జీవితం
సంక్రాంతిగా మారటానికి
కాలం ఎంతో పట్టదు.

కాబట్టి మిత్రమా!
తక్షణం నీదైన
సం-క్రాంతి జెండా ఎగురవేయ్!
వ్యక్తి కేతనం శక్తి విశ్వసనీయ్!!

– కాణిపాకం లింగన్న

ఆ అమ్మాయి పేరు విజయభారతి అని చెప్పానుగా. తను బి. ఎ. లిటరేచరు చదివింది. షార్టుహ్యాండు పాస్ అయింది. స్వంత ఊరు బెజవాడ. ప్రస్తుతం తను ఏదో ప్రయివేటు కంపెనీలో స్టెనోగా పని చేస్తోంది బెజవాడ లోనే. ఆమె వ్యక్తిత్వాన్ని గూర్చి నేను మాటలలో చెప్పలేను. నీవు ఆమె వుత్తరాలు చదువు ... నీకే తెలుస్తుంది. మొత్తానికి ఆమె నాకు బాగా నచ్చింది. ఐ లైక్ హర్ వెరీమచ్. ఆమె అందాన్ని గూర్చి నాకు తెలియదు. నేను ఇంకా ఆమెను చూడలేదు కదా? ఒక్కటి నిజం ఈ ప్రపంచంలోని అందమంతా ఆమెలోనే ఉండి వుండాలి. ఆమె ఫోటో కోసం వ్రాశాను. ఎందుకో పంపలేదు ఇంకా. ఇంకో రిమైండర్ కొడ్తాను."

అన్నాడు శంకరం. అతని కంఠస్వరంలో ఎంతో గర్వం, లోకాన్ని జయించినంత ధీమా ధ్వనించాయి.

"వెరీగుడ్, కంగ్రాచులేషన్స్, విష్‌యూ ఆల్ ది బెస్ట్."

అన్నాను శంకరం భుజం తట్టి—కానీ తన పెన్ ఫ్రెండ్ ఆకారాన్ని అతను అద్భుతంగా ఊహించుకోవడం నాకు సిల్లీగా అనిపించింది.

ఊహలు ఎంత అద్భుతంగా వుంటాయి ! మనిషిని వాస్తవానికి మరీ దూరంగా అద్భుత లోకాలలోనికి తీసుకువెళ్ళగల శక్తి ఊహలకు మాత్రమే వుంది.

"థాంక్స్యూ, విజయభారతి నాకు వాసిన వుత్తరాలు చదువు" అన్నాడు శంకరం మంచం దిగుతూ.

"సారీరా మాకు ఆడిట్ ఇన్‌స్పెక్షన్ ప్రారంభం అయింది. ఇప్పుడు నేను చాల బిజీ తరువాత ఎప్పుడైనా చదువుతాను."

అన్నాను ఆఫీసు నుండి వచ్చేటప్పుడు నాకూడా తెచ్చుకున్న ఫైల్స్ అందుకుంటూ.

* * *

మా ఆఫీసుమీదికి దండెత్తి వచ్చిన ఆడిటర్స్యూ, ఆడిట్ ఇన్స్‌పెక్టర్స్యూ దాదాపు రెండునెలల పాటు మా ఆఫీసును వదలలేదు. ఆడిట్ పూర్తయేసరికి మార్చి వచ్చేసింది. ఇక ఆ పైన అకౌంట్స్ అన్నీ క్లోజ్‌చేసి మార్చి అయిందని పించుకునేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది కీలకమైన సీట్లో వున్న నాకు.

శంకరం అప్పుడప్పుడు విజయభారతి వుత్తరాలను గూర్చి, అందులోని విశేషాలను గూర్చి ఆమెనుగూర్చి ఏవో చెప్తూనేవున్నాడు. అయితే అతను ఏం చెప్పాడో కూడా గ్రహించ లేనంత, అతని ఆనందంలో భాగం పంచుకో లేనంత బిజీగా వుండిపోయాను నేను.

ఏప్రిల్ మొదటివారంలో నాలుగురోజులు శెలవు పెట్టేశాను మనసుకు విశ్రాంతిని ఇవ్వడం కోసం.

పని చేస్తున్నంతకాలం శెలవు పెట్టి విశ్రాంతి పుచ్చుకుంటే బావుంటుందని అన్పిస్తుంది. అయితే శెలవు పెట్టాక పొత్తిగా తోచకపోవడం వలన ఎందుకు శెలవు పెట్టామా ? అని అన్పిస్తుంది. ఇది సహజం.

నాలుగురోజులు శెలవు పెట్టిన నాకు రెండ్రోజులలోనే మరీ తోచకుండా అయిపోయింది మా ఊరు వెళ్ళి రావాలంటే కనీసం పదిరోజులు శెలవు కావాలి. తక్కువ శెలవులో నేనెప్పుడూ ఊరు వెళ్ళను.

మూడవరోజు ప్రొద్దుపోక గదిలో పడుకుని మునుకుతున్న నన్ను శంకరం ఉత్తరాల ఫైళ్ళు ఆకర్షించాయి.

తనకు వచ్చే ఉత్తరాలవన్నింటినీ విడివిడిగా ఫైల్ చెయ్యడం శంకరానికున్న హాబీలలో ఒకటి. తనకు ఉత్తరాలు వ్రాసే ప్రతి వ్యక్తి పేరా ఒక్కో ఫైలు ఉంచి, వారి ఉత్తరాలను జాగ్రత్తగా సీరియల్‌గా ఫైల్‌చేసి క్లీన్‌గా ఉంచడం అతని అలవాటు.

మంచంమీద నుంచీ లేచి 'లెటర్స్ ఫ్రం విజయభారతి' అని అట్టమీద వ్రాయబడి వున్న ఫైలు అందుకుని కుర్చీలో కూర్చుని చదవడం మొదలు పెట్టాను.

ఆ వుత్తరాలు వ్రాసిన అమ్మాయి విజయ భారతి ఎవరో కానీ చక్కటి వ్యక్తిత్వం, అద్భుతమైన ఆలోచనా శక్తి, లోకాన్ని సహృదయంతో చూడగలిగిన విశాల హృదయం కలిగివున్న యువతి అయి వుండాలి అన్పించింది. నాకు ఆమె ఉత్తరాలు చదువుతూ వుంటే. ఇంత ఆలోచింపగలిగి, ఇంత ఇంటర్నల్ అవుట్ లుక్ కలిగిన ఆడపిల్లలు వుంటారా అన్పించింది.

ఆ వుత్తరాలలో ఎన్నో భావాలు, ఎన్నో సూచనలు, ఎన్నో విమర్శలు, ఎన్నో ప్రశ్నలు, ఎన్నో జవాబులు... శంకరం అదృష్ట వంతుడు... లేకపోతే ఇంత విజ్ఞానం కలిగి వున్న ఆడపిల్ల పెన్ ఫ్రెండ్‌గా లభించడమే కాక, ఇంత గొప్పగా వారి మధ్య పరిచయం పెరగడం జరగదు.

ఒక్కటి నిజం... శంకరం భావాలూ, ఈమె భావాలూ చాలా విషయాలలో వ్యతిరేకంగా వున్నాయి. అయితే స్నేహపూర్వకమైన వాదనలద్వారా, సూచనల ద్వారా వుత్తరాలలోనే ఒకరి భావాలు మరొకరు మార్చుకుంటున్నారు ఆమె, శంకరం. శంకరం చేసిన పొరబాటున విమర్శలను సైతం ఎంతో స్పోర్టివ్‌గా ఆమె తీసుకుందని నేను ఆ వుత్తరాల ద్వారా గ్రహించాను. మారుతున్న కాలంలో, మారిపోతున్న మానవ మనస్తత్వాలలో రావాల్సిన మార్పులను గూర్చి ఆమె వెలిబుచ్చిన భావాలు ఎన్నో ఆశ్చర్యానికి గురి చేశాయి.

ఒక మనిషిని చూసి, పరిచయం చేసుకున్నాక ఎంతో కాలం గడిచినా కూడా కనుక్కోలేని కొన్ని అభిప్రాయాలను, విషయాలను ఆ మనిషి వ్రాసే వుత్తరాలను బట్టి సులభంగా గ్రహించవచ్చునని నా అభిప్రాయం.


శంకరాన్ని అప్రిషియేట్ చెయ్యాల తప్పదు అనుకుంటూ ఫైలు మూసేసి సిగరెట్ వెలిగించుకున్నాను.

ఆ రోజు సాయంకాలం శంకరం గదికి రాగానే అన్నాను—

"హార్టీ కంగ్రాచులేషన్స్‌రా బ్రదర్... మొత్తానికి విజయభారతితో కలం స్నేహం చేసి నీ పెన్ ఫ్రెండ్ షిప్ జీవితంలో గొప్ప విజయాన్ని సాధించావు! విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్."

అయితే నేను అనుకున్నట్లు గొప్పగ రియాక్టు కాలేదు శంకరం. పైగా వేదాంతంగా వెళ్ళిబోయేలా ఇలా అన్నాడు—

"సారీ రాజా! ఆ చాప్టర్ క్లోజ్ చేసేస్తున్నాను!"



పెన్ ఫ్రెండ్

'ఏమిటి? ఎందుకు??' అని అడిగాను ఆత్రుతగా, కుతూహలంగా.

శంకరం మౌనంగా తన వంపై దిండు క్రింద నుండి ఓ వుత్తరాన్ని తీసి నా చేతికి అందించాడు. ఆ వుత్తరమూ విజయభారతి వ్రాసిందే. ఏ కారణంచేతో ఆ వుత్తరాన్ని ఫైల్‌లో పెట్టలేదు శంకరం.

విల్స్ పేక్ కింగ్స్ సిగరెట్ వెలిగించుకుని ఉత్తరాన్ని చదవడం మొదలు పెట్టాను—

'ప్రియమైన శంకరం గారికి,

మీ ఉత్తరం అంది, మూడు, నాలుగు రోజులైంది. మీ ఈ ఉత్తరాన్ని చదివాక నేను ఎంతో ఆలోచించి ఆత్మ విమర్శ చేసుకోవాల్సి వచ్చింది. అందుకే జవాబు కొద్దిపాటి ఆలస్యంతో వ్రాస్తున్నాను.

మీ ఉత్తరాలను బట్టి మీరు నన్ను ప్రేమిస్తున్నారని నేను ఎప్పుడో గ్రహించాను. అయితే నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నట్టు గానీ, మీ ప్రేమను అంగీకరించ గలనని కానీ ఒక్క పర్యాయం కూడా సూచ్యాయగానయినా వ్రాయలేదు. దానికి ముఖ్యమైన కారణాలు కొన్ని వున్నాయి.

మన స్నేహం వేరు, ప్రేమ వేరు. రెండూ శాశ్వతమైనవే అయినా మన విషయంలో అవి వేరు వేరుగానే వుండిపోతాయి.

మీరు మీ ఉత్తరంలో "విజయా! నీ ఉత్తరాలలో నిన్ను చూసి, చూసి, ఊహలలో నిన్ను ఊహించి, ఊహించి విసుగెత్తి పోయాను. అందుకే త్వరలో నీ వదకు వచ్చేస్తాను. నేను నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానంటే ... ఇక ఆట్టే రోజులు నిన్ను చూడకుండా బతకలేనని అనిపిస్తోంది నాకు. నీ వద్దకు రెక్కలు కట్టుకుని వచ్చి వాలిపోతాను. సుందరమైన నీ రూపాన్ని చూసి, నున్నితమైన నీ చెంపలను నిమిరి, సుకుమారమైన నీ చేతిని ముద్దు పెట్టుకుని, మెత్తని నీ వడిలో తల వుంచుకుని పడుకుని విశ్రాంతి పొందాలని తపించి పోతున్నాను..." అంటూ వ్రాశారు.

అబ్బా! ఊహలెంత మధురంగా వుంటాయి? కానీ ఊహలు వేరు, వాస్తవం వేరు. వాస్తవానికి, ఊహలకూ ఎప్పుడూ పొంతన కుదరదు. అదే సృష్టిలోని విచిత్రం.



హై పవర్ సర్ఫ్ అమిత తెల్లగా ఉతుకుతుంది...

అమిత తెల్లగా కనువిందుగా

మీ బాబు బట్టలు మురికి చేసుకోవడంలో ఘటికుడా? ఆ మురికి వదలగొట్టడానికి మీకూ ఘనమైనదే కావాలి మరి. అదే హై పవర్ సర్ఫ్.

హై పవర్ సర్ఫ్‌లో ఉంది-అతి శక్తివంతమైన ఫార్ములా. దానిలోని హెచ్చు ఉతికే శక్తి మురికినీ, జిడ్డు మరకల్నీ మటుమాయం చేస్తుంది. బాగా మాసిపోయిన దుస్తుల్ని కూడా తెల్లగా మిలమిల మెరిసేలా చేస్తుంది సర్ఫ్. సర్ఫ్, రంగు బట్టలకు కూడా మంచిది. వాటిని పరిశుభ్రంగా, కాంతివంతంగా ఉంచుతుంది. ఇంటిల్లిపాది బట్టలకూ ఉతుకులో అదనపు తెల్లదనం, కాంతి ఇస్తుంది హై పవర్ సర్ఫ్. ఎక్కువ మంది తల్లులు మరే ఇతర వాషింగ్ పౌడర్‌కు బదులు సర్ఫ్‌నే వాడటంలో మరి ఆశ్చర్యం ఏముంది గనక ?



ఎక్కువ మంది తల్లులు మరే ఇతర వాషింగ్ పౌడర్‌కు బదులు సర్ఫ్‌నే వాడతారు.

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

లింటాస్-SU. 220.203 TL

పెన్ ఫ్రెండ్

మీరు నన్ను ప్రేమిస్తున్నట్లుగా ఊహించగలిగాను కానీ, మీరు నన్ను ఇంత అందంగా ఊహించుకుంటున్నట్లు గ్రహించలేకపోయాను. అక్కడే ఏదో పొరపాటు జరిగింది

మీరు ఊహించుకున్న ఆంతరంగిక సౌందర్యం అంతా నాలో వుండవచ్చు కానీ మీరు ఊహించుకున్న బాహ్య సౌందర్యం మాత్రం నాకు లేదని తెలుపడానికి విచారిస్తున్నాను. నేను నల్లగా, లావుగా, పొడుగ్గా వుంటాను. పైగా నా కుడికాలు కొద్దిగా అవిటి, నా పలువరుస కూడా బావుండదు. ఈ కారణాల వలననే నాకు పెళ్ళి కాలేదని నా పరిచయస్తులందరూ అంటూవుంటారు. అవుతుందనీ నే ననుకోను.

మీరు నన్ను ఊహలలో ప్రేమించారు—అంతే...అందువలన మీరు నన్ను పెళ్ళి చేసుకోవాల్సిన అవసరం ఏ మాత్రమూ ఉండదు. అయితే ఒక్క విషయం ... నా ఆకారాన్ని గూర్చి తెలిశాక కూడా మీరు నన్ను ప్రేమిస్తూనే వుండేటట్లయితే ఈ నెల పదిహేనవతేదీ, శనివారం నాటికి తప్పక రండి ఇక్కడికి.

మీరు నన్ను ప్రేమించడం మానేసినా వచ్చేనష్టం ఏమీలేదు మన స్నేహానికి. మనం ఎప్పటికీ పెన్ ఫ్రెండ్స్‌గా మిగిలిపోదాం.

ఇకవుంటాను - ఎప్పటికీ మీ స్నేహితురాలు
విజయ భారతి '

ఉత్తరాన్ని చదివాక నాకు ఎంతో బాధతో పాటు కొద్దిపాటి నిరుత్సాహం కూడా కలిగింది. అయితే "షి ఈజ్ హ్యావింగ్ వెరీ బ్రాడ్ మైండ్" అనుకున్నాను. విశాల హృదయురాలు కాబట్టే స్నేహానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వదలుచుకుంది.

"ఒరేయి శంకరం. నీవు ఆమెను ప్రేమించడం మానేస్తావని నాకు తెలుసు. అయినా ఆమెతో కలం స్నేహం మాత్రం మానకు!" అన్నాను.

"లేదురా, ఇక ఆ విషయం క్లోజ్. అంతే!" అన్నాడు శంకరం.

నాకు కోపం వచ్చింది.

"అడవి మనిషిలా మాట్లాడకు! మనిషిని చూడకనే ప్రేమించెయ్యడం, మనిషిని చూశాక నచ్చకపోతే ప్రేమను విత్‌డ్రా చేసుకోవడం...

మనసంటే రెండు రకాల చొక్కాలుగా భావించే వీకు ఐతే సరిపోయింది కానీ చాలా మందికి అలా కాదు. షర్టు విప్పి, వేరే షర్టు తొడుక్కున్నంత సులభంగాదు మనసు మార్చుకోవడం నీవు ఆమెను ప్రేమించడం మానేస్తే ఈ లోకానికి వచ్చే నష్టం ఏమీ లేదు. కానీ అంత వున్నతురాలితో స్నేహం మానెయ్యడం నీకే నష్టం. విజయభారతి లాంటి వ్యక్తితో స్నేహం గర్వించదగ్గ విషయం నాదృష్టిలో" అన్నాను కోపంగానే

శంకరం జవాబు చెప్పలేదు.

శంకరం తండ్రి సాకాలదగ్గరిమంగళం పేట ప్రక్క ఓ పల్లెటూరులో పెద్ద భూస్వామి. బోలెడు ఆస్తి వుంది శంకరానికి పిత్రార్జితంగా. పైగా శంకరం తన బ్యాంకులో త్వరలో ఆఫీసరు అవబోతున్నవాడు. అతనిమీద, ఐదు అంకెల సంఖ్యలు వేయబడ్డ అందమైన అమ్మాయిల తాలూకు ఫోటోలు కుప్పలు తెప్పలుగా పడుతున్నాయి ఆపిల్లల తలిదండ్రులనుండీ. అతనికి విజయభారతిమీద ప్రేమ తొలగిపోవడంలో వింత లేకపోవచ్చు. కానీ అతనా చాప్టర్ ఎండ్ అనడం నాకు కొంత బాధను కలిగించింది.

సిగరెట్ వెలిగించుకుని ఆలోచనలో మునిగిపోయాను. విజయభారతి మీద చాల సానుభూతి కలిగింది నాకు. పాపం ఆ అమ్మాయి భావాలకు తగిన వ్యక్తి, సహృదయుడూ ఆమెకు తటస్థ పడకపోవచ్చు తన జీవితంలో. అందంగా వున్న యువతులు ఎంతోమంది పెళ్ళిళ్ళు కాలేకపోవడంతో ఎంతో బాధామయ జీవితాలు గడుపుతున్న ఈ కాలంలో విజయభారతి లాంటి వారి సంగతి చెప్పనవసరమే లేదు.

చీకటి పడకముందే గది తాళం పెట్టి బయల్దేరాము నేనూ, శంకరమూ ఊర్లోకి. సాయంకాలం పూట కాలి నడకన ఊర్లోకి వెళ్ళి భోంచేసి తిరిగిరావడం మాకుమామూలే!

సిగరెట్ త్రాగుతూ, ఆలోచిస్తూ, నడుస్తున్న నా మనసులో ఎన్నో భావాలు కదిలిపోతున్నాయి.

తను అనాకారినని విజయభారతి మొదటే శంకరానికి ఎందుకు వ్రాయలేదు! తనను

అసలైన సంక్రాంతి!

జీవితాలలో కాంతి లేకపోయినా
చేతులలో కాసులు కరువైనా
కడుపులో ఎలకలు పరిగెట్టినా
సంక్రాంతి వచ్చిందని
చంకలు గుద్దుకుంటే
సరదా తీరినట్టేనా ?
కాదు. కాకూడదు.
ఆకలితో అలమటించే అమాయకుల
అతుకుల బతుకులు కుదుటబడినప్పుడు
కట్నంలేకుండా కన్నెపిల్ల కదలి
కన్నతండ్రి ఆవేదన తీరినప్పుడు
నిరుద్యోగికో ఉద్యోగందొరికి
నిరాశ నిస్పృహల అలలు ఆగినప్పుడు
పండిన పంటకు ఫలితందక్కి
బక్కచిక్కిన రైతు బాగుపడినప్పుడు
సమస్యల వలయంనుండి
సామాన్యుడు బయటపడినప్పుడు
నాయకుల వాగ్దానాలు
ప్రభుత్వ పథకాలు అమలు జరిగి
బడుగు వర్గాలు బాగుపడినప్పుడు
అవినీతి అన్యాయం అరాచకాలు
ఆటకట్టి మూటల్లో మూలపడి
నప్పుడు
స్వార్థం నిస్వార్థ మంటలో కాలి
బూడిదగా మిగిలినప్పుడు
అప్పుడు అసలైన సంక్రాంతి!
ఆరోజు అందరికీ సౌరభాల కాంతి!

— "శ్రీవాణి"

గూర్చి, తన భావాలను గూర్చి, తన మనస్తత్వాన్ని గూర్చి అంత విపులంగా వ్రాసిన ఆమె తన స్వరూపాన్ని గూర్చి ఎందుకు దాచి వుంచింది? పోనీ శంకరం తనను అభిమానిస్తున్నట్టు తెలియగానే తన బాహ్య స్వరూపాన్ని గూర్చి ఎందుకు తెలిపి వుండకూడదు? ఇంత పెద్ద సమస్యల తోరణానికి కారణం ఆమె మొదటే తన ఫోటో ఒక్కటే పంపక పోవడం.

అయినా ఆమె తన ఉత్తరంలో వ్రాసినంత అనాకారి కాదేమో?

ఇలా ఆలోచిస్తూ నడుస్తున్న నేను హఠాత్తుగా ఉలిక్కిపడ్డాను. 'అసలు ఆమె అనాకారి కాదేమో?'' అన్న ఆలోచనతో.

"ఒరేయ్ నీవు ఆమెను ప్రేమించడం కంటిన్యూ అయ్యేలా వుంటే ఆమె నిన్ను రమ్మని వ్రాసింది ఏ తేదీనాటికి?"

"పదిహేనవ తేదీకి!" అన్నాడు శంకరం నిర్లిప్తంగా.

"బాప్‌రే... ఎల్లుండేనన్నమాట. ఇప్పుడు నేరుగా పోస్టాఫీసుకి వెళ్ళి ఎల్లుండి ఉదయం

పెన్ ఫ్రెండ్

తిరుమలా ఎక్స్‌ప్రెస్‌లో నీవు బెజవాడలో దిగబోతున్నట్టు ఆమెకు టెలిగ్రాం ఇవ్వాలి"

మసక వెలుతురులో విసుగ్గా చూశాడు శంకరం నా వైపే.

"నీకు నవ్వులాటగా ఉందా?"

"కాదురా బాబూ!... అసలు విజయ భారతి అనాకారి కాదని నా అనుమానం. ఆమె వ్యక్తిత్వంలాగే ఆమె ఆకారం కూడా అద్భుతంగా వుండొచ్చు నీ హృదయ వైశాల్యాన్ని కనుక్కోవడానికి తను ఈ ప్లాను వేసి వుండవచ్చుగదా?'' అన్నాను.

"ఊ! అలా ఏం వుండదులేరా!" అన్నాడు శంకరం. కాని వాడి కంఠస్వరంలో ఏదో అనుమానం లేకపోలేదు.

"ఎందుకు వుండకూడదు? నా అనుమానం నిజం అయి వుండవచ్చు... నీవు ఓ సారి బెజవాడ వెళ్ళి రావాల్సిందే!'' అన్నాను.

"సరే వెళ్ళి పదిహేవతేదీ ఆమెను కలుస్తాను. ఆమె అనాకారిగానే వుంటే?"

"మై బాడ్‌లక్ అనుకుని రెండ్రోజులు ఆమెతో స్నేహంగా గడిపి తిరిగి వచ్చెయ్యి. ఆ తరువాత ఏమైనా చేద్దువు ఈ చాప్టర్‌ని'' అన్నాను.

మొత్తానికి శంకరాన్ని ఒప్పించి మెస్‌లో భోజనం పూర్తి చేసుకుని, పోస్టాఫీసుకు పోయి టెలిగ్రాం ఇచ్చాము శంకరం పేరిట విజయ భారతికి.

తిరుమలాలో బెర్తు బుక్ చేస్తానంటే ఒద్దన్నాడు శంకరం మరునాటి రోజు రాత్రి పదిగంటలప్పుడు బట్టలూ గట్రా సర్దుకుని బాగ్ అందుకుని శంకరం బయల్దేరి స్టేషన్‌కి వచ్చేసరికి పదింపావు అయింది. టిక్కెట్ కొనుక్కుని నేను వగ గేటుకు వచ్చేసరికి దర్జాగా ఓ రిజర్వేషన్ కంపార్టుమెంటులో కూర్చొని వున్నాడు శంకరం, కదలబోతున్న తిరుమలా ఎక్స్‌ప్రెస్‌లో. టిక్కెట్ ముక్క వాడి చేతికిచ్చి "విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!'' అన్నాను. ట్రెయిన్ కదిలి వెళ్ళిపోయింది; నవ్వుతూ చెయ్యి ఊపుతున్న శంకరాన్ని తీసుకుని.

* * *

"సార్, మిమ్మల్ని ఫోనులో ఎవరో పిలుస్తున్నారు'' అన్నాడు అటెండరు రంగయ్య.

ఎక్జిక్యూటివ్ ఇంజనీరు దగ్గర్నుంచి బోలెడు రిమార్కులతో వాపసు వచ్చిన ఫైల్సు చూస్తున్న నేను విసుగ్గా లేచాను సీట్లోంచి. ఫోనున్న గదిలోకి వెళ్ళి రిసీవరు తీసుకుని "రాజారావ్ హియర్!'' అన్నాను.

"నేనురా రాజా, వచ్చేశాను.. ఇప్పుడే రైలుదిగి నీకు ఫోను చేస్తున్నాను స్టేషను నుండే. గదికి వచ్చెయ్య త్వరగా!'' అని చెప్పి అవతల ఫోను పెట్టేశాడు శంకరం.

"పిడి దుంపతెగా'' అనుకున్నాను. మొన్నటిరాత్రి రైలు ఎక్కిన శంకరం ఈరోజు ఉదయాన్నే ఇక్కడ దిగేశాడంటే కనీసం తను విజయవాడలో ఇరవయి గంటలైనా గడపలేదన్నమాట! అంటే...? అతని రాకతోనే ఏం జరిగిందీ తెలుస్తోంది!

అయినా సస్పెన్సును ఏ మాత్రమూ సహించలేని నేను వెంటనే ఆఫీసులోంచి బెలబలపడి సైకిలు మీద వేగంగా వెళ్ళాను గదికేసి.

(ఇంకా ఉంది)

వారికి చాలినంత లభిస్తున్నదని మీరు గట్టిగా చెప్పగలరా?





"మా డాక్టరుగారు హార్లిక్స్‌ను సిఫారసు చేసినప్పటినించి మా కుటుంబమంతా రోజూ హార్లిక్స్ తీసుకునేట్టు అలవాటు చేశాను.
మీరు కూడా మీ కుటుంబానికి హార్లిక్స్ ఇస్తున్నారా?"


చాలా మంది తల్లులు తమ తమ ఆహార పదార్థాలలో ఆరోగ్యానికి ఏది మంచిదో అది చాలినంత లభిస్తుందో లేదో స్పష్టంగా చెప్పలేరు.

అందుచేతనే వారు హార్లిక్స్‌ను నమ్ముకున్నారు.

హార్లిక్స్ రోజూ క్రమం తప్పకుండా తీసుకున్నట్టయితే మీ కుటుంబానికి పుష్టికరమైన సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది.

ఎందుచేతనంటే, చిక్కటి పాలు, మాల్టెడ్ బార్లీ, గోధుమ పుష్కలంగా హార్లిక్స్‌లో ఉన్నాయి అవే ప్రధాన పోషకాహారానికి మూలం.

హార్లిక్స్‌ను నిత్యం తీసుకోవటం ఎంతో మంచిది. మీ మనసులోని అన్ని చింతలనూ తొలగిస్తుంది.



హార్లిక్స్-మంచి పుష్టికరమైనది

HTD-HMM-70

దీపావళి కథలపై వ్యాసరచన పోటీలో మొదటిబహుమతి రు 250 లు పొందిన వ్యాసం

రూపకల్పన, శైలి, వాస్తవం ...

మానవత్వం

"జరిగే వాస్తవాలను తెలుసుకోలేక, తొందరపడి కొంతమంది ఎదుటి మనుషులను అపార్థం చేసుకొంటారు మానవత్వం లేదంటారు వాస్తవం ఎప్పటికైనా బయటపడితే ఆత్మపరిశీలన చేసుకోక తప్పదు." అనే కథావస్తువు చిత్రీకరించబడింది కథలో.

విన్సెంట్, విశ్వనాథం కలసి, తన కుమార్తె పెళ్ళికి సహాయం లేకుండా చేశారని, వాస్తవాన్ని గ్రహించక, మానవత్వం వాళ్ళలో లేదని అపోహపడి, పగసాధించాలనే ఉద్దేశ్యంతో తన అధికారాన్ని హద్దులో ఉన్నంతవరకు వాళ్ళు అప్పు చేసుకొన్న అడ్వాన్సుని పంపటానికి ఆలస్యం చేసాడు దయానిధి. కాని తన కొడుకు బ్యాంక్ ఉద్యోగానికి అడ్వాన్సు వెయ్యి రూ విన్సెంట్ ఎలాగో కష్టపడి తెచ్చి ఇచ్చేసరికి దయానిధి మనస్సు మానవత్వాన్ని గురించి ఆలోచిస్తుంది. "మనుషులందరిలోను మానవత్వం ఉందనుకోవడం పొరపాటు మాలతీ." అని దయానిధి, భార్యతో అన్న వాక్యంతో అతని మనసులో మానవత్వం గురించిన పరిశీలన మొదలవడంతో కథ ముగుస్తుంది. ఆఫీసులో జరిగే సాధారణ విషయాలకు, వెనకాల ఉండే వాస్తవాలకు, మానవత్వానికి సంబంధం జోడించి చక్కని శైలితో రూపకల్పన చేయబడింది కథలో.

నిజమైన పుత్రుడు

తన చదువుకు సహాయపడిన తండ్రి యాచక వృత్తి, ఉన్నతస్థితికి వచ్చిన తరువాత కృష్ణమూర్తికి హీనంగా అనిపిస్తుంది. కేవలం ఆ వృత్తి హీనంగా అనిపిస్తే ఫరవాలేదు, కష్టపడి, ఆ వృత్తితోనే, తనని ప్రయోజకుడుగా చేసిన తండ్రినే, అసహ్యించుకుంటాడు కృష్ణమూర్తి కళంకినిగా పేరు మోస్తూ, తనకోసం ఎన్నోబాధలు భరిస్తూ అభివృద్ధిలోకి తీసుకొచ్చిన తల్లి అంటే, కృతజ్ఞతాభావంతో ఆమెను ఆదరిస్తాడు, సుఖపెడతాడు శేఖర్. వెంకటపతి, జానకమ్మల జీవితాల తారతమ్యాలను సహజంగా చిత్రీకరిస్తూ "నిజమైన పుత్రుడు ఎలా ఉండాలి?" అనే ఆదర్శమైన ముగింపుతో కథా రూపకల్పన చేశారు రచయిత తల్లిదండ్రులను సుఖపెట్టగలిగినవాడే, నిజమైన పుత్రుడు అని ఈ కథ చెప్తున్నది.

ఇది ప్రశ్న - అది జవాబు

శివయ్యగారి జీవిత వేదాంతంతో ప్రారంభమై "జాతస్యమరణం ధృవమ్" అన్న దానితో సమాప్తమైన కథ యిది. శివయ్యగారు మృత్యువుకు అతిసమీపంగా వచ్చి, పునర్జన్మ ఎత్తటం ఒక వస్తే "పుట్టినవాళ్ళు గిట్టకమానరు మరణం ఎప్పుడో ఒకప్పుడు ప్రతి ప్రాణికి తథ్యం" - అన్నయ్య మృత్యువుతో జవాబు స్ఫురిస్తుంది. వేదాంత సారాన్ని రంగరించి ఒంటబట్టించుకొన్న వ్యక్తి కూడ, మృత్యువుకు భయపడటం, అనే చిత్రీకరణ, 'ప్రశ్న జవాబు' తో అంతమవుతుంది. రచనా శైలి, సముచితమైన శీర్షిక కథకు వన్నె తెచ్చిపెట్టినయి.


కోరిక


మానవ జీవితంలో కోర్కెలనంతం. కాని ఒక్కొక్క కోరిక తీరని కోరికయి మనో వేదనకు గురిచేస్తుంది. మనకింతే ప్రాప్తం అనుకుంటే కోరికలు అదుపులో ఉండవచ్చని పిస్తుంది మాణిక్యానికి కాశీయాత్ర చేయాలన్న కోరిక పరిస్థితుల వల్ల తీరని కోరికే అవుతుంది భార్య కోరిక తీర్చాలని మాధవరావు కూడ ఎప్పటికప్పుడు ప్రయత్ని స్తుంటాడు. కాని ఫలించదు మనిషికి ఆత్మ శాశ్వతమైనది అదైనా సంతోష పడాలని, మాధవరావు భార్య అస్థికలను కాశీ యాత్ర చేయించి, భార్య కోరిక తీర్చాలని బయలుదేరడంతో కథ ముగిస్తుంది. కోరిక తీరక పోవటానికి పరిస్థితుల ప్రాబల్యాల చిత్రీకరణ వాస్తవానికి దగ్గరగా ఉంది.

పచ్చతోరణం

"నరకం నుండి రక్షించువాడు పుత్రుడు" అంటారు. కాని ఆ పుత్రులే బతికుండగానే నరకాన్ని సృష్టిస్తే? ఐశ్వర్యం, సంతానం సుఖశాంతులను తెచ్చిపెడతాయి అంటారు. కాని ఆ సంతానం తమ తమ స్వార్థానికి కన్నవాళ్ళను ఒదిలేసి బాధ్యతా రహితంగా వేరుబడిపోతే ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. రాజా, రవి, శర్మ వాళ్ళందరి ఏదో వాళ్ళే తెలుసుకోలేక, తల్లిదండ్రులకు అనురాగం పంచి ఇవ్వలేక దూరంగా ఉంటారు. సంతానానికి ఆస్తి పంపకం అయిన తరువాత వైకుంఠమూర్తి మనసు తాత్కాలికంగా కుదుటపడినా, సంతానం నుంచి ఆశించిన అనురాగమనే పచ్చతోరణం వాడిపోయినందుకు అతను బాధ పడ్డాడు. రచనా శైలి బాగుంది.

- జొన్నలగడ్డ వెంకటలక్ష్మి




మీరెవరి మదినైనా కలవర పెట్టాలనుకున్నప్పుడు
అమాయకత్వం చిందించే బొట్టు పెట్టుకోండి.
మీ కనురెప్పలలో తత్తరపాటు,
నడకలో వయ్యారంతోపాటు
నొసట శింగార్ కుమ్‌కుమ్ బొట్టు
పెట్టుకు చూడండి.
శింగార్ రంగులలోని

సంక్రాంతి ముగ్గుల వైశిష్ట్యం



సంక్రాంతి పాట —ఫోటో : సుధాకర్ యడవల్లి

తెలుగువారి తక్కిన పండగలన్నీ ఒక కోవకు చెందినవైతే, సంక్రాంతి పండగ ప్రత్యేకంగా మహిళలకు ఎంతో వినోద విజ్ఞానాలిచ్చే పండగ. ఇది ధనుర్మాస కాలంలో వస్తుంది. ప్రాతఃకాలాన ప్రతి యింటి ముంగిటా మనోహరమైన రంగవల్లులు తీర్చే రమణులతో సంక్రాంతి పండుగ రోజులు సర్వులకూ ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. ఆ రోజుల్లో ప్రతి పడతి తనకు నచ్చిన వివిధ రకాలైన ముగ్గులతో యిళ్ళ ముంగిళ్ళను అలంకరించి, తన కళాభిరుచిని యితర గృహిణులకు గూడ ప్రదర్శించి, ప్రమోదాన్ని పొందుతుంది. భారతీయ సాంప్రదాయబద్ధ జీవితానికి సంకేతంగా, సౌందర్య ప్రతీకలుగా విలువగలిగిన కొన్ని ముగ్గుల విశేషాలను సంక్షిప్తంగా సందర్శిద్దాం. కళామయత్వానికి, కమనీయతకూ ఈ ముగ్గులు మనోహర ప్రతినిధులు.

ముగ్గు అనేది లలిత కళలలో ఒకటైన చిత్రలేఖనంలో ఒక భాగం. విష్ణు ధర్మోత్తరం అన్న గ్రంథంలో ఈ ముగ్గుల రూప విశేషాలు విస్తారంగా చెప్పబడ్డాయి. బిందువులను, రేఖలను కలిపి గీచే చిత్రమే ముగ్గు. ఈ ముగ్గులు గీయడం అన్నది యిళ్ళల్లో ఆ యా సందర్భ సన్నివేశాలపై గూడ ఆధారపడి వుంటుంది. పెళ్ళిళ్ళలో వేసే ముగ్గులకూ, పండగ పబ్బాల్లో వేసే ముగ్గులకూ వ్యత్యాసం వుంటుంది. వ్రతాలు, పూజలు చేసేటప్పుడు పద్మాల ముగ్గులను, పెళ్ళిళ్ళలో కల్యాణ మంటపం ముగ్గులను వేస్తారు. గీత, చుక్కలు గల ముగ్గులు త్రిమూర్తులకు సంకేత స్వరూపాలుగ చెప్పబడతాయి. సమబాహు త్రిభుజాకారపు ముగ్గు విష్ణుమూర్తికీ, లతాకారంగా వుంటే శివునకూ, పరస్పర ఖండనాలైన త్రిభుజాలు బ్రహ్మదేవునకూ సంకేతాలుగ చెప్పబడతాయి. అందుచేత ఈ ముగ్గుల నిర్మాణంలో ఆనందభావనలేగాక, ఆధ్యాత్మిక కామనలుగూడ చోటు చేసుకన్నాయి.

తెల్లవారుఝాముననే లేచి ఈ ముగ్గుల గీయడంవలన, మహిళలకు చక్కని వ్యాయామావకాశం కలిగి, దేహావయవాల కదలికకు ఆరోగ్యరీత్యా చక్కని సౌలభ్యం యేర్పడుతుంది. గోమయంతో కలిపిన నీటితో కళ్ళాపి చల్లటం గుల్లగున్నవు పిండితో ముగ్గులు గీయడంవలన, వ్యాధికారక క్రిములు నశిస్తాయి. స్త్రీల హస్త కళానైపుణ్యానికి నిధులైన ఈ ముగ్గులవలన గృహ పరిసరాల్లో వున్న అనారోగ్య వాతావరణం కూడ అంతరిస్తుంది.

సంక్రాంతి రోజుల్లో వేసే ఈ ముగ్గులు ప్రధానంగా గీతల ముగ్గులు. వికసిత పుష్పాన్ని బోలిన గుచ్ఛబంధపు ముగ్గు కర్షకులకు హర్షానిచ్చే సస్యసంపద వికసిత పుష్పంలాగా యిల్లు చేరిందని సూచిస్తుంది. వక్కాణే గీయబడిన సర్పాలు మృత్యు సంకేతాలై, హేమంత శైత్య వాతావరణంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని భంగ్యంతరంగా హెచ్చరిక చేస్తాయి. ధనుర్మాసపు రోజుల్లో ఆడువారు గీయటానికి ఎక్కువ మోజుపడేది గొబ్బి ముగ్గు. గుచ్ఛబంధపు ముగ్గు మధ్యభాగంలో గోమయపు ముద్దలనుంచి, వానిమధ్య గుమ్మడి, బంతిపూల నమర్చి వానిని గోవర్ధనగిరి, గోపాలకృష్ణుడు, గోవులు — వీనికి సంకేతంగా ఆరాధిస్తారు.

సంక్రాంతి ముగ్గులలో మరో ప్రధానమైనది రథం ముగ్గు. ఇది సంక్రాంతి పండగల్లో చివరిదైన కనుమునాడు గీయబడుతుంది సంక్రాంతి పురుషునికి రథముపైన వీడ్కోలు యిస్తున్నట్లు యిది సూచిస్తుంది. అంతవరకూ అనారోగ్యదాయకంగ వున్న ప్రాకృతిక వాతావరణానికి గూడ దీనివల్ల వీడ్కోలు సూచితమవుతుంది. మన పురాణాలలో గూడ సీతాదేవి, రుక్మిణి, దమయంతి ప్రభృతులు గృహాలముందు రంగవల్లులు తీర్చినట్లు దృష్టాంతాలున్నవి. సత్రాజిత్తు రాజు కావటానికి పూర్వ

సంక్రాంతి ముగ్గులు

— ఆర్. సత్యవతి



రంగవల్లి —చిత్రం : ఎస్. జె. ఎరసింహారెడ్డి

జన్మలో ఆతడు సతీసమేతంగా సూర్యదేవాలయంలో రంగవల్లులు తీర్చటమే కారణంగాగూడ భాగవత పురాణంలో ప్రవచింపబడింది.

ముగ్గులు వేయడమన్నది తరతరాల మన భారతీయ కళా సంస్కృతికి చిహ్నం. హైందవ గృహనిర్మాణ శాస్త్రం ఎంత ప్రాచీనమైనదో, గృహ ప్రాంగణాలలో రంగవల్లులు తీర్చే కళా సౌందర్యం కూడ అంత ప్రాచీనమై కేవలం మగువలకు మాత్రమే ధారాదత్తమైన అద్భుత కళ. సంవత్సరం పొడుగునా అప్రతిహతంగా సాగే ఈ కళా ప్రదర్శనం మహిళామణులందరికీ ఆనంద, ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలుగా సంక్రాంతి దినాలలో తారస్థాయికి వస్తుంది. "స్పర్ధయావర్ధతే విద్యా" అన్నట్లుగా గృహిణులందరూ పోటీలుపడి తమ కళా వైదుష్యాన్ని సంక్రాంతి దినాలలో ప్రదర్శిస్తూ, ఆబాలగోపాలానికి వినోద విజ్ఞానాల నొసగి "హైందవ గృహమే ఒక కళానిలయం" అన్న సూక్తిని సార్థకం చేస్తుంటారు. రమణీయమైన రంగవల్లులతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతాంజలులు సమర్పిస్తారు.

— ఎస్. జ్ఞానేశ్వరి

—ఎస్. ప్రేమకుమారి



సీరియల్

(గత సంచిక తరువాయి)

మీటింగులు అయిపోయాయి!

తారను తీసుకుని వెంకటరత్నం తిరుగుముఖం పట్టాడు.

నాలుగు రోజుల్నుంచీ అతడి సాన్నిధ్యంలో పొందిన అపురూపమైన ఆనందమూ, దివ్యమైన అనుభవమూ -- ఇల్లు దగ్గరవుతూన్నకొద్దీ గుండెల్లోంచీ పుడుతూన్న అర్థంకాని ఆందోళనతో మటుమాయమైపోయినాయి.

అమావాస్య చీకటిలాగా, భయం ఆమెని పూర్తిగా ఆవరించింది.

గేటు తీసి లోపలకు ప్రవేశించారు. ఇంట్లో నుండి పెద్దగా కేకలు వినిపిస్తున్నాయి. రాఘవయ్యగారు ఎవరిమీదనో కోపంగా అరుస్తున్నారు! ఆ కేకలు వింటూ వెంకటరత్నం భావయుక్తంగా తార ముఖంలోకి చూసాడు. తల దించుకుంది తార.

అలా తల దించుకోవటానికి కారణం సిగ్గు కాదు! భయం! 'అసలే కోపంగా ఉన్నారు కాబోలు! తన ఖర్మగానీ, ఈ సమయానికే తాము రావాలా! ఇంక ఇపుడు మమ్మల్ని చూస్తే ఇంకా మండిపడతారేమో!'

వరండాలోకి అడుగుపెట్టారు.

సరిగ్గా అదే సమయానికి హాల్లోనించీ గడప దగ్గరకు వచ్చారు రాఘవయ్యగారు. చూసి ఆశ్చర్యపోయారు మొదట. ఆయనకు అలా కూతురూ, అల్లుడూ పక్కపక్కగా నించుని ఉండటం చూస్తూంటే చాలా ఆనందం అన్పించింది. దానితాలూకూ సంతోష ఛాయలు ముఖంనిండా అలుముకున్నాయి. ఆ ఆనందంలో నోరు తెరచి లోపలకు ఆహ్వానించబోయారు.

అప్పటివరకూ ఎంతో భయంగా ఊపిరి బిగపట్టుకుని మరీ చూస్తూన్న తార తండ్రి ముఖభావాలు గమనించి సంతోషంతో "నాన్నా!" అంటూ ముందుకు రాబోయింది.

ఆమె పిలుపు రాఘవయ్యగార్ని తట్టి లేపింది. ఆయన నోరు తెరిచి వాళ్ళను ఆహ్వానించేలోపలే ఆశ్చర్యంగా ఎక్కడ్నుంచొచ్చిందో — బ్రహ్మాండమంత కోపం ముంచుకొచ్చి భళ్ళున పగిలిపోయింది.

"ఆగు!" అనే గర్జనతో అక్కడే ఆగిపోయింది తార.

చాలాసేపు తిట్టారు రాఘవయ్యగారు. తిట్టి తిట్టి వాకిట్లోంచే వెళ్ళిపొమన్నారు! తన ఇంట్లో చోటు లేదన్నారు! వాళ్ళ ముఖాలు కూడా తనకు చూపవద్దు అన్నారు!

కోపంతో కొంచెంసేపు కేకలు వేస్తారనుకుందే గానీ ఇలాగ అంటారని మాత్రం ఎదురు చూడలేదు తార. కలలోకూడా ఇలాటి పరిస్థితిని ఊహించలేదు!

అసలు వెంకటరత్నానికి ఇలాటివి అన్నీ క్రొత్త! ఎపుడూ చూడలేదు! తార రావటంలో తప్పేమిటో, ఆయన అలా అరవటం ఎందుకో — ఏమీ అర్థం కాలేదు.

'ఈ నాలుగు రోజుల్లోనూ తమా అడగలేదు; ఆమే చెప్పలేదు. ఆ రోజు... అలా... ఆ ఎండలో వగరుస్తూ, రొప్పుతూ పరుగెత్తుకొచ్చిన దానికర్థం ఇదన్నమాట!

'ఇంట్లోవాళ్ళ కిష్టం లేకుండా తనకోసం, తన మాట కోసం వాళ్ళ నెదిరించి వచ్చిందన్నమాట!' అలా అనుకోగానే వెంకటరత్నానికి తారపైన అంతులేని ప్రేమతోపాటు, ఎనలేని గౌరవం కూడా కలిగింది.

నిజంగా తార అదృష్టవంతురాలు! ఆ సమయంలో విధిముందు తల వంచి నిలబడినా - తార తారే!

వెంకట్ ఏం మాట్లాడకుండా భార్య చేయి పట్టుకుని బయటకు వచ్చేసాడు

రాఘవయ్యగారి వెనుకనుంచీ, కిటికీల్లోంచీ చూస్తూన్న మిగిలిన కుటుంబ సభ్యులకూ, చివరకు రాఘవయ్యగారిక్కూడా — ఆ దంపతులు అలా వెళ్ళిపోతుంటే చాలా బాధ అన్పించింది. కాని, వెనక్కు పిలవనూలేదు! సాహసించి ఎవరూ నోరు తెరవనూలేదు!

వెంకటరత్నం పెళ్ళి అయ్యాక అల్లుడిగా ఆ యింటికి రావటం అదే మొదటిసారి! నిజంగా మహారాజు మర్యాదలు అందుకోవాల్సిన తరుణం! ఇంటిల్లిపాదీ ఆనందంతో తల మునకలవ్వాల్సిన సమయంలో అనవసరంగా ఆవేశపడిపోయి అవమానించి పంపేసారు.

వెంకటరత్నానికి మర్యాదలూ, మన్ననలూ తెలియకపోయినా — ప్రేమలూ, మమతలూ తెలుసు! తోటి మనిషిని గౌరవించటమూ తెలుసు! ఇలాగ అవమానించటమూ తెలుసు!

'మొదటిసారి పడిన అభిప్రాయం జీవితాంతం పోదు' అంటారు! వెంకటరత్నం మనసులో అత్తవారి ఇంటిపై పడిన అభిప్రాయం మరి ఎలాంటిదో అతనికే తెలియాలి!

* * *

భార్యను తీసుకుని వెంకటరత్నం నూజెళ్ల ఇంటికి వచ్చేసరికి మధ్యాహ్నం నాలుగు దాటుతున్నాది. సరిగ్గా భోజనాల వేళకు వచ్చిన తారనూ, వెంకట్‌నూ తరిమేసారు రాఘవయ్యగారు. ఇంక అక్కడ్నుంచీ నూజెళ్ళకే వచ్చేసారు! ఆ సమయానికి వెంకట్రామయ్యగారు అలవాటు ప్రకారం పొలం దగ్గరే ఉన్నారు.

సత్యవతమ్మా, కళ్యాణి పిండివంటలు చేస్తున్నారు. దమయంతి ఏమో వ్రాసుకుంటున్నాది! గిరిజ వేరుశనక్కాయలు వలుచుకుని తింటోంది.

వాకిట్లోకి వచ్చిన అన్ననూ, వదిననూ చూసేసరికి ఆశ్చర్యమూ, ఆనందమూ కలిగాయి.

"అమ్మా, ... అరిచింది దమయం...

జరిగిన కథ — 6 రాఘవయ్య, నాగరత్నం దంపతులకు తార, సరళ—రామారావ్, రామ్మోహన్ చంద్రం సంతానం. కమ్యూనిస్టు పార్టీ ప్రముఖులలో ఒకడుగా పేరు తెచ్చుకుంటాడు వెంకటరత్నం శ్రీనివాసరావ్‌తో కలిసి ప్రసాద్ పెళ్ళికి వెళ్ళిన వెంకటరత్నం మదిలో 'అనుకోని సంఘటన' ద్వారా ముద్రవేసుకొంటుంది తార. ఎవరెన్ని విధాల నచ్చజెప్పినా వినక వెంకటరత్నాన్నే పెళ్ళి చేసుకొంటుంది తార. భర్తపైన ఉండే గౌరవంకొద్దీ అతను పంపే ఉత్తరాలతోపాటు పార్టీ పుస్తకాలు కూడా చదువుతూ ఆనాటి రాజకీయాలను అవగతం చేసుకొంటుంది తార. బెజవాడలో జరగబోతున్న మీటింగులకి వెళ్దాం రమ్మని తారకు ఉత్తరం ద్వారా తెల్పుతాడు వెంకటరత్నం. తండ్రి వెళ్ళొద్దని వారించినా వినక ఎన్నో బాధలకోర్చి అతన్ని కలుసుకొంది తార.

"పోమ్మా! నీ చాదస్తం, మన్యానూ! పెళ్ళికి మంచి కావాలన్నావు, చూసావు, అలాగే చేసావు! ఇహ మనింటికి రావలసిన అమ్మాయి — వచ్చింది! అంతేగానీ అన్నింటికీ మంచి ఏమిటి, మంచి! నాన్సెన్స్!" విసుక్కున్నాడు వెంకటరత్నం.

"నీకేం తెలుసురా! మన పెద్దాళ్ళు ఊరికేనే అన్నారా! అందునా ఒక్కగానొక్క కోడలు! కాస్త మంచిరోజు చూసుకోవక్కర్లేదూ!"

నవ్వేసాడు వెంకటరత్నం.

"నువ్వేం దిగులుపడబోకమ్మా, ఒక్కగానొక్క కోడలే అని బాధగా ఉంటే మరో రెండు పెళ్ళిళ్ళు చేసేసెయ్! ఎదురు చెప్పకుండా నువ్వు చూపించిన అమ్మాయిలకు పుస్తె కట్టేస్తాను. తీరిగ్గా మంచీ చెడులు చూసుకోవటానికి ఉంటారు. ఏమంటావే కళ్యాణీ!" పిల్లలు నలుగురూ కలిసి పకపకా నవ్వుతూంటే సత్యవతమ్మ కూడా ముసిముసిగా నవ్వేసింది.

"నీ అఘాయిత్యం కూలిపోనూ! ఏం మాటలురా అవి!" ముద్దుగా మందలించింది.

చేయి కడుక్కుని బయటకు వెళ్తూన్న కొడుకుతోపాటు తనుకూడా వెళ్తూ "ఒదిన్ని కూడా తీసుకొచ్చి అన్నం పెట్టండి." అని కూతుళ్ళకు పురమాయించింది.

ముందర వరండాలోకి వచ్చి వాలుకుర్చీలో కూర్చున్నాడు వెంకటరత్నం. కొడుకు వెనకాలే వచ్చి అరుగుమీద కూర్చుంది సత్యవతమ్మ.

"నీకోసం వెంకటేశ్వరరావూ, శ్రీనివాసరావూ వచ్చి వెళ్ళారురా."

"ఊహూఁ—" అన్నాడు పరధ్యానంగా.

అలాగ మరో నాలుగైదు కబుర్లు చెప్పాక మెల్లిగా గొంతు తగ్గించి అడిగింది సత్యవతి —

"కార్యం అదీ అయిందిట్రా?"


విసుక్కున్నాడు వెంకటరత్నం.


"మీ పెద్దాళ్ళకు వేరే పనులుండవు. ప్రతి చిన్న విషయానికీ ఆర్భాటాలూ, ఆరుపులూ తప్ప."

"అదేమిట్రా అలా విసుక్కుంటావు. ఇవ్వాళ నేను పెట్టిన ఆచారమట్రా ఇది. ఇంట్లో శుభకార్యం జరుగుతూంటే నలుగురు పెద్దలనీ పిలిచి ఆశీర్వాదాలు అందుకుంటే మీకూ, రేపు పుట్టబోయే మీ పిల్లలకూ కూడా ఎంతో మంచిది! ఇది మన సాంప్రదాయం!"

'తల్లికి తెలియదు. అది చాలా సహజమనీ, అలాటివాటికి కూడా ఆర్భాటం చేయటం మంచిది







కాదనీ. మనసుకు సంబంధించిన ఒకానొక అద్వితీయమైన అనుభవం అనీ — చెప్పినా అర్థం చేసుకోలేదు. ఆ తరం అంతే!' అనుకున్న వెంకటరత్నం విసుగ్గా "మీ యిష్టమొచ్చినట్లు ఏడవండి" అనేసి వీధిలోకి వెళ్ళిపోయాడు.

"అయ్యో! పిల్లడా! అన్నీ కలికాలం మాటలే కదా!" లోనికి వెళ్ళి కాలెండరు తీసింది సత్యవతి. వెంకటేశ్వరరావుని పిలిపించి అతడితో వియ్యాలవారికి కబురు పంపింది.

ఆ సాయంత్రం ఇంటికి వచ్చిన వెంకట్రామయ్యగారితో కోడలి రాకను గురించి చెబుతూ సత్యవతమ్మ అన్నది — "అయ్యో! అదేమిటండీ! కూతురు తొలిసారి అత్తవారింటికి వెళ్తూంటే కాస్త చలిమిడి ముద్ద అయినా చేసి ఇవ్వరూ! చీరెలూ, సారెలూ లేకపోతేపోనీండి! కాపురానికి వస్తూంటే కనీసం తిండి తినే కంచాలూ, పడుకునే మంచాలూ అయినా లేకుండా నాలుగు చీరలతో ఎవరయినా పంపిస్తారటండీ! పెళ్ళిలో అంత ఘనంగా చేసినవాళ్ళు ఇపుడు ఇలా చేయటానికి కారణం ఏమై ఉంటుందంటారు?... ఆఁ — ఏముంటుందిలే! అపుడు మందిలో ఘరానాగా ఉండాలని అలా చేసారు! ఇపుడు చూసేది మీరూ, నేనేగా! అయినా ముగ్గురు తోడబుట్టినవాళ్ళూ, పినతండ్రులూ, పెదతండ్రులూ — అంత పెద్ద బంగం ఉండగా ఇట్లా దిక్కులేనివానిలాగా వాడివెంబడి రావటం — నాకేదో అనుమానంగా ఉంది సుమండీ."

అన్నీ తానే చెప్పుకుపోతూన్న సత్యవతమ్మ మాటలను ఆశ్చర్యంగా వింటూ ఆలోచిస్తున్నారు వెంకట్రామయ్యగారు. అపుడే వచ్చిన వెంకటరత్నం తల్లి మాటలు విని ఉలిక్కిపడ్డాడు. గదిలో ఉన్న తారకూ వినిపించాయి, ఆ మాటలన్నీ. అత్తగారన్న దానిలో తప్పులేదు. కాని, ఆమెలోని 'సాధింపు' మాత్రం తారను కొంత బాధపెట్టింది.

* * *

తారకు ఆ యిల్లు, ఆ యింట్లోని మనుషులు గమ్మత్తుగా అనిపిస్తారు. పెద్దపిల్ల గిరిజ చదువు మానేసింది. రెండో అమ్మాయి కళ్యాణి హిందీ చదువుతోంది! మూడో అమ్మాయి దమయంతి మాత్రం అంగలూరు హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నాది. దమయంతి ప్రొద్దుటే అన్నం తినేసి క్యారియర్‌లో కొద్దిగా అన్నం

తార

పెట్టుకుని స్కూలుకు వెళ్ళిపోయేది! కళ్యాణి తీరిగ్గా ముస్తాబయి నాలుగిళ్ళ అవతల ఉన్న హిందీ మాస్టారింటికి వెళ్ళిపోయేది! వెంకట్రామయ్యగారు పొలానికీ, వెంకటరత్నం కాలింగు కంపెనీకీ వెళ్ళిపోయేవారు! ఇంక ఇంట్లో ఉండేది సత్యవతమ్మ, గిరిజ, తార!

తార వచ్చిన క్రొత్తల్లో అసలు ఆ యింటి పద్ధతులు ఓ పట్టాన అర్థం కాలేదామెకు. ప్రొద్దుటే బయలుదేరే దమయంతి కోసరంగా కాసిని బియ్యం వండి, కాస్త కూర వండేది సత్యవతమ్మ! మరికాసేపటికి మగవాళ్ళ కోసం వండేది! ఇంకాసేపటికి బయలుదేరే కళ్యాణి కోసం మళ్ళీ వండేది! అంతా వెళ్ళిపోయాక ఇంట్లో ఉండేవాళ్ళ కోసం వేరే వండేది!

భోజనాలయ్యేసరికే ఒంటిగంట అయ్యేది! మళ్ళీ రెండునించీ కాఫీలు మొదలు! సాయంకాలానికి ఏ పకోడీలో, ఏ బజ్జీలో చేస్తుండేది! అది అయ్యాక మళ్ళీ రాత్రికి వంట... రావణాసురుడి కాష్ఠంలా ఆ పొయ్యి ఎపుడూ మండుతున్నట్లే ఉండేది! పని అయినట్లుగానూ ఉండేదికాదు; పని ఉన్నట్లుగానూ ఉండేదికాదు! ఈ లోపున వెంకటరత్నం ఎవరెవర్నో తీసుకొచ్చి "తారా! నలుగురికి కాఫీ పంపు!" అనేవాడు. "తారా! ఆరుగురికి టీ, టిఫినూ కావాలి!" అనేవాడు.

"తారా! ఇవ్వాళ ముగ్గురు భోజనానికి వస్తారు" ఇలాటివి పురమాయిస్తూ ఉండేవాడు.

తారకు అయోమయంగా ఉండేది!

ఉదయాన్నే లేచి నౌకరు ఆ రోజుకు కావలసిన ఖర్చులు కోమటి కొట్టుకెళ్ళి తెచ్చేవాడు! మరురోజు మళ్ళీ మొదలు! ఆ యింటి పద్ధతులూ, ఖర్చులూ, అలవాట్లూ చూస్తుంటే తారకు ఖంగారుగా ఉండేది! పైగా నాగరత్నమ్మ అతిజాగ్రత్తకు అలవాటుపడిన తార, సత్యవతమ్మ అతి దుబారాను చూస్తూ మరీ విసుపోయేది! 'మనుషులు ఇలాగ కూడా బ్రతుకుతుంటారు కాబోలు!' అనుకునేది.

* * *

తార వచ్చి నెలరోజులు అయిపోయింది. ఈ నెలలోనూ నెమ్మది నెమ్మదిగా పనులన్నీ ఒక్కటొక్కటిగా కోడలిపై వదిలేసి అత్తగారు విశ్రాంతి తీసుకుంటున్నారు! ఆడపిల్లలకు అసలు పనిచేసే అలవాటే ఉన్నట్లు లేదు. పైగా అపుడపుడూ "ఒదినా నా తుండు తీసావా? ఒదినా నా లంగా చూసావా? ఒదినా నాకు కాస్త తల చిక్కు తీస్తావా? ఒదినా వంట అయిందా? ఒదినా నా పెన్ను కన్పించిందా?" అంటూ చిన్న చిన్న పనులకు కూడా తారమీద ఆధారపడుతుండేవాళ్ళు!

ఆర్థిక ఇబ్బందులు లేకపోవటం మూలంగా మనుషుల్లో పెద్దగా చీకాకులు ఉండేవికావు. అందరి మధ్యా స్నేహభావమే ఉండేది! అపుడపుడూ మాత్రం సత్యవతమ్మకు అత్తగారి హోదా గుర్తుకొచ్చి తారను తుమ్మముళ్ళతో గుచ్చినట్లుగా మెత్తమెత్తగా సాధిస్తుండేది!

గిరిజ, తార దాదాపు ఒక వయసువాళ్ళే! అయినా గిరిజమధ్యా, తారమధ్యా పెద్దగా స్నేహం కలవలేదు. తార అలవాట్లకూ, తార పద్ధతులకూ, గిరిజ అలవాట్లకూ, గిరిజ పద్ధతులకూ చాలా తేడా ఉంది. కొన్ని విషయాలలో ఆడపడుచు చేసే కొన్ని పనులు చూస్తే తారకు చిరాకూ, కోపం కూడా వచ్చేవి.

మరో రెండు మూడు నెలలు జరిగేసరికి ఇంట్లో ఎవరూ ఎదురుచూడని చిన్న చిన్న మార్పులు చాలా వచ్చాయి! అదికూడా తార తెలివితేటలవల్లా, ఆమె చాకచక్యంవల్లా, ఆ మార్పులు వచ్చినట్లు ఆ ఇంట్లో వాళ్ళు కూడా పసికట్టలేని విధంగా ఆ మార్పుల్ని తీసుకొచ్చింది తార. ఇప్పుడు ఆ ఇంట్లో పనులు తారకు అలవాటయినాయి అనేకంటే తార పనులకు ఆ యింట్లోవాళ్ళు అలవాటు పడిపోయారు అనవచ్చు! ఎందువల్లనంటే ఇపుడు వంట ఏడుసార్లు జరగటం లేదు! అందరకూ కలిపి ఒక్కసారే — ఉదయాన్నే చేసేస్తుంది తార.

దమయంతికి క్యారియర్‌లో సర్దేసి స్నానం కూడా చేసేస్తుంది. తొమ్మిదిగంటలకు వెంకటరత్నం భోజనానికి వచ్చేసరికి శుభ్రంగా, చక్కగా తయారై వడ్డించుతుంది. మొదట్లో 'గిరిజా స్నానం చెయ్, గిరిజా స్నానం చెయ్' అంటూ పది నిమిషాలకోసారి చొప్పున ఓ ఇరవైసార్లయినా చెప్పేది. ఇపుడు చెప్పటం మానేసింది. అసలు ఆ పిల్లకు సాయంత్రం అయితేగానీ స్నానం చెయ్యబుద్ధేసేది కాదు. అది తెలుసుకున్నాక తార మళ్ళీ చెప్పలేదు. సత్యవతి మాత్రం స్నానం చేస్తేగానీ భోజనం చేసేదికాదు. ఇపుడు సరుకులు కూడా ప్రతిరోజూ తేవటం లేదు.


మీకు మీరుగాగమనించండి!

ఇతర డిటర్జెంట్ ఉతికే బిళ్ళ లకన్నా బరువు రెండు రెట్లు ఎక్కువ. ధర కేవలం కొద్ది పైసలు ఎక్కువ!

300 గ్రాములు రూ. 3·20 (స్థానిక పన్నులు అదనం)

టోటల్

నీలి డిటర్జెంట్ ఉతికే బార్



మొదటి "నిజమైన" డిటర్జెంట్ బార్!

టోటల్ - ఉతికే బార్ రీతిలో ఉన్నది.
మరియు అధికమైన శుభ్రపరిచే నీలి
డిటర్జెంట్ శక్తి ఉన్నది.
మరి ఇంకేమి? పొదుపుగ
ఉతికేందుకుగాను ఇది ఐదు చేతికనువైన
భాగాలు కలిగివుంది.

కేవలం కొద్దిపైసల హెచ్చుకే రెండు రెట్లు బరువు!

ఒక నిర్దిష్టమయిన డిటర్జెంట్ కేక్ 125 గ్రాముల బరువు
కలదానికి మీరు ఎంత ఖర్చుపెడుతున్నారు?
250 గ్రాముల "టోటల్" ధర కేవలం రూ. 2.67.
(300 గ్రాములకి రూ. 3 20). అదీను మామూలు డిటర్జెంట్ కేక్‌లకన్న
రెండు రెట్లు బరువు ఎక్కువ. కేవలం కొద్ది పైసల హెచ్చుకే!

ఉతుకుటకు
చేతికనువుగా
ఐదు భాగాలు.

ఆంధ్రప్రదేశ్, బీహార్ మరియుతమిళనాడులలో దొరుకును.

కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్,బెంగుళూరు వారి ఒక నాణ్యమయిన ఉత్పాదన.
మార్కెట్ చేయువారు - మైసూరు సేల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బెంగుళూరు

MCA-TDB-51-Tel

నెలకోసారి గుడివాడ నుండి తెప్పించి, శుభ్రం చేసి దాచేది. వంటగది కూడా వారానికోసారి శుభ్రంగా అలికించి ముగ్గులు పెట్టేది.

తమ గదిని ఎప్పటికప్పుడు దులిపి శుభ్రంగా ఉంచుకునేది. నాలుగురోజులకోసారి దుప్పటి, దిండ్ల గలేబులూ ఉతికించుకునేది. మంచంపైన పరుపు మలిపి, దుప్పటి దులిపి వేయగానే గిరిజ గబగబా వచ్చి మంచమెక్కి పడుకునేది. తారకు ఒళ్ళంతా గండు చీమలు పాకుతున్నట్లుండేది! ఆమెకు సుతరామూ నచ్చని పన్లలో ఇది మొట్టమొదటిది! అసలు వెంకటరత్నం లేకపోతే ఆ పడకపై పడుకుని దుప్పటి నలపటానికి తారకే మనసు ఒప్పదు అలాంటిది ఆమె అలా పడకపై ఎక్కితే తారకు ఎంతో చికాకనిపించేది. మొదట్లో ఏమీ అనలేక ఊరుకునేది. కానీ, తర్వాత మెల్లిగా చెప్పింది— "అట్లా ఇంకోళ్ళ మంచంపై పడుకోవటం తప్పు."

కాని, అసలైన జ్ఞానం తక్కువైనా, మిడిమిడి జ్ఞానం ఎక్కువైనా ఉన్న గిరిజ "ఇది ఇంకోళ్ళ మంచం ఎట్లా అవుతుందొదినా. మా అన్నయ్యదేగా!" అని అడిగింది.

మరి మాట్లాడలేదు తార.

ఒకరోజు అనుకోకుండా సమయం కాని సమయంలో ఇంటికొచ్చిన వెంకట్ తన మంచంపై పడుకుని ఉన్న గిరిజను చూసి చిరాకు పడ్డాడు. అసలు అతనికి చిన్నప్పట్నుంచీ అట్లా ఎవరైనా తన మంచంపై పడుకోవటం ఇష్టముండదు. ఆ విషయం గిరిజకూ తెలుసు. కాని వదినపై ఉండే ఈర్ష్యకొద్దీ అన్నయ్యలేని సమయంలో అలా ప్రవర్తించేది! ఒకసారికంటె ఎక్కువ మాట్లాడని తారను, ఎంత కోపం వచ్చినా పెదవి విప్పని తారను ఎలాగయినా రెచ్చగొట్టాలి అన్నట్లు ప్రవర్తించేది.

మధ్యాహ్నం పూట ఎపుడయినా వెంకటరత్నం ఇంట్లో ఉంటే భోజనాలయ్యాక అతని దగ్గరకు వచ్చి కూర్చునేది తార. వెంటనే గిరిజ కూడా వచ్చేది. ఇలాటి సున్నితమైన విషయాలలో చెల్లెల్ని ఎలాకోప్పడాలో తెలియని వెంకటరత్నం తారపై విసుక్కునేవాడు.

"అదొక మొద్దు! నువ్వూ మొద్దువేనా! మొగుడి దగ్గరకు వస్తూ తలుపులు వేసిరావాలి అని

తార

తెలియదూ!" అని నెత్తిమీద ముద్దుగా మొట్టికాయ వేసేవాడు. ఆనాటి నుంచీ వెంకటరత్నం ఇంట్లో ఉన్నపుడు తార గదిలోకి వస్తూనే తలుపులువేసి గడియపెట్టేది. అలా నాలుగైదుసార్లు జరిగాక సత్యవతమ్మ సాధింపులో మరోకొత్తమాట వెలిసింది— "అవ్వ! మా కాలంలో మేం ఎరుగమమ్మా, పగలే గదుల్లో దూరి తలుపు వేసుకోవటం! అవ్వ! వెనకాల వయసొచ్చిన ఆడపిల్లలున్నారన్న జ్ఞానమయినా లేదు."

సిగ్గుతో చచ్చిపోయింది తార.

*   *   *

గిరిజకు మేనత్తకొడుకుతో వివాహం నిశ్చయమయింది. ఇంట్లో పెండ్లిపనులు ఆరంభమైనాయి. హడావుడిగా ఉంది. ఆ సమయంలోనే వెంకటరత్నం కాలింగు కంపెనీలో ఉద్యోగం మానేసి సి. వి. రెడ్డి ఫౌండ్రీలో చేరాడు.

తార కాపురానికి వచ్చి ఆరు మాసాలవుతున్నాది. ఇంతవరకూ పుట్టింటి నుండి ఎవరూ రాలేదు. కనీసం ఉత్తరం అయినా వ్రాయలేదు. సత్యవతమ్మకు అసలు విషయం తెలియకపోయినా 'ఏదో రహస్యం ఉన్నాది' అని మాత్రం తెలుస్తున్నాది. ఈ మధ్య మాట మాటకూ ఆ విషయంలో దెప్పుతూనే ఉన్నాది.

ఆ రోజు ఇంటికి సున్నం కొట్టించారు. పగలు పసుపు దంపించారు. ఇల్లంతా సర్దుకునేసరికి తారకు ఒళ్ళంతా నెప్పులు అనిపించింది. ఆ సమయంలో కూడా తల్లీకూతుళ్ళు ముందర వరండాలో కూర్చుని గట్టి పకోడీలు తింటూ కబుర్లు చెప్పుకుంటున్నారేగాని ఇవతలకు రాలేదు; పనిలో సహాయం చేయలేదు. తారకు కోపంగా ఉన్నది. తనకే శక్తి ఉంటే మంత్రం నీళ్ళు జల్లి రాళ్ళుగా అయిపోయేట్లు శపించాలని ఉంది వాళ్ళని. అలాగే లేని ఓపిక తెచ్చుకుని అన్నం వండి, పప్పుచారు కాసింది. ఇంక కూర వండే ఓపికలేని తార గదిలోకి వెళ్ళిపోయి పడుకుంది.

చీకటి పడింది! దీపాలు వెలిగించలేదు. కనీసం ఎందువల్లనో, ఏమిటో చూద్దామని ఒక్కళ్ళుకూడా అనుకోలేదు! తారకు లేవాలనీ ఉంది... దీపాలు వెలిగించాలనీ ఉంది! కానీ, శరీరం లేవలేనంటున్నాది. ఏదో మగతగా ఉంది.

ఆ రోజు వెంకటరత్నం చిరుచింతల గ్రామంలో జరిగిన కమ్యూనిస్టు మీటింగుకు వెళ్ళి, అక్కడ్నుంచీ అడ్డదారిన చేలల్లోంచి ఇంటికి వచ్చాడు. వెనుక గేటు తీసుకుని దొడ్లోకి వచ్చిన వెంకటరత్నం ఇల్లంతా చీకటిగా ఉండటం గమనించి తెల్లబోయాడు. పాలేరు గేదెల దగ్గర శుభ్రంచేసి, గడ్డి వేస్తున్నాడు. వెనుక వాకిలిగుండా లోపలకు వచ్చాడు వెంకట్. వంట గదికి గొళ్ళెం పెట్టి ఉంది. గదిలోకి వెళ్ళాడు. తార మంచంపై ముడుచుకుని పడుకొని ఉంది.

"తారా" కించిత్ ఆశ్చర్యం ప్రతిధ్వనించింది ఆ కంఠంలో.

తారకు ఆ పిలుపు వినిపించింది. వెంకటరత్నం వచ్చాడని తెలిసి లేవాలని ఆశపడుతున్నాది. కాని...

తార లేవలేదు! కనీసం "ఊఁ—" అనికూడా బదులుపలకలేదు. ఆశ్చర్యపోయాడు వెంకటరత్నం.

"ఏమిటి! ఈవేళప్పుడు ఇలా పడుకున్నది!" ఆలోచిస్తూనే పాంటు తీసి వంకెకు తగిలించి టవలు చుట్టుకుని స్నానానికి వెళ్ళబోతూ, ఆగి, తారకు దగ్గరగా వచ్చాడు.

"తారా" మృదువుగా పిలుస్తూ నుదుటిమీద చేయి వేశాడు.

ఝల్లుమన్నది!


పొయ్యిమీది పెనంలా కాలిపోతున్నాది తార శరీరం!


"తారా, తారా! ఏమైంది?" ఆందోళనగా, ఆతృతగా అడిగాడు.


బలవంతంగా కళ్ళు తెరచి చూసింది తార. ఆ చిరుచీకట్లలో కూడా తార కళ్ళు జ్యోతుల్లా ఉండటం గమనించాడు వెంకటరత్నం.


"సరే, పడుకో! నేను వెళ్ళి డాక్టర్ని తీసుకొస్తాను." టవలు తీసి, మళ్ళీ పాంటు వేసుకుని బయటకు వచ్చాడు.

ఎవరూ కనిపించలేదు. ఛర్రున కోపం వచ్చింది వెంకట్‌కు.









"ఇంట్లో అంతా ఏమయ్యారు? చచ్చిపోయారా?"

వెంకటరత్నం అరుపుకు హడలిపోయారు వరండాలో ఉన్న ఎలుగుర్రూము. గబగబా పకోడీల డబ్బాని కిటికీలో పెట్టేసింది. అప్పటికే వరండాలోకి వచ్చేసాడు వెంకట్.

"సిగ్గు లేదూ! అంబోతుల్లా పెరుగుతున్నారే తప్ప కాస్తయినా బుద్ధిలేదు. చీకటి పడింది. దీపాలు వెలిగించాలని తెలియదూ!"

"అయ్యో! కోడలుపిల్ల వెలిగిస్తుంది కదా అని ఇపుడే ఇట్లా వచ్చి కూర్చున్నామురా. తార వెలిగించలేదా? సర్లే — నేనే వెలిగిస్తాలే!... రామచంద్ర ప్రభూ!" అంటూ లేచింది సత్యవతమ్మ.

తల్లి మాటలకు వెంకటరత్నం కోపం ఇంకా పెరిగింది.

"ఏ పని చేయటానికీ కోడలుపిల్ల, కోడలు పిల్ల! అది మనిషికాదా! దానికి జ్వరమొచ్చి పడుకుంటే మీకేమయినా చీమకుట్టినట్లయినా ఉందా! కబుర్లు చెప్పుకుంటూ హాయిగా లింటు కూర్చున్నారు. ఛీ, ఛీ! మిమ్మల్ని ఎవ్వరూ మార్చలేరు. మీ ఖర్మ!" చరచరా బయటకు వెళ్ళిపోయాడు వెంకట్.

* * *

1944లో 'అఖిల భారత రైతు మహాసభలు' బెజవాడ పున్నమ్మతోటలో జరుగుతున్నాయి. పదిరోజుల క్రితమే చెప్పాడు - వెంకటరత్నం. ఈ మీటింగుల గురించి చెబుతూ "నువ్వు కూడా రావాలి" అని ఖచ్చితంగా చెప్పాడు.

"రైతు మహాసభలకూ, మీకూ సంబంధం ఏమిటండీ?" అమాయకంగా అడిగింది తార.

నవ్వాడు వెంకట్.

"అవి మేమే కండక్టు చేస్తున్నాము. సమిష్టి వ్యవసాయాన్ని గురించి, దాని ఆవశ్యకత గురించి వివరిస్తారు. రైతులకున్న అనేక సమస్యల గురించి చర్చిస్తారు. ఇం కాకుండా అనేక విజ్ఞానాత్మకమైన విషయాలు ఎన్నో తెలుస్తాయి. కమ్యూనిస్టుపార్టీ ఆశయాలు అర్థమవుతాయి. చాలా! ఇంకా చెప్పాలా?"

నవ్వింది తార.

అతడి ముందర నవ్వేందేగానీ తారకు చాలా భయంగా ఉన్నది.

గిరిజకు పెళ్ళి అయిన తర్వాత మూడు నిద్రలకు అత్తగారింటికి వెళ్ళి వచ్చింది. అంతే! మళ్ళీ అత్తవారింటికి వెళ్ళలేదు. ఒక్కడే కొడుకతను! పైగా తండ్రిలేడు. అలాటి నారాయణరావు కూడా

ప్రగతి సంక్రాంతి

భోగిమంటల చుట్టూ సల్లాపనాదాలు
పరువాల వేదాలుగ సంక్రమించాలి నేడు.
శిథిలమైన మానవత నవతా సుమవల్లరిగా
సంక్రాంతి బంతిపూవుల్లో పరిమళించాలి.
ప్రతిమనిషిలోన సమతా మమతలు సందడిగ
ముంగిళ్ళ రంగవల్లికల రూపున అల్లుకుపోవాలి.
చికాకు చంచలత్వాల చలులు చెదరి బెదరి
ఉదయభానుని నులివెచ్చని కిరణాల విర్మూలన కావాలి.
పైరు పచ్చల్లో, ధాన్యలక్ష్మి లావణ్య లాస్యాలలో
సౌజన్యం, సౌభ్రాత్రం సదా మిసమిసలాడిపోవాలి.
బండ్లకెత్తేటి రేగుపండ్లలో చైతన్యపు భోగభాగ్యాలు
భువినుండి దివికి ప్రతిరూపంగా పరివర్తన జరగాలి.
హేమంతుల పూబంతుల నవ లావణ్యంలో
అక్రమాల అవినీతుల తమసులంతరించిపోవాలి.
ప్రగతికి సంక్రాంతి ప్రతీకగకాగా, రాగా
జగతినిండా జాగృతి అభ్యున్నత నృత్యం గావించాలి
అవాడే మన కందరికీ నిజమైన సంక్రాంతి క్రాంతి
అందాకా నవతా భావనల కవితా గీతులే మన గతి.

— "మచంద్ర"

తల్లిని ఒంటరిగా వదిలేసి వచ్చి అత్తగారింట్లోనే ఉండేవాడు. పిల్లలు హాల్లో పడుకునేవారు. గిరిజకూ, నారాయణరావుకూ ఆ గదిని ఇచ్చారు.

పెళ్ళి అయ్యాక గిరిజలో మరో రకం కుతూహలం ఎక్కువయ్యింది. ఇదివరకులాగా తారా, వెంకట్‌లు గదిలో ఉంటే గబుక్కున రావటం మానేసింది. కాని, గది బయట ఉండి తలుపుల మధ్యలో ఉండే సందులో నుంచి తొంగి చూసేది.

ఒకసారి తార గమనించింది. కాని, ఇలాటివి వెంకటరత్నంతో చెప్పేవా బాగుండదు; ఆడపడుచును మందలించబోయినా అల్లరి అవటంతప్ప వేరే ఏం ఉండదు! కానీ, అలాగని ఊరుకోవటానికీ వీలు లేదు! అది చాలా చెడ్డ అలవాటు! అందుకని ఒకరోజు అలా తలుపు సందుల్లోంచి చూడటం గమనించిన తార గబుక్కున తలుపులు తెరచి బయటకు వచ్చింది. పట్టుబడిన దొంగలా నిలబడిపోయింది గిరిజ.

"ఏమిటి గిరిజా? ఏంకావాలి? ఏంచేస్తున్నావు?" అడిగింది.

"అబ్బే! ఏమీ వద్దు వదినా." నానేసింది గిరిజ.

"అహా — తలుపు సందుల్లోంచీ తొంగి చూస్తుంటేనూ ఒకవేళ మీ అన్నయ్య కోపం చూస్తున్నావేమో అని అనుకున్నానులే." వంట గది వైపు నడిచింది.

ఆ మాటలకు గడపదగ్గర ఉన్న గిరిజా, కాస్త అవతల కూర్చుని ఉన్న సత్యవతమ్మా, గదిలో ఉన్న వెంకటరత్నమూ — అందరూ తెల్లబోయారు.

నల్లటి గిరిజ ముఖం అవమానంతో ఎర్రగా కమిలింది. సత్యవతమ్మ కూడా కోపంతో పళ్ళు పటపటా కొరుక్కుంది. ఇంక ఆ రోజునుంచీ వెంకటరత్నం లేని సమయాల్లో తల్లీ కూతురూ కలిసి తారను ఏవేవో మాటలతో అవమానించేవారు. అసలు మాట్లాడటం చాలావరకూ తగ్గించేసారు! ఒకవేళ ఎపుడయినా, ఏదయినా మాట్లాడినా అది సాధింపుగానే ఉండేది!

(ఇంకా వుంది)



ఆనందాల పంట
...దాన్ని పెంచి పోషించేది జై కిసాన్

జైకిసాన్ మీ పంటలను పెంచి పోషిస్తుంది, మీ కలల్ని నిజమని నిరూపిస్తుంది. అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గల జైకిసాన్ శక్తివంతమైన ఎరువులు భూమిలో వెంటనే కరిగి మీ పంటలకు అపారమైన శక్తినీ, తక్షణమైన పెరుగుదలనూ చేకూరుస్తాయి. మీ పైర్లతోపాటే మీ భాగ్యంకూడా వికసిస్తుంది ...మీకు హెచ్చు దిగుబడినీ, దాంతోపాటు హెచ్చు సంపదనూ ఇస్తుంది జైకిసాన్. గుర్తుంచుకోండి, ప్రతి పంటకు, ప్రతి భూమికి అవసరానికి తగిన పాళ్లలో వేయడానికి జైకిసాన్ ఎరువు ఉంది. జైకిసాన్ ఎరువుల విస్తృతమైన శ్రేణిలోంచి మీరు మీకు కావలసినదాన్ని ఎంచుకోవచ్చు.

జై కిసాన్ యూరియా 46.4% నత్రజని అతి తెల్లటిది, అతి స్వచ్ఛమైనది, అతి శక్తివంతమైనది. దీనిలో బైయూరేట్ పాలు అతి తక్కువ (0.5% కంటే తక్కువ). అందుచేత ఆకుల మీద పిచికారి చేయడానికి సురక్షితమైనది. అన్ని పంటలకూ భూమిమీద పై చల్లుగా అనువైన ఎరువు.

జై కిసాన్ యూరంఫాస్ 28:28:0 అత్యధికంగా నత్రజనీ, ఫాస్ఫేటూ సమానమైన పాళ్లలో గల శక్తివంతమైన ఎరువు. దాదాపు పూర్తిగా నీటిలో కరుగుతుంది. దీనిలోని రెండు పోషక పదార్థాలూ కూడా ఒకే సమయంలో భూమిలో కరిగి పెరుగుతున్న పంటకు అందుబాటులో ఉంటాయి.

జై కిసాన్ సంపూర్ణ 19:19:19 అతి చిక్కనైన కాంప్లెక్స్ ఎరువు. దీనిలో నత్రజని, ఫాస్ఫేటు, పొటాష్‌లు సమానమైన పాళ్లలో ఉన్నాయి. దాదాపు పూర్తిగా నీటిలో కరిగే ఈ ఎరువులో 57% పోషక పదార్థాలున్నాయి. అవన్నీ ఒకే సమయంలో భూమిలో కరిగి పంట వాటిని సులభంగా గ్రహించడానికి వీలు పడుతుంది. పొటాష్ లోపం గల భూములకు జైకిసాన్ సంపూర్ణ ప్రత్యేకించి లాభదాయకమైనది.

జైకిసాన్ యూరంఫాస్, సంపూర్ణ ముఖ్యంగా అధిక దిగుబడి రకపు వరి, చెరకు, కాయగూరలు, పత్తి, జొన్న, గోధుమ మొదలైన పంటలకు బాగా అనువైనవి. అంతేకాదు, కాఫీ, తేయాకు లాంటి తోట పంటలకూ, మామిడి, కమలా, నారింజ, అరటి మొదలైన పండ్ల తోటలకూ కూడా ఎంతో అనువైనవి.

జై కిసాన్ సౌభాగ్య 14:35:14 నత్రజని, పొటాష్‌లు దీనిలో సమానమైన (ఒక్కొక్కటి 14%) పాళ్లలో ఉన్నాయి. పైగా 35% ఫాస్ఫేటు కూడా ఉంది—అంటే మొత్తం 63% పోషక పదార్థాలు ఉన్నాయన్నమాట. ఫాస్ఫేటు హెచ్చుగా ఉండటం వల్ల జైకిసాన్ సౌభాగ్య ముఖ్యంగా వేరుశనగ, ఇతర నూనె గింజల పంటలకూ, పప్పు దినుసుల పంటలకూ బాగా అనువైనది. దుంపజాతి పంటలైన బంగాళాదుంప (అలుగడ్డ), పసుపు, కందమూలం, ఉల్లి మొదలైనవాటికి కూడా ఎంతో మంచిది. చెరకు, పత్తి పంటలకూ, ఏలకులు మొదలైన తోట పంటలకూ కూడా ఉపయోగకరమైనది.

జై కిసాన్ డయంఫాస్ 18:46:0 డయంఫాస్ 18:46:0 లో 18% నత్రజని, 46% ఫాస్ఫేటు ఉన్నాయి. అత్యధికంగా పాళ్లు కలిగిన కాంప్లెక్స్ ఎరువు అయినందువల్ల తక్కువ పరిమాణంలో వేస్తే చాలు. అందుచేత ఖర్చుకూడా చాలా తక్కువ. ఈ ఎరువు ప్రత్యేకించి, హెచ్చుగా ఫాస్ఫేట్ కావలసిన పంటలకు అంటే వేరుశనగ, పప్పు దినుసులు, నూనె గింజలు మొదలైన వాటికి, పసుపులాంటి దుంపజాతి పంటలకూ అనువైనది. చెరకు, పత్తి పంటలకు కూడా మంచిది.

జై కిసాన్ ఎరువులు - అత్యంత శక్తికీ, సత్వర పెరుగుదలకూ



జువారి అగ్రో కెమికల్స్ లిమిటెడ్, గోవా.
ప్రాంతీయ విక్రయ కార్యాలయాలు: కర్నూలు, సికింద్రాబాద్, బెంగుళూరు, హుబ్లి, కొంకణ్, నాగపూర్, పూనా.
మీ జైకిసాన్ ఎరువుల్ని జువారి వారి పసుపు పచ్చ దుకాణాల్లో కొనుక్కోండి.





ఖూనీ

కూర్మయ్య



బుద్ధి దీపం మినుకు మినుకు మంటు వెలుగుతోంది. రకరకాల పురుగులు ఆ దీపం చుట్టు తిరుగుతున్నాయి. కొన్ని ఆ మంటలో తమ ప్రాణాల్ని కోల్పోతున్నాయి. తమ ముందే తమలాంటి జీవులు నాశనమైపోతున్నా ఆపురుగులు మాత్రం దీపంబుద్ధి చుట్టు ప్రదక్షణలు చేస్తూనే ఉన్నాయి

అలాగే చాపమీద పడుకొన్న రత్తం ఆలోచనలు కూడ మెదడు చుట్టు...

గిట్టిగా ఓ సిట్యూర్పు విడిచి రెండేళ్ళ కుర్రాణ్ని జోకొడుతు మళ్ళీ ఆలోచిస్తూనే ఉన్నాడు.

''ఏంచెయ్యాలి'' అనే మనసులోని ఈ ప్రశ్నకు మాత్రం సమాదానం ఎంత వెదికినా దొరకడంలా.

పెళ్లై పదేళ్ళు నిండొస్తున్నా చంటిబిడ్డ ఏడుపు ఇంట్లో వినిపించకపోయినప్పుడు ఇంతగ ఆలోచించలేదు.

పడక దగ్గరకు చేరిన పార్వతీ మందులనీ మంత్రాలనీ, మొక్కుబడులనీ ఎన్ని ఎకరువు పెట్టినా, ఏడుపే పెట్టినా వాటి గురించి ఇంతగా ఆలోచించ లేదు

పక్కింటి రాణిని ఉద్యోగం జేసుకొనేవాడికి వాళ్ళ అమ్మ బాబు కట్టబెదుతున్నప్పుడు ఓ రాత్రి అదొచ్చి ఏడ్చినప్పుడు తనూ దానిఒళ్ళొ తలబెట్టి ఏడ్చాడేకాని ఏంచేద్దామని మాత్రం ఇంతగా ఆలోచించలేదు.

వాళ్ళ బాబు జేసిన అప్పుకోసం ఇల్లు, ఇళ్ళస్థలం ఖాళీజేసి వెళ్ళిపోయినప్పుడు కూడా ఇంతగా ఆలోచించలేదు.

నీలా పాలేరుతనం జేసుకొనేవాళ్ళు స్టీలు గ్లాసులు కొంటున్నారని బోలెడంత సామాను సంపాదించు కొంటున్నారని, వాళ్ళ వాళ్ళ పేర్లు ఉదహరించి తననికూడా ఆలా సంపాదించమని అత్త పెళ్ళాం పాలుబ్వెట్టి చెప్పినప్పుడు కూడా ఇంతగా ఆలోచించలేదు.

పడక్కి చేరిన పార్వతి ''గవురుమెంటోళ్ళు గేదల్నిఊరిగే ఇత్తున్నరంట. నువ్వుకూడ ఓ కాగితం ఎట్టు'' అంటే,

''మనకెందుకేఎదవగొడవ,పిచ్చిపిచ్చిఆలోచల్నన్ని ఎట్టుకోక'' అంటు ఇంకోమాట అనడానికి అవకాశం లేకుండా చేసేవాడే కాని ఎప్పుడు దేన్నిగురించి ఆలోచించేవాడేకాదు.

వాడు పాలేరుతనం జేరిన దగ్గరనుండి ప్రొద్దుట వెళ్ళడం రాత్రికి ఇంటికి రావడం. పెళ్ళిగాక ముందు దొరోరింటికాడ రెండుపూట్ల భోజనం. పార్వతితో మనువైనాక మాత్రం ఇంటిదగ్గరే భోజనం. ఖాళి ఉంటె ఇంటికి రావడం లేకపోతే పెళ్ళాం భోజనం తీసుకు వెళ్ళడం.

జీతంగింజలు తెచ్చి ఇంటిదగ్గిర వెయ్యడం వరకే తనవంతు. తరువాత విషయాలేమి అతనికి పట్టవు. గానుగెద్దుల జీవితం గడిపెయ్యడం మినహా, ఆలోచించడమనే ఇబ్బందిని బుర్రకు ఎప్పుడు పెట్టలేదు.

నిస్సహాయుడైన చినబాబు ముఖం పదేపదే గుర్తొస్తోంది వాడికి. బాధతోకూడిన చినబాబు మాటలు పదేపదే మార్మోగుతున్నాయి వాడి చెవుల్లో.

ఎద్దులా కట్టపడ్డాడు, కుక్కలా విశ్వాసంగా బ్రతికాడు రాజారావుగారి దగ్గర. తన ఎనిమిదోఏడు కమతంలో జేరాడు. అప్పటినుండి ఇక్కడే. ఏ రోజు ఆయనతో నిష్ఠూరమైనమాట అనిపించుకోలేదు. ఈ రోజు ఆయనకు తెలియకుండ ఏంచెయ్యాలన్నా మనసు గిజగిజ లాడుతోంది రత్తంకు.

చిన్నప్పటినుండి రత్తం రత్తం అంటు తన వెంట తిరిగిన చినబాబు, తనకు పెళ్లైనప్పుడు కమతానికి నాగాపెడితే తనని చూసేవరకు గిజగిజ లాడిన చినబాబు, బడికి శలవున్నప్పుడల్లా తనవెనకే తిరుగుతు తన మాటలు వింటు, తను కోసిచ్చె పుచ్చకాయలు, దోసకాయలు, ముంజికాయలు, కొబ్బరికాయలు తిన్న చినబాబు, ఈ రోజుకు పెద్దవాడైనా పట్టణంనుంచి వచ్చిన తనతో కాసేపన్న మాటలు చెప్పె చినబాబు అడుగుతుంటే కాదన్నాడు కాని ... కాని మనసులో మాత్రం అవి తుఫానుని రేపుతున్నాయి.

ఇవాళ ఇంటికి చేరిన రత్తం స్నానం భోజనం అయిందనిపించి, తనతో ఒక్కమాట కూడా మాట్లాడకుండా చాపమీద నడుంవాల్చిన మొగుడి ప్రవర్తనకి కారణం తెలియక తికమక పడుతోంది పార్వతి.

రోజు ఇంటికి చేరిన దగ్గరనుండి చంటాణ్ని ఎత్తుకుని, వాణ్ని మురుచుకొంటు, వాడితోపాటే స్నానం భోజనం పూర్తిచేసి చాపమీద చేరి చెల్లియో చెల్లకో పద్యాలు రెండు మూడు పాడుతుంటె, చంటాడు వాడికి తోసిన కేకలు వాడేసేవాడు. అలసొచ్చిన శరీరంతో ఆనందంగా కాసేపు గడిపి, బాబుకొడుకులిద్దరు ఒకరికి తెలియకుండా, ఒకరు నిద్రలోకి జారుకునేవారు.

పార్వతి ఇల్లు సర్దుకొని ప్రక్కమీద చేరేసరికి ఒకనిద్ర తీసేవాడు రత్తం.

ఈ రోజు కొడుకుతో కూడ పలకకుండా అదేపనిగా ఎదో ఆలోచిస్తున్న రత్తాన్ని చేరింది పార్వతి ఇంటిపని పూర్తిచేసుకొని.

చాపమీద మొగుడి ప్రక్కని చాలసేపు

కూర్చుంది. చూసిన తనని గమనించిన రత్నంతో "దీపం తేసెయ్యనా" అంది.

"ఊఁ" అన్నాడు. ప్రశ్నకు సమాధానం చెప్పాలి అనేభావం మినహా అంగీకారమో అనంగీకారమో తేలదందులో.

దీపం తీసి దరిజేరిన పార్వతి మొగుడి రొమ్ము మీది రోమాలు మెల్లగా నిమురుతు "ఏంటి ఒక రకంగా ఉన్నావ్" అంది.

మౌనంగా ఉండిపోయాడు రత్నం.

వాడి జుట్టులోనికి వ్రేళ్ళు పోనిచ్చి తల నిమురుతు "ఏదో ఆలోచిస్తున్నావ్ నాకు చెప్ప కూడదా" అంది.

తన మనసులోని ఆలోచనల భారాన్నంత భార్యతోచెప్పి దించేసుకుందామనే అనుకున్నాడు.

"అరే, ఈ విషయం మనిద్దరికి తప్ప మూడో వాడికి తెలియగూడదురా రత్నం" అన్న చినబాబు మాట మనసుని కట్టేయడంతో —

"అఁ ఏంలేదే" అంటు మరోమాట మాట్లాడ నీయలేదు.

* * *

బంగారుగదూది పరుపుమీద సీలింగ్ ఫ్యాన్ క్రింద పడుకొన్న రాజారావుగారి చిన్నబ్బాయి భాస్కర్‌కు నిద్రరావడంలేదు.

రెండురోజుల్లో వాడిడబ్బు వాడికి ఇవ్వకపోతే తన పరువంతా మునిసిపాలిటీవారి మురుగుకాల్వలో కలిపేస్తాడు వాడు.

ఓ అమ్మాయి దగ్గరనుండి ప్రేమలేఖ రావడంతో రెండువందలు అప్పుతీసుకొని మరీ పార్టీ చేసి పారేశాడు. శేఖర్ ఇచ్చేటప్పుడే ఖండితంగా చెప్పాడు ఎలాంటి మొహమాటం లేకుండా చెప్పాడు, నాలుగు రోజుల్లో ఇచ్చెయ్యాలని. లేకపోతే వాడెలాంటివాడో భాస్కర్‌కు తెలుసు.

పార్టీ అయి రెండవరోజునే అడిగాడు డబ్బుగురూ అని. "ఇంటికెళ్ళి తెచ్చి ఇచ్చేస్తాను"అని సాయంత్రం వాడు చూస్తుండగానే క్లాసుకూడ ఎగ్గొట్టి బయలుదేరి ఇంటికి చేరుకొన్నాడు.

ఇంటికైతే చేరాడుగాని డబ్బు ఎలా అనేది మాత్రం ప్రశ్నగానే మిగిలిపోయింది.

రెండుమూడు వందలుకాదు రెండు మూడు వేలు దుబారాగా ఖర్చుచేసిన తన కుటుంబానికి వచ్చె నష్టమేమిలేదు. కాని...కాని తండ్రి రాజారావు మరీ కర్కోటకుడు.

"ఎంతకావాలన్నా తీసుకో, కాని ఎందుకు కావాలో మాత్రం చెప్పు" అంటాడు. తల్లి సుభద్రమ్మ మరీ గడుసుపిండం. "నాన్నగారినే అడక్కపోయావురా" అంటు సన్నాయి నొక్కులు నొక్కుతుంది.

సరె. అన్నగారి దగ్గరకు వెళదామంటే — ఓ అధికారి మీద మరో అధికారికి ఫిర్యాదుచేస్తే, ఏమిచెయ్యకపోగా ఫిర్యాదుపత్రం ఆ అధికారికే పంపినట్లు తండ్రిగారికి కబురుచేసి మరీ కనుక్కొంటాడు, "వీడికి డబ్బెందుకు ఇవ్వనన్నారు" అని.

అసలు చదువుకునేటప్పుడు వాడు గీచి గీచి ఖర్చుపెట్టడమే భాస్కర్‌కు ఇబ్బందై కూర్చుంది.

దొడ్డిలో రత్నాన్ని చూడగానే అమోఘమైన ఆలోచన వచ్చింది భాస్కర్‌కు. చిన్నప్పుడు వాణ్నే చూడకుండా ఉండడమే గగనమైపోయేదిగాని,ఇప్పుడు మాత్రం పాలేరోడు అనేభావం బలపడి పోయింది. కాని ఇప్పటికీ తను ఇంటికిరాగానే ఏవో కబుర్లు సంతోషంగా చెబుతూనే ఉంటాడు. వాడికి తనంటే వల్లమాలిన అభిమానం ఉందనేది భాస్కర్‌కు తెలుసు.

అలాంటి వెధవదగ్గర డబ్బులుండవనేదీ భాస్కర్‌కు తెలుసు

ఇంటికి పెద్దపాలేరు వాడే. అందుకే వాణ్ని ఆ చిన్ని సహాయం చేసి పెట్టమన్నాడు. కొండంత ధైర్యం నూరిపోశాడు. బయటపడే అవకాశం ఏం లేదన్నాడు. మనిద్దరి మధ్యే ఉండిపోతుందన్నాడు. నంద రకాలుగా ప్రాధేయపడ్డట్లు చెప్పాడు

"చినబాబూ! ఈ పనిమాత్రం నావల్లగాదు" అన్నాడు రత్నం.

"ఓరే రత్నం! ఇక నువ్వుమినహా ఈవిషయంలో నాకెవ్వరు సహాయం చెయ్యర్రా. డబ్బులేకుండా వెళ్ళడంకంటే చావడం మెరుగు. ఏం వీవౌతుంది చెప్పు ? నాన్నగారు ఇంటిదగ్గర లేరుగదా ! రెండు రోజులవరకు ఆయన ఎలాగూ రాడు. ఆయనకు తెలిసేది ఉండదు. అంతగా తెలిస్తే నేనున్నాను గదరా ! రేపుసాయంత్రం మాత్రం బండి మాట్లాడి సిద్ధం చేయించు" అని పరిపరి విధాల చెప్పాడు.

కాని రత్నం ఏమి మాట్లాడలేక ఇంటికి చేరుకొన్నాడు.

గేయాలు పంపేవారు వాటితో తపాలా కార్డు జత పరచవలసి వుంటుంది. గేయాలు త్రిప్పి పంపబడవు. గేయాలు, కవితలు సాధ్యమైనంత క్లుప్తంగా వుండటం మంచిది —సం.

కుక్కలా దొరోరి సొమ్ముకు కావలా ఉండడమే వాడికి తెలుసు. రహస్యంగా తనని చినబాబు అడుగుతున్నాడంటే, అది తనకేరోజైన ప్రమాదకరం అనే శంక లేదుగాని, దొరోరికి తెలియకుండా ఏది చెయ్యగూడదనే బలమైన భావం.

మాటలన్ని విని మౌనంగా వెళ్ళిపోయిన రత్నం తనకి సహాయపడతాడా? లేదా? అనేదిమాత్రంఅర్థం కాకుండానే ఉంది భాస్కర్‌కు. ఎప్పుడు తెల్లవారుతుందా? వాణ్ణి మళ్ళీకదిపి ఆపనిపూర్తిచేయిద్దామా అసలు ఆ వెధవ చేస్తాడా చెయ్యడా?అనే ఆలోచనలతో ముసుగు ప్రాముకొంటు ప్రక్కకు తిరిగాడు భాస్కర్.

* * *

పశులు అప్పుడే సందడి చేస్తున్నాయి.

రత్నానికి మెలకువ వచ్చింది. వాడి ఆలోచనలకు ఒకదరి కూడా ఎప్పుడో వచ్చింది.

బల్లిలా కావలించుకొని పడుకొన్న కొడుకుని వదలించుకొని లేచాడు. వాడి వళ్ళంతా వేడిగాఉంది. జ్వరంతోపాటు చలికూడా తగిలినట్లుంది వాడికి. సన్నగా వణుకు తున్నాడు. రాత్రి ఈ ఆలోచన్లతో దగ్గరే ఉన్నా వాడిగురించి పట్టించుకోలేదు. పక్కనే వేసుకు పడుకొన్నప్పుడు వాడివళ్ళు వేడిగాఉన్నా దాని గురించి ఆలోచించనేలేదు.

"ఓలేయ్, ఓలేయ్" అంటు పార్వతిని కంగారుగా తట్టిలేపాడు.

"పిల్లాడి వళ్ళంతా కాలిపోతోందే" అన్నాడు.

ఒక్కసారిగా కళ్ళు తెరిచిన పార్వతి "నిన్న సాయంత్రం నుంచే నలతగాఉంటే అన్నం పెట్టకుండ జావకాచి ఇచ్చాను" అని లేవకుండానే కొడుకుని ఒళ్ళోకి తీసికొంది.

"చలికూడా తగిలినట్లుందే" అన్నాడు, చొక్కావేసుకొని కండువా తీసుకొంటు. మనకంటే దానికేముందు తెలుసుగా అనే ధైర్యంతో కర్రచేత బుచ్చుకొని వెళుతు —

"సరె నేనెడుతున్నానుగాని పంతులమ్మ గోరి దగ్గర ఏమన్న మాత్రలుంటె అడిగి ఎయ్యి" అంటునే వెళ్ళిపోయాడు రత్నం.

ఆ రాత్రి రాజారావు జనపకట్టల నమిలో నుండి బండెడు జనపకట్ట రత్నంపేరుమీద ఊరు దాటడం, పట్నంలో అవి భాస్కర్ చేతిలోకి డబ్బు రూపంగా చేరిపోవడం జరిగిపోయాయి.

* * *

జనపకట్టలబండిని ఊరుదాటించి ఇంటికి చేరేటప్పటికి ఊరు, మాలపల్లి మంచినిద్రలో మునిగి పోయి ఉన్నాయి. పెళ్ళైనాక పదేళ్ళకుగాని పుట్టిన కొడుక్కు ఎలాఉందో అనేదిమాత్రం మనసులో పీకుతూనే ఉంది రత్నానికి మాత్రం

గడగడ వణకుతున్న కొడుక్కు దుప్పటికప్పి వాణ్ని గట్టిగా కౌగలించుకొని పడుకొంది పార్వతి, రత్నం ఇంటికి చేరేసరికి.

"ఎట్టా ఉందే"

"ఇంటికాడ బిడ్డకి ఇట్టాఉందని తెలుసుగా ఇప్పుడుదాక ఏంరాచకార్యాలు చచ్చినట్టు" అంది.

"పంతులమ్మగోరి దగ్గిర మందు ఏశావా"

"ఏశాను. నూరి పసరిత్తె అది ఏశాను" అంది చాపమీద నుంచి లేస్తు.

కొడుకు నుదిటిమీద చెయ్యిఉంచి "ఒరేయ్ ఒరేయ్" అంటు లేపాడు.

వాడు కళ్ళుతెరచి తండ్రివైపు ఒసారిచూచి మళ్ళీ వణుకుతో మూల్గటం మొదలెట్టాడు.

"ఇప్పుడుదాక ఎక్కడున్నట్టు" మళ్ళీ అడిగింది పార్వతి మొగుడికి అన్నం పెడుతు.

ఓసారి పెళ్ళాం ముఖంలోకి చూసి "నామి సర్దాల్చొచ్చింది లేవే" అన్నాడు.

"రాత్రిపూట నామిసర్దత్తారా ?"

"నేను వెళ్ళిన కాడినుంచి అట్టాగే ఉందా" అన్నాడు సంభాషణ మారుస్తు

"ఊఁ" అంది, ముందు నా ప్రశ్నకు సరైన సమాధానం కావాలన్నట్లు.

"రేపు మంగలి డాట్టరు దగ్గిరికి తీసికెడితే సూదిమందిస్తే అదే తగ్గిపోద్ది" అని గబగబా తిని చెయ్యి కడిగి కొడుకు దరిజేరాడు రత్నం.

మంగలి డాక్టరు సూదిమందు, అరుకు, మాత్రలు ఓ నాలుగు రోజులపాటు ఇవ్వడంతో కాస్త తగ్గుముఖం పట్టింది. అలాగే మరో రెండురోజులు గడిచిపోయాయి. కుర్రాడు కాస్త తేరుకొన్నాడు, ఫరవాలేదు లెమ్మనుకున్నారు. తిండి గింజలు కూడా అమ్మి డాక్టరుగారి డబ్బు కట్టేశారు.

ఉన్నట్లుండి ఏడోరోజు సాయంత్రం మళ్ళీ తిరగబెట్టింది. పూర్తిగా వ్రేలాడి పోతున్నాడు



'ప్రియునికోసం పిలుపు'

—చిత్రం : వి. కుసుమకుమారి

కడుపు

ఆదొక
మాయామందిరం.
కాకపోతే...
జానెడు పరిమాణం గల
అందులోనుండి
సముద్రమంత ఆకలి
అప్పుడప్పుడూ పుట్టడం
సంభవమేనా ?

— వీరపల్లె వీణావాణి

ఖూనీ

పిల్చాడు. గుండెలు బాదుకొంటు తీసికెళ్ళారు డాక్టరు దగ్గరికి.

"ఇప్పటికి నేనేదో చేస్తాను. వెంటనే పట్నం తీసుకు వెళ్ళకపోతే మాత్రం కష్టం" అని తేల్చి పారేశాడు.

చేతిలో చిల్లిగవ్వలేదు, ఉన్నదంతా డాక్టరు జేబులోకే జారిపోయింది. ఏ పనిముట్టు లేదు. రెండు జర్మన్‌సిల్వర్ గ్లాసులు, రెండు సత్తు కుండలు మినహాయించి.

"వెంటనే రాజారావుగారి దగ్గరికి వెళ్ళు. నేను ప్రయాణమవుతూ ఉంటాను" అని పార్వతి చెప్పడంతో పరుగులాంటి నడకతో చేరుకున్నాడు వాడి దొరోరి ఇంటికి. ఒకటి రెండుసార్లు అప్పు అడిగినా లేదన్నాడే గాని ఇవ్వలేదు. ఈసారి ఏమంటాడోనని వాడి మనసు పీకుతూనే ఉంది.

"అమ్మగారు అయ్యగోరు ఉన్నారండీ ?"

"ఉన్నారుగాని వడ్లకొట్టులోంచి ఓ పందుం బయట పడెయ్యరా" అంది. పీకుతున్న మనసుతో ఎంత గబగబా చేసిన ఇంకా ఆలస్యం చేస్తున్నట్లు గానే ఉంది రత్తానికి.

"ఒరే ఏమిగోణ్ని పనిమీద పంపానుగాని ఆ నాలుగు గేదెలకి కాస్త గడ్డెయ్యరా" అది పూర్తి చేసుకొని గబగబా రాజారావు కూర్చున్న వరండా చేరుకున్నాడు.

మడత కుర్చీకి చేరగిలబడి ఏదో ఆలోచిస్తున్నాడు రాజారావు.

"అయ్యగోరో" అన్నాడు రత్తం.

"ఏమిటి" కళ్ళు మూసుకొనే సమాధానం ఇచ్చాడు.

"మా సంటోడికి మరీ సుస్తీగా ఉంది. పట్నం తీసికెళ్ళమంటున్నారు. ఓ ఏభై రూపాయ లివ్వండీ."

"ఏంట్రా! జనపకట్టల వామి మరీ తగ్గిపోయి నట్లుంది ఈ నాలుగురోజుల్లో."

గతుక్కుమంది రత్తం ప్రాణం. నిదానంగా తమాయించుకొని "పచ్చగడ్డి తక్కువగా ఉంది కదండీ" అన్నాడు.

కాసేపు ఇద్దరి మధ్య మౌనం. చివరికి నోరు పెగల్చుకొని "ఆడికి మరీ ఇదిగా ఉందండీ. డబ్బు లిస్తే తొందరగా తీసికెడతాను" అన్నాడు రత్తం.

"ఏరా రత్తిగా నీ దగ్గిరి డబ్బులేదూ? బండెడు జనపకట్టలమ్మిన డబ్బు ఏమైపోయిందిరా నా కొడక! నేను లేనప్పుడు చేస్తే మాత్రం నాకు తెలవదను కొంటున్నవురా కంత్రి నా కొడక! నేను ఎక్కడున్న ఇక్కడ ఏమేమి జరుగుతోందో ఎప్పుడుకప్పుడు తెలుస్తాదిరా! నీ బాబు ముఖం జూసి వొదుల్తున్నారా, నిప్పులాంటోడి కడుపున పుట్టావుగదరా ఎదవ నా కొడకా ! ఇంకోణ్ణైతే కండకి కండ వొలిచేవాణ్ని. ఇక నువ్వు నా దొడ్లో అడుగెట్టొద్దు. 'పోరా' లంజ కొడక" చివరిమాట మాత్రం ఉరిమినట్లు అన్నాడు.

నోరు పెగల్చుకొని ఏదో చెప్పబోయాడు రత్తం.

"ఇంక నువ్వు నాతో ఒక్క మాట మాట్లాడొద్దు. నిన్ను చూస్తుంటే నిలువునా కాల్చబుద్ధి పుడతోంది. నోరు లేనాటి కడుపురా మీరు కొట్టేది. పో నా కొడక బయటకి, ఇంక నా ముందు నించొన్నావంటే ఏం చేస్తానో నాకే తెలియదు" అంటూ ఉగ్ర నరసింహ రూపం దాల్చాడు రాజారావు.

వికల్పమైన మనసుతో బయటపడ్డాడు రత్తం. పదేళ్ళనుండి తినగామిగిలింది రాజారావు దగ్గర దాచింది పార్వతి. దానికి దీనికి సరి అనుకొన్నాడు రాజారావు.

భారమైన అడుగులు వేసుకొంటు నిదానంగ నడుస్తున్నాడు రత్తం, ఏమి పాలుపోని మనసుతో.

దూరంగా వస్తున్నా మనిషిని చూసి తన బాధలన్ని తీర్చడానికి వచ్చిన దేవుడిలా సంతోష పడ్డాడు. వంద రూపాయలు పేకాటలో పోగొట్టు కున్నవాడు, లక్ష రూపాయలు లాటరీలో వచ్చినంత సంతోష పడ్డాడు.

గబగబా అడుగులు పడ్డాయి చినబాబుకు దగ్గరౌతు.

"చినబాబూ !"

"ఏంట్రా ?"

"ఆ సంగతి అయ్యగోరికి తెలిసింది."

"ఇట్లా అని చెప్పావా ?"

"చెప్పలేదు."

"చెప్పబోక" అంటూ చెకచెక వెళ్ళిపోయాడు. "చినబాబు" అని గట్టిగా అరిచాడు. అది వినిపించినా వినిపించనట్లు తీవిగా వెళ్ళిపోతున్నాడు చినబాబు అనే రాజారావుగారి రెండో అబ్బాయి బాస్కర్. తన కాళ్ళక్రింద ఉన్న భూమిని ఎవరో ఒక్కసారి త్రవ్వేసినట్లుంది రత్తానికి. ఈ ఇళ్ళు చెట్లు గిర్రున ఎగతాళి చేస్తు తిరుగుతున్నట్లు అనిపించింది రత్తానికి. అడుగులు తడబడుతున్నాయి.

*   *   *

డబ్బులు తీసుకురావడానికి వెళ్ళిన మనిషికోసం క్షణంక్షణం ఎదురు చూస్తోంది.

మూలుగుకూడా మానేశాడు కుర్రాడు

పట్నానికి వెళ్ళే చివరిబస్సు కాలంకూడా దాటిపోయింది. నిశిరాత్రి. ప్రక్కఇంటి వాళ్ళని లేపి పంపింది. రాజారావుగారి ఇంటికివచ్చి వెళ్ళాడని చెప్పారు. కోళ్ళు కూశాయి. రత్తం జాడలేదు.

పార్వతి ఆలోచన ఏది నమ్మడానికి బలంగా నిలబడడంలేదు. ఏదోచెయ్యాలి, ఏమిచెయ్యలేని స్థితి.

తెల్లవారుతోంది. రత్తం తలకాళ్ళల్లో పెట్టుకొని గోడప్రక్కనే కూర్చుని ఉన్నాడు.


మొగుడ్ని చూడగానే మనసులో ఆశచావక బుజాలు పట్టుకొని కుదిపి అడిగింది -- "డబ్బులు తెచ్చావా అని" తీసుకురాలేదని ఆమెకు పూర్తిగా తెలుసు.

ఏం చెబుతాడు? తనని పాలేరుతనంనుంచి తీసేశారు అని చెబుతాడా? దొంగతనం మీదవేసి చినబాబు పారిపోయాడని చెబుతాడా ? మనబిడ్డ చావడం కాయమని చెబుతాడా ?

ఒకసారి జీవంలేని ముఖంతో పెళ్ళాంవైపు చూసి తలదించేసు కొన్నాడు.

మొగుణ్నివదిలి మంచంవైపు శ్వాస ఆగిన కొడుకునుచూసి బావురుమంది పార్వతి.

మీ ఆదాయం నిరంతరం ధారగా ప్రవహిస్తూనే ఉంటుంది!



ఖాయమైన ఆదాయపు పథకం

ఇండియన్ బ్యాంక్, తన ఖాయమైన ఆదాయపు పథకాన్ని యెన్నుకొన మిమ్మ ఆహ్వా నిస్తూన్నది.

మీరు చెల్లించినదానికంటే అధికంగా మీకు మేము చెల్లిస్తూంటాము. అయినా మీ డిపాజిట్ సొమ్ము, మరియు వడ్డీ అలాగే స్థిరంగా వుంటుంది. ఉదాహరణకు మీరు ప్రతి నెలా రు. 100/- వంతున 120 నెలలు మీ రెకరింగ్ డిపాజిట్ ఖాతాకు చెల్లించారనుకోండి. ఈ రెకరింగ్ డిపాజిట్ ఫలితానికి వచ్చినతరువాత మీరు ఖాయమైన ఆదాయపు పథకాన్ని యెన్నుకొన్న యెడల 120 వ నెల నుండి మీరు కోరినంత కాలం ప్రతినెల రు. 169-50 చెల్లిస్తాము. మీకు ఈ చెల్లింపు అక్కరలేదంటే. మొత్తంగా మీకు రు. 20510/- వస్తుంది. ప్రతి నెలా మీరు చెల్లించదలచిన డిపాజిట్ సొమ్మను మీరే యెన్నుకోవచ్చు-అలాగే కాలాన్నికూడా-అంటే 84 నెలలా లేక 120 నెలలా అనే విషయాన్ని కూడా యెన్నుకోవచ్చు.

ఇందుకు సంబంధించిన పూర్తి వివరములకు మరియు అనేక యితర ఆకర్షణీయమైన ప్రణాళికలకు మీ సమీపమందున్న ఇండియన్ బ్యాంక్ బ్రాంచిని తప్పక సంప్రదించండి.

ADWAVE/IB/1880/S6 TEL

Indian Bank
75
YEARS OF SERVICE

ఇండియన్ బ్యాంక్

మీ సుఖసమృద్ధికి సహకారి



విరితావి

వి. వాణీప్రసాద్

సీతమ్మగారింట్లో విరగ పూచిన జాజి పూల పరిమళం గాలిలో తేలి కిటికీ వద్ద నిలబడి వున్న వసంతను హాయిగా, మృదువుగా చుట్టేసింది.

ఎదురింట్లో పూచిన జాజులను, అందంగ అల్లుకుంటున్న ఆ తీవెలను చూస్తూ నిలబడిన వసంత హృదయంలోనూ, మధురమైన ఊహలు పెనవేసుకుంటున్నాయి. చిలిపిగా గదిలోకి చొరబడాలని ప్రయత్నిస్తోంది వెన్నెల. ఆకులతో, రెమ్మలతో అలవోకగా ఆపినా, అల్లరిగా తాకే చిరుగాలికి సుగంధాన్నిస్తూ, దాంపత్య బంధానికి ప్రతీకగా నిలిచిపోయిన జాజి తీగలంటే, ఆ సౌఖ్యంలో పొందే అనుభూతి అంటే వసంత కెంతో యిష్టం.

చిన్నతనంలో పల్లెటూరిలో. వాళ్ళ యింట్లో వుండే సన్నజాజి పందిరిపై అంతటి అపురూపమైన భావన ఉండేది కాదు వసంతకు. కేవలం ఆ పూలను మాత్రమే కురుల తురుముకునేది. తర్వాత తండ్రి ఉద్యోగరీత్యా మరో ఊరికి బదిలీ అయిన సమయానికి వసంత, వసంతా గమనంతో అందాలు సంతరించుకున్న అందమయిన అమ్మాయి.

ఎదురింటిలో గది ప్రక్కకు, కిటికీకి అతి సమీపంగ ప్రాకిన సన్నజాజి తీవె చూసినప్పుడల్లా, తనకంటూ ఓ గది, ఆ గది కిటికీ ప్రక్కగా సుగంధాన్ని విరజిమ్మే ఆ తీగను పెంచాలనే కోరిక ఆమెలో మొగ్గ తొడిగింది. కాని వారు వుండేదీ రెండు గదుల్లో; అందులో తనకంటూ ప్రత్యేకమైన గది మిగలదని, యింకొంచెం పెద్ద యిల్లు తీసుకునే ఉద్దేశం తండ్రికి లేదని తెలుసు. అందుకే తనకు, తండ్రి పెళ్ళంటూ చేస్తే, ఆ యింట్లోనైనా ... తన కోరిక తీరుతుందా ? ఆ పూ పరిమళాన్ని ఆస్వాదిస్తూ. తనూ, తనభర్త అనుభవాల పూవులు పూయించకోగలరా ? అనుభూతుల తావులు అందు కోగలరా ? ఇలా వసంత హృదయంలో ఎన్నో ఆలోచనలు -- మరెన్నో ప్రశ్నలు. అవే ఆమెను మరో అందమయిన లోకంలో విహరింపచేసేది.

వసంత తండ్రి పద్మనాభరావుగారు ఎలిమెంటరీ స్కూల్ మాష్టర్. ఆయనకు వసంతకు ముందుగా మరో కూతురు – భాను. భానుకు పల్లెలో వున్న యింటిని అమ్మివేసి వచ్చినంతలో కట్నం యిచ్చి, ఓ గుమాస్తాతో పెండ్లి చేశారు. గుండెలపై నున్న ఒక కుంపటిని దింపుకున్నారు.

మరో కుమార్తె వసంత కోసం పైసా, పైసా కూడబెడుతున్నారు. తనకూ, భార్యకు, కూతురు అనే ఆ చిన్న సంసారం కోసం ఇల్లు అనబడే ఆ రెండూ గదులూ చాలనుకున్నారు. అందులో చేరారు.

ఇంకో సంవత్సరం నరకయినా వసంతనూ ఓ అయ్యచేతిలో పెట్టాలనేదే ఆయన తపన జీవిత, ధ్యేయం కూడ.

వసంత ఎదురింటి జాజిపందిరితోపాటే మరిన్ని ఊహలల్లుకుంటుండగానే పద్మనాభరావుగారి మిత్రుడు, ఆనందరావుగారి కొడుకు – రవి యింటర్వ్యూకోసం ఆ ఊరు వచ్చాడు. తండ్రి కోరిక ప్రకారం. రవి పద్మనాభరావుగార్ని కలుసు కున్నాడు. వసంతగానంవంటి వసంతను, పద్మనాభ రావుగారి స్థితిగతులను బేరీజు వేసుకుంటూ స్వగృహం చేరుకున్నాడు.

ఆ తర్వాత చేతికందిన ఆర్డరు ఆసరాగా "వసంతను చేసుకుంటాను" అని వచ్చి ఆ కుటుంబాన్ని ఆశ్చర్యంతో ముంచివేశాడు.ఆనందంతో తబ్బిబ్బుచేశాడు. రవితో తాను దాచిన డబ్బు ఎంతో, తాను ఏమేమి యివ్వలేడో చెప్పబోయిన పద్మనాభరావు గార్ని వారించాడు. "పెద్దతనంలో ఆ డబ్బే మీకు ఆసరా అవుతుంది, ఉంచండి" అంటు ఆయన్ని మరింత విభ్రాంతిలో ముంచివేశాడు.

"దయచేసి మాస్థితిని చూసి జాలిపడిమాత్రం యీ వివాహం చేసుకోకండి" అని అభ్యర్థించిన వసంతతో, "వసంతా ! నా జీవితంలోకి వసంతం నీ ద్వారానే రావాలి; నిన్ను చూసిన తొలి క్షణంలోనే నాకీ ఆశ కల్గింది. అందుకు, ఉద్యోగంలో చేరమని

నాకొచ్చిన ఆర్డరు బాసటగా నిల్చింది. తోడుగా నాన్నగారి అనుమతీ లభించింది. నాకు తోడుగా వుంటానని చెప్పు వసంతా!'' అన్న రవికి చేయి అందించింది వసంత.

రవితో సరిక్రొత్త జీవితంలోకి అడుగుపెట్టిన వసంతలో అక్కడయినా తన కోరికను తీర్చుకోవాలనే ఉత్సాహం పెల్లుబుకింది.

క్రొత్త యింటిలో ప్రవేశించిన వసంతకు ఎటు చూచినా బండలు పరచిన నేలే కన్పించింది. కొంత నిరుత్సాహం చెందింది. అయినా తమ వాటాకు ప్రక్కగా రాళ్ళు లేచిపోయిన ప్రదేశంచూసి కొంచెం ఆనందించింది. క్రొత్తదనాన్ని, జంకును దాచుకుంటు, ఆ వీధిలో సన్నజాజి చెట్టువున్న వారింటికి వెళ్ళి తనకు తానుగా మాట కలిపింది. అలా రెండు మూడు సార్లు వారింటికి వెళ్ళి, పరిచయాన్ని పెంచుకుని ఆ యింటిని, పరిసరాలను, ముఖ్యంగ ఆ సన్నజాజి పందిరి శోభ నిచ్చిందటూ పొగిడింది. మాటలో మాటగా ''ఒక అంటు వుంటే యివ్వరూ ? !'' అని అడిగేసింది. ఆ ఇల్లాలు నవ్వుతూ ''అంటు కట్టింది లేదండి, కావాలంటే కట్టుకోండి'' అని ఆమె యిచ్చిన పర్మిషన్‌కు మహానందంతో అంటు కట్టేసింది, మరికొన్నాళ్ళకు రాళ్ళు లేచిపోయిన ఆ ప్రదేశంలోని పాత మట్టిని తీసివేసి, కొత్తమట్టి నింపి, ఆ 'అంటును' ఉత్సాహంగ నాటింది.

ఎలాగో ఆ జాజి బ్రతికి బట్టకట్టింది. అది మారాకు వేస్తుంటే వసంత హృదయంలో మొగ్గలు తొడిగినట్లే వుండేది.

వసంతలోని పొంగులువారే యీ ఉత్సాహం చూసి ''ఏమిటోయ్! దాన్నేదో గారాబం చేసేస్తున్నావు?'' అని ఆటపట్టించేవాడు రవి.

ఆ సమయంలోనే, మామగారికి వంటో బాగులేదనే ఉత్తరం చూసుకుని భర్తతోపాటే ప్రయాణం కావల్సివచ్చింది వసంత.

కన్నబిడ్డను, మరో తల్లికి అప్పగించినట్లుగ; ఆ లేత జాజి మొక్కను ప్రక్క భాగం వారికి అప్పచెప్పి రవితో బయలుదేరింది.

మామగారు పూర్తిగా కోలుకున్నాక, తిరిగి వచ్చిన వసంతను తను నాటి, మారాకులు వేస్తున్న జాజి మొక్కకు మారుగా ఖాళీగొయ్యి వెక్కిరించింది.

''ఏమనుకోకు వసంతా ! వంటివాడు పీకేశాడు. నేనేదో పనిలో వుండిపోయాను'' అని ఆ వంటివాడిని ఎత్తుకొచ్చిన ఆ తల్లిని ఏమీ అనలేకపోయింది. 'నా జాజి అంటుకు నువ్వో యమకింకరుడివయ్యావు' అనుకుంటూ ఆ వంటివాడికేసి కోపంగా చూసింది వసంత. వాడు అలవాటుగా అల్లరిగా నవ్వేశాడు. వాడి కొంటె నవ్వుకు కోపం పారిపోగా 'ఛ! యీ పసివాడినా యమకింకరుడనుకుంది' తను, అని బాధపడ్తూ చాచిన వసంత చేతుల్లో వాలిపోయాడు వంటి. ''ఏరా బాబూ! నీకూ ఆ పసిదానితో ఆడుకోవాలనిపించిందా ?'' అంది వసంత మనసు ఆర్ద్రమవుతుండగా.

*　　*　　*

ఆ తర్వాత మళ్ళీ ప్రయత్నించి మరో అంటు నాటింది వసంత. అది జీవాన్ని పుంజుకుని వసంత హృదయంలో ఆశలు చిగురింప చేస్తుండగానే రవికి అక్కడి నుండి ట్రాన్స్ఫర్ అయింది. ముందుగా యిల్లు చూసి వచ్చిన రవిని, ''ఇల్లు బావుందా ? ఖాళీ జాగా వుందా ?'' అని ఆత్రంగ ప్రశ్నించింది, వసంత. అక్కడయినా తనకోరిక నెరవేరుతుందేమోననే ఆశతో.

''ఆగు! చూస్తే ఎగిరి గంతేస్తావు'' అంటూ వసంతను ఉడికించాడు రవి.

కాంపౌండులోకి ప్రవేశిస్తూనే ఒక మూలగా వున్న పెద్ద జాజి పందిరిని చూసి తనువు పులకరించింది వసంతకు.

''పద ! మనది మేడమీద గదులు'' అంటూ దారితీసిన రవిని అనుసరించి, ''మేడమీద గదులా'' అంటూ ఉసూరుమంది. ''అదేమిటి నీ కిష్టం లేదా ? యిలా మేడమీద గదుల్లో వుండటం నాకెంత యిష్టమో తెల్సా ? – సాయం సమయంలోని సంధ్యారాగాన్ని, అనంతాకాశంలో మెరిసే తారకలను, పౌర్ణమినాటి వెన్నెల జిలుగుల్ని యిలా ఎన్నో, ఎన్నో అందమయిన ప్రకృతి దృశ్యాలను చూస్తుంటే ఎంత హాయిగ వుంటుంది ?'' అసలు మనిద్దరం కల్సి అలాంటి అనుభూతుల్ని పంచుకోవాలని నేనెంతగా వువ్విళ్ళూరుతున్నా ననుకుంటున్నావు'' అంటూ మెట్లెక్కుతున్న రవి ఒక్కసారి వెనక్కు తిరిగి వసంత ముఖంలోకి గమనించి చూసి వుంటే ఆమె ఆవేదన అర్థమయ్యేదే.

ఆఖరికి వసంత అననే అనేసింది ''అహా ! ఇష్టంలేక కాదండి, మన బెడ్‌రూమ్‌కు ప్రక్కగా జాజి తీవె పెరగాలని నాకెంతో కోరిక.''

''ఓహో ! అవా ! పోనీ తొట్టిలో పెడ్తే...''

''ఉహు! దానికి తొట్టిలో స్థలం సరిపోదండి, బాగా ప్రాకుతుంది.''

''అయితే ఒక పని చెయ్యి యీ కిటికీకి సూటిగా క్రిందనే ఒక అంటు నాటు. అది పెరిగి, పెరిగి నీ దగ్గరికి ... నా కంటే ముందే నిన్ను ముద్దాడుతుందోయ్.'' అన్నాడు రవి కొంటెగా.

''మీరు మరీను. అది పెరిగి పెరిగి యిక్కడికి చేరేటప్పటికి మళ్ళీ మనకు ట్రాన్స్ఫర్.'' అంది కోపాన్ని సున్నితంగా ప్రదర్శిస్తూ.


''యింతలోకే ఏం రాదులేవోయ్. ప్రమోషన్ మీద వచ్చాం గదా ! పోనీ యీలోపలే మరో యిల్లు వెతుకుదాం !'' అన్నాడు ఓదార్పుగా.


మళ్ళీ మరో అంటు కిటికీకి సూటిగా క్రిందనే నాటింది వసంత. అది ఏపుకుని తీగలుసాగి ప్రాకసాగింది. ఆ తీగలకు నిచ్చెనవంటి త్రాటిని అమర్చి బెడ్‌రూమ్ కిటికీ దగ్గరికి చేర్చింది. ప్రక్కకు పోతున్న తీగెలను శ్రద్ధగా ఆ త్రాటికే అల్లించేది. చెట్టు చేతికి అందకుండగ తీగలుసాగి, పైకెగబ్రాకి మొగ్గలు తొడిగింది.

జాజితీగెకులాగే వసంత గర్భంలోనూ దాంపత్య చిహ్నం అంకురించింది. నెలలు నిండేకొద్దీ, విరిసే మొగ్గల కదలికల్లా, వసంత గర్భంలోనూ కదలికలు. ఎన్నో సౌరభాలు, మరెన్నో అనుభూతులు–యింతలో జాజితీగె వసంత బెడ్‌రూమ్ చేరనేలేదు ... వసంత పురిటికి వెళ్ళాల్సి వచ్చింది.

ప్రయాణం రేపనగా, ఆ రాత్రి విరిసిన జాజులను, తీగెల కదలికలను కాంక్షతో చూస్తున్న వసంతను ''అంతగా దాన్నే చూడకోయ్! జాజిమొగ్గ వంటి ఆడపిల్లనే కనేయగలవు. యీరోజుల్లో ఆడపిల్లను కన్న తల్లిదండ్రుల అవస్థ భగీరథుని అవస్థను మించినది''...అంటున్న రవిని

''మీవంటి మంచి వ్యక్తి ఎవరో నాబిడ్డకోసం





యీపాటికి పుట్టేవుంటారు లెండి'' అంటూ పెని వేసుకుంది వసంత.

* * *

సుఖ ప్రసవంలో పాప నెత్తుకుని మూడవ నెలలో రవితో ఆటోరిక్షా ఎక్కిన వసంత, తామెక్కిన ఆటోకు మరో మార్గం చూపిస్తున్న రవితో ''అదేమిటి, ఆ యిల్లు కాదా?'' అని ప్రశ్నించింది ఆశ్చర్యంతో.

''ఊహూ! యింటి వారబ్బాయి చదువుకోసం యిక్కడికే వస్తున్నాట్ట, యిల్లు ఖాళీ చేయమన్నారు'' అన్నాడు రవి ఎటో చూస్తూ.

''మరి ఉత్తరాల్లో జాజి తీగె కిటికీని అందుకుంది, విరగపూస్తున్నది, ఆ సువాసనలన్నీ నా ఒక్కడివే — అంటూ ఏవేవో వ్రాసేవారుగా'' అంది వసంత మరింత ఆశ్చర్యపోతూ.

''అవి, అవి, నీవు హర్టుకాకుండ'' అన్నాడు రవి వసంతను జాలిగా చూస్తూ.

మేడమీద వుండాలనే రవి కోరిక. వసంత హృదయంతో పెనవేసుకున్న జాజి తీగ — పాపం, ఆ విధంగా రెండూ దూరమయ్యాయి వారికి

ఈసారి పాపను జాగ్రత్తగ చూసుకోవటం, ఆ ముద్దు మురిపాలలో తేలిపోవటంతో, జాజి మొక్కను, మళ్ళీ నాటటానికి కాలహరణమయినా వసంత యెదలోని కోరిక మళ్ళీ తీగసాగింది. ఆ క్రొత్త యింట్లో, ఆ మట్టు ప్రక్కలనుండి, మరో అంటు తెచ్చి నాటింది. దినదిన ప్రవర్థమానమవుతూ — పాపలాగే కేరింతలు కొట్టసాగింది జాజి అంటు. పాపను, మొక్కను మాటి మాటికి పోల్చుకుంటు, పోషించుకుంటు వస్తున్న వసంత మనసుకు పెద్ద అఘాతం తగిలింది. అది — పాపకు చిన్నబిడ్డ చేష్టవచ్చి పోవటం, ఆ దిగులులో అశ్రద్ధ కారణంగ జాజిమొక్క కూడ నశించటం. ఖాళీ అయిన పాప ఊయలను, ఎండిపోయిన జాజి మొక్కను చూస్తూ ఆవేదనపడ్డ వసంతను చూసి ''చూడు; వసంతా ! అందుకే దేనిమీద అమితమైన అపేక్షను పెంచుకోకూడదు. పాపే లోకంగ, జాజి తీగను పెంచటమే ధ్యేయంగ — ఆ రెంటికీ నీ మనసులో ఉన్నతమయిన స్థానమిచ్చావు. అందుకే అవి అందకుండ పోయాయి. పాపకోసం నాకు

వి రి తా వి

మాత్రం బెంగలేదంటావా ? కాని చేసేదేముంది. మరో సంవత్సరంలో మన ఒడిలో మరో బాబుండడంటావా ?'' అంటూ ఒకవైపు జీవిత సత్యాన్ని తెలియచేస్తూ, మరోవైపు క్రొత్త ఆశకు ప్రోది చేశాడు.

అప్పటినుండి జాజి తీగను పెంచే ఆశను, కోరికను చంపుకుని ఎవరింట్లోనైనా కన్పిస్తే చూసి ఆనందించే స్థితికి చేరుకుంది వసంత. అంతే కాదు; తన చేత్తో పెట్టే అ తీగ తనకు దక్కదు అనే నమ్మకాన్ని పెంచుకుంది.

అంతేకాక, జాజి తీవెను నాటాలి అనే ఆలోచన పాపను మరీ మరీ గుర్తుచేస్తూ ముల్లులా గ్రుచ్చుకొనేది. అందుకే ఆ ఆలోచనను మనసునుండి తరిమివేసింది. కాని, ఆ విరితావి, ఆ అనుభూతి వసంత మనసులో అందీ అందని వరంలా నిలబడిపోయాయి.

* * *

కాలక్రమేణా వసంత గొంతు మరో బిడ్డ 'ప్రభాకర్'కు జోలపాడింది. రవి కూడ డిపార్టుమెంటల్ పరీక్షలు పాసయి ఆఫీసర్ పోష్టుకెదిగాడు. ప్రభాకర్ కూడ వయసులోనేకాక జీవితంలోను, వృద్ధిలోకి వచ్చాడు. ప్రస్తుతం వసంతకీ జీవితం తృప్తిగానేవుంది.

''క్రొత్తగా కట్టిన యిల్లు, ఏవో ఇబ్బందుల కారణంగ అమ్ముకుంటున్నారు. నీకు నచ్చితే కొందాం, చూద్దువుగాని పద !'' అంటూ రవి భార్యను, కొడుకును, తీసుకుని వెళ్ళాడు; ఓ సాయంకాలం.

చుట్టూ ఎత్తయిన కాంపౌండ్ వాల్‌తో, అందంగ, ఆధునికంగ కట్టబడిన ఆ యింటిని కలయతిరుగుతూ, ఓ ప్రక్కగా ఉన్న విశాలమయిన గది, ఆగది కిటికీకి అందంగ అల్లుకున్న పన్నజాజి తీవె, అప్పుడే విచ్చుకుంటున్న జాజులు, గదిలోకి వ్యాపిస్తున్న ఆ పరిమళం వసంతను ఆకర్షించాయి. అర్థవంతంగ భర్త కళ్ళల్లోకి చూసింది వసంత.

ఒకర్ని, ఒకరు చూసుకుని చిర్నవ్వు నవ్వుకుంటున్న తల్లితండ్రుల్ని, వారి నవ్వులోని అంతరార్థాన్ని అర్థం చేసుకున్న ప్రభాకర్ కూడ తనలో నవ్వుకున్నాడు.

ఆ ఇంటిని కొన్న మంచి ముహూర్తమేమిటో కాని లక్ష్మివంటి కోడలు 'లక్ష్మి' గృహప్రవేశం చేసింది.

కాపరానికి వచ్చిన లక్ష్మికి ఇల్లంతా త్రిప్పి చూపిస్తూ ''ఇది మా గది అంటూ లోపలికి నడచిన అత్తగారిని అనుసరించటానికి సందేహించి అక్కడే నిలబడిపోయిన లక్ష్మిని ''రామ్మా ! ఫరవాలేదు.'' అని చేయి పట్టుకొని లోపలికి తీసుకు వెళ్ళింది, అత్తగారుగా మారిన వసంత.

పాలవెన్నెలవంటి గోడలకు ఒకవైపున అర మోడ్పు కన్నులతో మురలిని వాయిస్తున్న కృష్ణుని మోహనరూపాన్ని చూస్తూ, ఆ మృదుమధుర గానంలో పరవశమౌతున్న 'రాధాకృష్ణుల' ఫోటో, మరోవైపు 'కువకువ' మంటున్నట్లుగా వున్నపక్షుల జంట, మరోవైపు విశ్వకవి రవీంద్రుని ఫోటో, యివన్నీ గోడలకు అందాన్నివ్వడమేగాక అత్తగారి అభిరుచినికూడ వ్యక్తపరిచాయి లక్ష్మికి.


డబుల్ కాట్‌కు ప్రక్కగావున్న కిటికీనుండి తొంగిచూసే జాజిపూలతీగె, గాలికి కదులాడే పాల నురుగువంటి మృదువయిన సిల్కు తెరలు, ఆ గది లక్ష్మి కంటికి శాంతివనంలా తోచింది.


''చాలా బాగుంది అత్తయ్యా మీగది. ఎంతో ప్రశాంతంగా వుంది'' అని మెచ్చుకుంటున్న లక్ష్మి ఒకనాటి తన కలల ప్రతినిధిగా, అనుభూతులకు ప్రతిరూపంగా కన్పించింది వసంతకు.

''అంత బావుందా'' అని చిర్నవ్వు చిందించింది.

ఆర్రాత్రి వసంతలో ఎన్నో ఆలోచనలు.

తనలో వసంతం వెల్లివిరుస్తున్న రోజుల్లో, యిటువంటి ఆహ్లాదకరమయిన గదికోసం, ఆ పూతీవెకోసం పలవరించింది. ఆ సుందర వాతావరణంలో పూ పరిమళాన్ని ఆస్వాదిస్తూ, తనూ, రవి, దాంపత్య జీవితంలోని ప్రతి అనుభూతిని ఆ తీవెతో పంచుకోవాలని వువ్విళ్ళూరింది. ఆ అనుభవం, ఆ అనుభూతి, ఒక దివ్యానందంగా భావించింది. కాని విధి అనుకూలించలేదు. కాని జీవితం సంధ్యకు వాలిపోతున్న ఈనా తరుణంలో అనుకోకుండగ, అప్రయత్నంగ ఆ కోరిక నెరవేరింది.





సంక్రాంతి

కోడిపుంజుల గొంతు కొత్త మేల్కొలుపులు
మంచుతెరల సందున మారుమ్రోగ
ముదితలందరు కలసి ముగ్గుతో మొగసాల
చిత్రవర్ణ కళల వేదివేయ
తొలి ప్రొద్దువేళలో తెలుగింటి వదుముతే
గొబ్బిళ్లలో గుమ్మడిపూలు గుచ్చ
సాతాని జియ్యరు తాంబూర నాదాన
సమరస భావాలచవులు రేగ

సన్నాయి క్రలో సరిగమల కులుకున
పాట పల్లవితోడ గంతులాడ
ప్రాగుడ్డ పీలికలు గంగిరెద్దులకు మోత
మూపురాన "హొంద" మోవుగగ
ఎడద పండిన పంట పైడి హోరంగుల సౌరు
పులకరింతల పుడమి చిలకరింప

ఆగామి కడిమికై కడగొట్టు రుతు గళము
రాగాల రాకొట్టు పాటపాడ
తెలిమంచు గంధంపు నలుగువెట్టి
తొలిప్రొద్దు తొందరల కేశాలు విడివడి
ఉత్తరాయణ పుణ్య అంభ్యంజనారతిని
మకర రాశిని చేరె మార్తాండ విభుడు.

— సౌంధ్యశ్రీ

కాని...కాని ఈరోజు కోడలు కళ్ళల్లోను అదే కోరిక ఆహ్లాదకరమయిన గదికావాలని అపేక్ష. చనిపోయిన తనపాపే బ్రతికిఉంటే, పాపలోనూ యిటువంటి కోరికే ఉందని అర్థం చేసుకుని వుంటే నేనేం చేసే దాన్ని? ఏం చేసేదాన్ని?...ఏదో ఆలోచించుకుంటూ నిద్రలోకి జారింది వసంత.

*   *   *

మరురోజు ప్రభాకర్‌ను పిలిచి "ప్రభా! యిక నుండి మీరు మా గది వాడుకోండిరా, క్రొత్త దంపతులు. మీకైతే బావుంటుంది. ముందు ముందు పిల్లా, పాప పుడ్తే విశాలంగాను వుంటుంది" అంటున్న తల్లిని విస్తుపోయి చూశాడు ప్రభాకర్.

"అదేమిటమ్మా అలా అంటావు? అ గది మీ గది ... అది నాకు దేవతలు కొలువున్న దేవాలయంలా పవిత్రమైనది ... ఆ గదంటే నాకొక రకమయిన పూజ్య భావమే తోస్తుంది ... మరోలా ఎలా భావించమంటావు? అది ఎప్పటికీ మీ గదేనమ్మా!" అనేసి వెళ్ళిపోతున్న ప్రభాకర్‌ను అప్రతిభురాలై చూస్తూ, తన మనసెరిగిన కొడుకున్న తల్లిగా గర్వించింది వసంత.

*   *   *

ఆ రాత్రి రవి గుర్రుపెడుతున్నా, నిద్రరాక అన్యమనస్కంగ బయటికి వచ్చిన వసంత, తమ గది ప్రక్కనే వున్న కొడుకు గదినుండి మంద్రగ విన్పిస్తున్న మాటల్లో 'అమ్మ' అన్న పదం విని నిలబడిపోయింది. ప్రభాకర్ మాటలు ఆమె చెవి సోకసాగాయి.

విరితావి

"లక్ష్మీ! అమ్మ, వాళ్ళ బెడ్‌రూంను మనల్ని వాడుకోమన్నది, నీవేమయినా అన్నావా?"

"లేదండి; మీ గది చాలా బావుందని మాత్రమే అన్నాను. నిజంగ చాల నచ్చింది నాకు"

"ఉహూ! అలాగా; నీ కళ్ళల్లో కన్పడిన ఆనందం గ్రహించింది కాబోలు అమ్మ; అందుకే అలా అంది."

"ఆమెగా, ఆమే ఆ మాట అన్నారు కదా? పోనీ మనమే అందులో వుంటే ... ?"

"వద్దు లక్ష్మీ! వద్దు; అమ్మ అటువంటి గదికోసం ఎంతగా ఆరాటపడిందో, ఆ పూ తీవెలో ఎంతటి అనుబంధం పెనవేసుకుందో నాకు తెలుసు అసలు ఆ గది కోసమే నాన్నగారీ యింటిని కొన్నారు. ఆమె జీవితంలో కోరుకున్న యీ ఒక్క కోరిక ఫలవంతమయ్యే సమయంలో ఆ ఆనందాన్ని లాక్కోబోవటం, మనసున్న మనిషిగా, అమ్మ మనసెరిగిన వాడినిగా చెయ్యలేను. అమ్మ ఏ అనుభవాన్నయితే కావాలని మనసారా కోరుకుందో ఆ అనుభవాన్ని తృప్తిగా అనుభవించనీ లక్ష్మీ!" ప్రభాకర్ గొంతు ఆర్ద్రంగా పలికింది.

"ఈ పెద్దవయసులో వాళ్ళింకా అనుభవించబోయే దేమిటండీ?..." లక్ష్మి కంఠం కొంటెగా ధ్వనించింది.


"చూడు లక్ష్మీ! మనస్ఫూర్తిగా కోరుకునే అనుభవాలికి మూలం అనుభూతే. అనుభూతి రహితమయిన అనుభవం చిరస్మరణీయం కాదు. హృదయంలో గాఢంగ నాటుకున్న ఒక కోరిక, అనుభవంద్వారా లభించిన అనుభూతి నిజ జీవితంలో లభ్యం కాకపోయినా, మనసులోనే దానిగురించి ఊహించుకుంటు, ఆ ఊహల్లోనే అనందానుభూతిని అందుకుంటు గడుపుతారు కొంతమంది.


అటువంటి అనుభూతికి నిలయం అమ్మ హృదయం. ఆ అనుభవానికిగాని, ఆ అనుభూతికి గాని వయోపరిమితి లేదు లక్ష్మీ!

ఈరోజు మనం దాంపత్య జీవితాన్ని ఎంతో ఉత్సాహంతో, ఆనందంతో అనుభవిస్తున్నాం. అది రేపటి రోజుకు ఒక దివ్యానుభూతిగ మనలో నిల్చిపోతుంది. ఈనాటి ఆనందకరమయిన జీవితాన్ని ముసలితనంలో గుర్తుకు తెచ్చుకుని మధురంగ నవ్వుకుంటాము. అంతమాత్రాన ఆ మధురమైన ఊహలకు, ఆ అనుభూతికి అనుభవం లేదంటామా లక్ష్మీ!

అమ్మ ఒకనాటి అనుభూతిని యీనాటి అనుభవంగ మార్చుకుంటున్నది ... మనం ఈనాటి అనుభవాన్ని ముందు జీవితానికి మధురమైన అనుభూతిగా మిగుల్చుకుందాం...ఏం?" అంటున్న కొడుకు మంచి హృదయానికి తల్లిగా ఆశీస్సులందించింది వసంత.

ఆనందపు విరితావులు మనసు నిండుగ నిండుకొనగా తృప్తిగా తమ గదివైపు నడిచింది వసంత. ★







దేశమంతటా నాగరీక యువతులు కోరి
ధరించేది ఐటెక్స్ తిలకం నారీమణుల పుష్ప
విధానాన్ని అద్భుత సౌందర్యాన్ని ప్రస్ఫుటం
చేసేటందుకే కమ్మలకింపైన 14 రంగులలో
దొరుకుచున్నవి. శాస్త్రీయ విధానంలో
తయారుచేయబడు ఐటెక్స్ తిలకం
చర్మానికి ఎటువంటి హానియు కలుగజేయదు
DELUXE KUMKUM
EYETEX
SHAKE WELL
EYETEX

చేతిలోని యీ రేఖ చెప్పలేకపోయింది

టి. యస్. యస్. రంగనాథ్



"నేను ఎవర్ని ?"

అన్నది వేదాంత చర్చకు మూల ప్రశ్న.

భౌతికంగా అయితే — నేను మిస్టర్ 'యక్స్'నని, ఫలాన 'సెక్స్'నని, 'వై' కులస్థుడ్నని, 'జడ్' అంతస్థులోవాణ్ణని అందరం అనుకుంటుంటాం.

కానీ, గాలిపాలైన అనాధలకు అవన్నీ అనుకునే అవకాశాలెలావుంటాయ్ — పాపం !

*   *   *

అదో వూరు. ఆ వూళ్లో ఏ పేరుతో పిలిచినా -- 'ఒరేయ్' అన్నా — బూతుగా పిలిచినా పలికే పధ్నాలుగేళ్ల పసివాడు 'వాడు'. వాడికి తెలిసిందల్లా తను మగాడినని.

వాడికున్న ఆరాటమల్లా — తన మగతనాన్ని ఓ గుడ్డలాంటి దాని మరుగున దాచాలని, ఆకలేస్తే అన్నంలాంటిదేదైనా మింగాలని.

ఆ వూళ్లో యెవరేం పని చెప్పినా చెయ్యడం, యేమైనా యిస్తే తినడం, అంతే వాడి 'జీవితం' — 'జీవనం'.

ఎప్పుడో పన్నెండేళ్లక్రితం, ఎవడో సన్యాసితో ఆవూరొచ్చాడు. వచ్చిన పదిరోజుల్లో ఆ సన్యాసి చచ్చాడు. దాంతో ఆ రెండేళ్ళ పసివాడు వూటకో యింట పెరిగాడు.

కాళ్లూచేతులు తన స్వాధీనంలోకి వచ్చీరాగానే వాళ్లందరూ ఋణం తీర్చుకోమన్నారు. అదిం కావాడు యీనాటికీ తీరుస్తూనే వున్నాడు — వూరందరికీ 'వెట్టిచాకిరీ' చేస్తూనే వున్నాడు.

ఆ వూళ్లో చాలమందినోట వాడు "జాతకం శాస్త్రి" అనేపేరు వింటున్నాడు. అతనెవరో ఆ వూరికి పదిమైళ్ల దూరానవున్న టౌన్లో వుంటాడట, పదిరూపాయలు తీసుకుంటాడట, జరగబోయేవన్నీ చెబుతాడట, ఆయన చెప్పినవన్నీ జరుగుతాయట అని అందరూ అనుకోవడం విన్నాడు.

ఓ పున్నమిరాత్రి, చెరువుగట్టుమీద పడుకుని చందమామకేసి చూస్తూ తెల్లార్లూ ఆలోచించాడు. ఏమాలోచించగలడు ? వాడిది అమావాస్య మెదడు. తెల్లార్లూ జాతకం శాస్త్రి గురించి విన్నవే చెవుల్లో మోగుతున్నాయ్. తెల్లవారు ఝామున వాడికని పించింది—జాతకం శాస్త్రికి పదిరూపాయలివ్వాలని.

ఆ మరునాటినుంచి ఎవరైనా పనిచెబితే చేసేసి, పదిరూపాయలు యిమ్మనడం ప్రారంభించాడు.

'పిచ్చివెధవ'...ఫర్వాలేదు. మనం వాడ్నేం అన్నా వాడికి కోపం రాదులెండి. అన్నీ వాడికలవాటే ... అయినా వాడిప్పుడు ప్రాణాలతో కూడ లేడుగా ...! ఆ పిచ్చివెధవకేం తెలుసు పదిరూపాయలంటే — ఈ రోజుల్లో పదిరూపాయల కోసం 'మానం' బజారులో నిలబడుతోందని, పదిరూపాయల కోసం ప్రాణాలు కూడా పోతున్నాయని వాడికేం తెలుసు ?

వాడికి పదిరూపాయలు కావాలి — పన్లుచేసి అడుగుతున్నాడు. అంతేగాని అడుక్కోడం లేదు. అంతే...అదే పెద్దనేరంగా వూరంతా పాకిపోయింది. అప్పులకింద పేదోళ్ల అస్థికల్లాంటి ఆస్థుల్ని కూడ స్వంతం చేసుకుంటూ బ్రతుకుతున్న ఓ మోతుబరి "అమ్మమ్మో ! దేశం పాడైపోతోంది" అని వాపోయాడు.

అప్పట్నించి వూరంతా వాడిని అసహ్యించుకొంటోంది. కానీ, పన్లు చెప్పడం మానలేదు.

వాడు పన్లుచేస్తూనేవున్నాడు—పదిరూపాయలు అడుగుతూనే వున్నాడు.

అడగ్గా అడగ్గా కొన్నాళ్లకు ఐదుపైసలు, పదిపైసలు పడెయ్యడానికి అతికష్టంగా ముందుకొచ్చారు, మహత్తర మానవజాతికి చెందిన ఆ వూరివారు.

అలా అలా కొన్నాళ్లకు గుప్పెడు చిల్లర పోగైంది.

ఓ రోజు "పదిరూపాయలంటే యెంత ?" అని ఎవర్నో అడిగాడు వాడు. సమాధానంగా అతను రెండు చేతులూ చూపించి వెళ్లిపోయాడు.

వాడికది అర్ధంగాక తన రెండుచేతులూ చూసుకున్నాడు. వాడి హస్తాలు రెండు దగ్గరగ కనిపించేసరికి, రెంటినీ కలిపి "ఓహో ! దోసిడంత కాబోలు" అనుకున్నాడు. మరి కొన్నాళ్లకు వాడి దోసిలినిండింది.

గుడి దగ్గరికి పరుగెత్తి "ఇది పదిరూపా

యలా?'' అని పూజారినడిగాడు. నిత్యం ''రామ నామం'' జపించే ఆ పూజారి తీరిగ్గా కూర్చొని చిల్లరంతా లెక్కపెట్టి, ''పధ్నాలుగు రూపాయల అరవై పైసలు బాబూ!'' అన్నాడు. ''పదిరూపాయలు కావా ?'' అన్నాడు దిగాలుగ వాడు. ''నీకు పదిరూపాయలు కావాలా ?'' అని పూజారి అడిగితే, అవునన్నట్లు తలూపాడు.

పూజారి అందులోంచి నాలుగు రూపాయల అరవై పైసలు తీసి బొడ్లో దోపుకుంటూ ''ఆది పదిరూపాయలు పట్టుకుపో'' అని మిగిలిన చిల్లర చూపించాడు. వాడా చిల్లర ఆనందంగా యేరుకుని జాతకం శాస్త్రి కోసం పరుగుతీశాడు. పూజారి 'రామనామం' జపిస్తూ గుడిగంట కొట్టాడు.

కనుక్కుంటూ, వెతుక్కుంటూ శాస్త్రి యిల్లు చేరాడు మనవాడు. మాసిపోయి, చినిగిపోయి వేలాడే బట్టల్లో — బ్రతుకుమీది ఆశతో వేలాడే వాడిరూపు జాతకశాస్త్రి కడుపు కెలికింది.

''ఎవరుబాబూ నువ్వు ? ఏం కావాలి ?'' అని అడిగాడు శాస్త్రి ప్రేమగా.

''ఇదిగో పదిరూపాయలు'' అంటూ దోసిలి ముందుకు చాపాడు వాడు. దోసిట్లోవున్న చిల్లర చూసి శాస్త్రి ''జాతకం చెప్పాలా ?'' అన్నాడు జాలిగా. వాడు ఆశగా తలూపాడు. ''కూర్చో. ఆ డబ్బక్కడుంచు'' అని శాస్త్రి అంటే, వాడా చిల్లర శాస్త్రి ముందుపోసి తను అతని కెదురుగ-కుదురుగ కూర్చున్నాడు.

''ఏదీ, చెయ్యి చూపించు'' అన్నాడు శాస్త్రి కళ్లజోడు పెట్టుకుంటూ. వాడు రెండు చేతులూ చాపాడు. శాస్త్రి నవ్వుకుంటూ వాడి కుడిచెయ్యి నందుకోగా వాడు యెడం చెయ్యి లాక్కున్నాడు. శాస్త్రి చెయ్యి చూస్తున్నాడు.

మొరటువారిన వాడి చేతిలో లెక్కలేనన్ని రేఖలు.

చెయ్యిబోతే చేతుల్ని — కదలబోతే కాళ్లని
కట్టిపడేసే రేఖలు. అవి కడుపు కాల్చే రేఖలు.
ఎందు ముళ్లతీగలా చేతినిండా అవే రేఖలు.

శాస్త్రికేదో అనిపించి వాడికేసి చూసి ''తల్లి దండ్రుల దగ్గర పెరిగే జాతకం కాదు నాయనా నీది'' అంటూ వాడి కళ్లల్లోకి చూసి, మౌనంగా



సినీ నటుడు-రచయిత: రంగనాథ్

తలవాల్చి యేదో ఆలోచించి మళ్లీ రేఖలు చూడ సాగాడు.

''అరె! ఎలా తెలిసిపోయిందబ్బా!'' అని ఆశ్చర్యపోయాడు వాడు. శాస్త్రి, అదేదో రేఖని పదే పదే చూసి దారంపెట్టి కొలిచి పెదవి విరిచేశాడు.

శాస్త్రి ఆందోళనతో వాడి ముఖంలోకి చూశాడు. వాడు మునుపటి ఆశ్చర్యంలోనే వున్నాడింకా.

''బాబూ! నీకు చెప్పవలసింది ఒక్కటే వుంది. అది చెప్పడానికి నాకు బాధగావుంది.'' అంటూ నుదురుమీద రుద్దుకున్నాడు శాస్త్రి. వాడు ఏ మార్పూలేకుండ శాస్త్రివైపు చూస్తున్నాడు. శాస్త్రి వాడివైపు చూడకుండా ''ఆ డబ్బు తీసుకో బాబూ!'' అంటే — అదే పద్ధతేమోనని వాడు చిల్లరంతా యేరాడు. శాస్త్రి జాలిగా వాడికేసి చూస్తూ ''ఈ వారంలో నీకు మరణగండముంది'' అన్నాడు మెల్లగా. ''అంటే ?'' అని అర్థంగాక వాడన్నాడు.

''ప్రమాదం జరిగి నువ్వు చచ్చిపోవచ్చు'' అని ఆగిపోయాడు శాస్త్రి. వాడి ముఖంలో కొద్దిగా మార్పువచ్చింది. ఏదో చీకటి వాడికళ్లల్లో దోబూచులాడింది.

''ఖంగారు పడక బాబూ!'' అని వాడిభుజం తడుతూ శాస్త్రి ''ఈ వారంలో గనుక ఏమీ జరక్కపోతే ఆ తర్వాత నువ్వు రాజాలా బ్రతుకుతావు. కావలసినంత డబ్బు సంపాదిస్తావు, లెక్కలేనన్ని యిళ్లు, పొలాలు కొంటావు — హాయిగా వుంటావు.'' అని ముగించాడు. వెంటనే మళ్లీ ''ఈ వారం రోజులుమాత్రం జాగ్రత్తగా వుండునాయనా!'' అని హెచ్చరించి వెళ్లిరమ్మన్నాడు. వాడి కళ్లల్లో చీకటి మాయమైంది.

శాస్త్రి చెప్పిన వారంతర్వాత వ్యవహారం తలచుకుంటూ ఆనందంగా అక్కడ్నుంచి కదిలాడు.

వెళ్లిపోతున్నవాణ్ణి, కళ్లజోడు తీసి చూస్తూ, ''వాడికేం ప్రమాదం రాబోతోందా?''అనే ఆలోచనలో పడ్డాడు శాస్త్రి.

అంతలో కస్సుమని బస్సొకటి ఆగింది. ఎక్కడో దున్నపోతు వికృతంగా అరిచింది.

బస్సు బ్రేక్ శబ్దానికి శాస్త్రి ఆలోచనల్లోంచి బయటపడ్డాడు. జనం అరుపులు, కేకలు విని అక్కడికి పరుగుతీశాడు.


బస్సు చుట్టూ అల్లరి, జనం — బస్సు కింద కుర్రాడు. వాడి చుట్టూ చిల్లర డబ్బులు — వాడి చేతిలో ముళ్లరేఖలు.


''అబ్బా!'' అంటూ శాస్త్రి నుదురు బాదుకున్నాడు.

తలచిట్లి మెదడు సగం బయటకు వచ్చి రక్తపు మడుగులో ప్రాణంపోయి పడున్నవాడ్ని చూస్తూ ...

''వీడికీ క్షణంలోనే గండం వుందని తెలుసుకోలేకపోయానే — నా పాండిత్యాన్ని తగలెయ్య'' అని మనస్సులో ఎంతగానో తన పాండిత్యాన్ని తిట్టుకున్నాడు.

కానీ — అసలు నిజం తెలిసుంటే అతని గుండె ఏమయ్యేదో! చిన్నప్పుడు జాతరలో తప్పిపోయి తిరుగుతున్న ''తన కొడుకే వాడ''న్నది చేతిలోని యే రేఖా చెప్పలేకపోయింది!? ★







'నాకు నుగ్గేయడం రాదు డైరెక్టరుగారూ! ఎవరినైనా 'డూప్'ని పెట్టి తీయించండి!'



ఎవరు వీరు ? ఎవరు వీరు ? లో సముద్రపు వీరు

సావేరి(జయసుధ)ను మురళి(మురళీమోహన్) కలుసుకుని, ''మీ పేరు ?'' అన్నాడు.

''ఒక రాత్రి పరిచయానికి ఊరు, పేరు ఎందుకు ?'' అంటూ నవ్వింది సావేరి. ఆ నవ్వులో ఎంతో బాధ ఉంది.

''కాదు; మీ పేరు నాక్కావాలి.''

''మీ ఇష్టం వచ్చిన పేరుతో పిలుచుకోండి.''

''ఏం ? పేరు చెప్పకూడదా? సావేరి కదూ?''

''మీకెలా తెలుసు ?''

''మీరు నాలుగేళ్ళక్రితం హైదరాబాద్ కళాభారతిలో సితార ప్రోగ్రామ్ ఇచ్చారు కదూ ? అప్పుడు మీ జీవితంలో మొట్టమొదటిసారిగా

మీ నుంచి ఒక స్వీక్తి ... గ్రాఫీ తీసుకున్నాడు ... ఐ థింక్ నేను మీ మొట్టమొదటి అభిమానిని.''

''అయితే, నా చిట్టచివరి అభిమాని కూడా మీరే ... ఆ రోజే నాకూ, నా భవిష్యత్‌కూ, నా సితారాకూ బంధం తెగిపోయింది.''

''నాకు తెలుసు ఆ బంధం ఎలా తెగిపోయిందో. ఆ తర్వాత మీరేమైపోయారో తెలియదు. కాని, మీరు మాత్రం మా అందుబాటులో లేరని తెలుసు. అనుకోకుండా మొన్న మీరు ఎవరితోనో ఒక కారులో వెళ్తూండగా చూశాను. ఆ కారు నెంబర్ తెలుసుకుని, మీరిక్కడ ఉన్నారని తెలుసుకుని, మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను. మీకు అభ్యంతరం లేకపోతే, మిమ్మల్ని తీసుకెళ్దామనుకుంటున్నాను.''

''తీసుకెళ్లి ... ?''

''పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను.''

సావేరి విరగబడి నవ్వింది.

''ఏమిటి ! దేనికి నవ్వుతారు ?''

''హుం ... ఇవి సముద్రపు నీళ్ళు. చూడ్డానికే బాగుంటాయి. తాగడానికి పనికిరావు.''

''నో ... కాదనకండి. ఆ రోజు మీరు పాడిన పాట, పాడుతున్న మీ ముఖం ... అదే ... అదే ... కళ్ళు మూసుకున్నా, నా కళ్ళలోకి నిలుస్తుంది.''

''చూడండి. మీకు నా మీదున్న అభిమానానికి నేను బ్రతికున్నంతకాలం మిమ్మల్ని గుర్తు పెట్టుకుంటాను. కాని, నాకు మరో కొత్త జీవితం వస్తుందని, నా జీవితం కొత్త మలుపు తిరుగుతుందని నేననుకోవడం లేదు. ఆశించడం లేదు.



'బాలనాగమ్మ'లో మంజుభార్గవి

కారణం — అది నాకు జరగదని తెలుసు.''

''ప్లీస్ ... ఇంకొక్కసారి ఆలోచించండి.''

''అలాగే ... మీరు చెప్పారుకాబట్టి తప్పకుండా ఆలోచిస్తాను. కాని, అప్పుడూ ఇదే సమాధానం వస్తుంది.''

''ఒకే ... అప్పుడు మళ్ళీ మిమ్మల్ని ఆలోచించమనే అడుగుతాను. మీ సమాధానం మారేంత వరకూ ఆలోచించాలి.''

''మారేసరికి మీరు మారిపోతారు.''

''నో ... నో. నేనెప్పటికీ మారను. ఎప్పుడూ అలా అనుకోవద్దు. మీకభ్యంతరం లేకపోతే, మిమ్మల్నొక చిన్న కోరిక కూడా కోరాలని ఉంది ... ఒక్కసారి మీ చేత్తో మీ సితార వినాలనుంది. ప్లీస్ ... కాదనకండి.''

సావేరి సితార వంక చూసింది.

దాసరి నారాయణరావు రచించి, కీలకపాత్ర నిర్వహించే అనూరాధ సినీ ఎంటర్‌ప్రైసెస్ ''ఎవరు వీరు ? ఎవరు వీరు ?'' చిత్రాన్ని బి. వి. ప్రసాద్ దర్శకత్వంలో ఎ. నాగేశ్వరరావు నిర్మిస్తున్నారు.

"సంతోషిమాత వ్రత మహాత్మ్యం"

''లోకంలో ఎల్లెడలా సంతోషం వెల్లివిరిసేందుకు సంతోషి మాత అవతారమెత్తిన ఆది పరాశక్తి గాథ,'' అన్నారు కమలాకర కామేశ్వరరావు. ఈయన దర్శకత్వంలో జయలక్ష్మి ఆర్ట్ ఇంటర్నేషనల్ వారి ఈ చిత్రం షూటింగ్ మార్చిలో తెలంగాణాలోని సుప్రసిద్ధ దేవాలయాల్లో, కరీంనగర్ పరిసరాలలో జరుగుతుందని ఈ చిత్రాన్ని సమర్పించే కథకురాలు జయలక్ష్మి తెలిపారు. కె.వి. మహదేవన్ స్వరకల్పనలో ఫిబ్రవరిలో గీతాలు రికార్డవుతాయి. భార్గవి మాటలు, యోగానంద్ ఛాయ, తాండవ కృష్ణ నిర్మాణ సారథ్యంలో కె. రాజయ్య నిర్మాత.



''ఈ ఏడు నేను నర్వశ్రీ ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్., శోభన్‌బాబు, కృష్ణంరాజు, శివాజీగణేశన్‌గార్లతోపాటు మల్టీస్టారర్ చిత్రాల్లో నటిస్తున్నాను. ఒక హీరో, ఇందరు హీరోలతో ఒకే సంవత్సరంలో నటించడం ఇదే మొదటిసారేమో !''

''నేను ఎన్ని చిత్రాల్లో నటించానో ఎప్పుడూ లెక్కపెట్టలేదు. ఐతే, నాకు సంతృప్తినిచ్చిన చక్కని చిత్రాలు 35. అలాంటి చక్కని చిత్రాలు 50 దాటితే, ప్రతి చిత్రంలోంచి కొన్ని భాగాలతో ఒక చిత్రమాలికను రూపొందించాలని ఉంది. నా కోరిక త్వరలోనే ఈడేరుతుందేమో !''



నూతన్‌ప్రసాద్

మరపురాని సంక్రాంతి!

1961 లో జరిగిన సంఘటన... తెల్లవారితే భోగి పండుగ అనగా — మా కైకలూరులో సుప్రసిద్ధ హాస్య నటుడు పద్మనాభం ట్రూప్‌తో "కాళహస్తి మహాత్మ్యం" నాటక ప్రదర్శన. మేం 15మంది ఒక జట్టు — మా ఊళ్ళో ఏ నాటకం ఆడినా — ఫ్రీగా చూసేయడం మామూలు. కాని, ఆ నాటకాన్ని చూడ్డానికి మాత్రం మమ్మల్ని లోపలికి పంపలేదు. టిక్కెట్లు కొని చూడ్డానికి మా గాంగ్‌లో ఎవ్వరి వద్దా డబ్బులు లేవు. ఇక, మమ్మల్ని లోపలికి పంపలేదన్న కోపంతో ఆ నాటకాన్ని ఎలా చెడగొట్టాలా — అని ఆలోచించాం. బుర్రలు వేడెక్కేసరికి మెరుపులా ఓ ఐడియా తోచింది. తిన్నగా పవర్ సబ్ స్టేషన్‌కు వెళ్ళాం. ఒక పొడుగాటి వయర్‌ను తీసుకుని, ఆ హాలుకు వెళ్ళే లైన్‌మీద మైనస్ — ప్లస్ తీగలు రెండూ టచ్ అయ్యేలా ఆ వయర్‌ను వేసేశాం. అంతే ... దెబ్బతో ఆ హాలు చీకటై పోయింది. మా ఆనందానికి అవధుల్లేవు. ఓ అరగంట డ్రామా ఆగిపోయాక లైన్‌ను రిపేర్ చేశారు. మళ్ళీ నాటకం మొదలు ... మేం మళ్ళీ మరోచోట వయర్ వేయడం...ఇలా ఏడుసార్లు చేశాం. ఆ తర్వాత తిరిగి హాలు దగ్గరికి వెళ్ళాం — అలా కరెంట్ పోడానికి కారకులు మేమని వాళ్ళకు తెలియదుగా? అప్పటికైనా మమ్మల్ని అనుమతిస్తారేమోనని. ఇక ప్రయోజనం లేక పోయేసరికి మాలో ఉక్రోషం ఎక్కువై పోయింది. మా కసికొద్దీ మా ఊళ్ళో ఆ నాటకం తాలూకు పబ్లిసిటీ కోసం పాతిన సరుకు స్తంభాలను ఒక్కొక్కటిగా పెకలించసాగాం. 24సెంటర్లలో పీకేసిన 48 స్తంభాలను మేమందరం పంచుకున్నాం. ఆ స్తంభాలన్నిటినీ తడిక బోర్డులతో సహా తీసుకెళ్ళి శ్యామలాంబ అమ్మవారి గుడిముందు భోగిమంటలు వేశాం. ఓ పెద్ద ఘనకార్యం చేశామని మా అందరికీ సంతృప్తి, సంతోషం.

ఆ తర్వాత 1964 నుంచి నేను నాటకాలు వేయడం మొదలెట్టాను. నాటకం వేయడమనేది ఎంత కష్టమో, ఎంత శ్రమో స్వానుభవంమీద తెలుసుకున్నాను. అప్పట్నుంచీ నేను నాటకం వేస్తున్నప్పుడు ఏ కొంటె కుర్రాళ్ళో ఎక్కడ కరెంట్‌ను ఆపుచేస్తారో అన్న భయం మాత్రం నన్ను వదల్లేదు.

ఇరవై ఏళ్ళ ఆలస్యమైనా, పద్మనాభం గారికి నా క్షమాపణలు అందజేసుకుంటున్నాను.



"ధర్మవడ్డీ"


"ప్రేమ పంటేళ్ళు"

"జనవరిలో సింగపూర్‌లో షూటింగ్," అన్నారు విజయనిర్మల. ఈమె స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎస్. రమానంద్ నిర్మించే శ్రీ విజయ కృష్ణా మూవీస్‌వారి పై చిత్రానికి రజతోత్సవం జరుపుకున్న హిందీ "లవ్ స్టోరీ" చిత్రం మాతృక.

సినిమా


ఈమె పుత్రుడు నరేష్‌కుమార్ హీరో. ప్లస్‌టూ చదువుకుంటూన్న ఈ స్ఫురద్రూపి కారు డ్రయివింగ్‌లో బహుమతులు పొందాడు. మోటార్ బైక్‌మీద ఫీట్లు చేయగలడు. కరాటే, నృత్యాలు, డైలాగ్ డెలివరీల్లో శిక్షణ పొందాడు. లోగడ "పండంటి సంసారం"లో ఎస్. వి. రంగారావు మనవడుగా, "దేవదాసు"లో చిన్న దేవదాసుగా నటించాడు. ఈ యువకుని సరసన నాయికగ నటించే శ్యామల ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందింది. అమ్జాద్‌ఖాన్ పాత్రను శివాజీగణేశన్ ధరిస్తారు. జగ్గయ్య, రంగనాథ్, మంజుల ఇతర ముఖ్య భూమికలను నిర్వహిస్తారు. ఆత్రేయ సంభాషణలకర్త. వేటూరి గీతాలకు రమేష్‌నాయుడు బాణీలు కూర్చారు. పుష్పాల గోపీకృష్ణ ఛాయ, తోట తరణి శిల్పం, ఆదుర్తి హరనాథ్ కూర్పులతో ఎస్. రవికృష్ణ, ఎస్. రఘునాథ్ నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు.

'జగన్నాథ రథచక్రాలు'లో ఒక సన్నివేశం



కోకిలమ్మ

"కమ్మని కోకిల గానాన్ని అందరూ ఆస్వాదిస్తారు. కాని, ఆ ఆనందాన్ని కోకిల పొందలేదు. కొందరి బతుకులూ అంతే. ఇతరుల కోసం ఎంతో పాటుపడతారేగాని, తమకోసం ఏమీ చేసుకోలేరు. అందుకే 'కోకిలమ్మ' అని పేరెట్టాం," అన్నారు కె. బాలచందర్. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఆర్. ఎస్. రాజా నిర్మించే లక్ష్మీజ్యోతి ఫిలిమ్స్ చిత్రంలో సరిత టైటిల్ రోల్ పోషిస్తుంది. ఇతర పాత్రలను కొత్త నటీ నటులు ధరిస్తారు. ఆగస్టు 14న తొలి గీతం ధ్వని ముద్రితమైంది. ఆత్రేయ గీతాలకు ఎం. ఎస్. విశ్వనాథన్ సంగీత దర్శకుడు. గణేశ్ పాత్రో సంభాషణలకర్త. బి. ఎస్. లోకనాథ్ ఛాయ, ఎన్. ఆర్. కిట్టూ కూర్పు నిర్వహిస్తారు. విశాఖపట్నం ప్రాంతాలలో ఒకే షెడ్యూల్‌లో చిత్రీకరణ ముగుస్తుంది.


నటసామ్రాట్
డా॥ అక్కినేని
నటించిన
దాసరి నారాయణరావు
దాసరి నారాయణరావు
సమర్పించు
వీరరాణి ఎంటర్‌ప్రైజస్
రాగదీపం
సంగీతం: చక్రవర్తి ఫొటోగ్రఫీ: సెల్వరాజ్
నిర్మాత: కొడాలి బోసుబాబు
నైజాం: శ్రీతారకరామ సీడెడ్: స్వర్ణయుగ మూవీస్
SAI KRISHNA ADS

రాణీ రుద్రమ

"రాణీ రుద్రమ పాత్రకు కొత్త నటిని ఎంపిక చేశాం. ఆమెకు వాచకం, అభినయం, గుర్రపుస్వారీ, కత్తి యుద్ధం వగైరా శిక్షణ ఇస్తున్నాం. ఇద్దరు ప్రముఖ హీరోలుంటారు. డైరెక్టర్ ఎవరైనదీ త్వరలో తెలియజేస్తాం," అన్నారు త్రిపురనేని మహారథి. ఈయన "అల్లూరి సీతారామరాజు" అనంతరం తన కలంవాడిని మళ్ళీ ఈ చారిత్రాత్మక చిత్రంలో చూపించబోతున్నారు. "ఎస్. రాజేశ్వరరావు సంగీతం, నలుగురు ఛాయాగ్రాహకులు పనిచేయడం ఇతర విశేషాలు," అన్నారు రోహిణీ ఆర్ట్స్ అధినేత టి. ఎస్. కిశోర్. ఈయన లోగడ "భోగిమంటలు" భారీ చిత్రాన్ని నిర్మించిన విషయం అందరికీ జ్ఞప్తి ఉండే ఉంటుంది.



'కదలివచ్చిన కనకదుర్గ'లో బేబీ జయశాంతి

అపర్ణా క్రియేషన్స్

"కొందరు కొత్తవారు కూడా ముఖ్య పాత్రలు ధరిస్తారు. జనవరి రెండవవారంనుంచి మనరాష్ట్రంలో ఒకే షెడ్యూల్లో షూటింగ్ ముగిస్తాం," అన్నారు ఈరంకి శర్మ. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తయారయ్యే పై సంస్థ చిత్రానికి డిసెంబర్ 11న తొలి గీతం ధ్వనిముద్రితమైంది. దత్తాత్రేయ సంభాషణలకర్త. ఆత్రేయ గీతాలకు ఎం. ఎస్. విశ్వనాథం బాణీలు కూర్చారు. రఘునాథ రెడ్డి ఛాయ, వెంకటరత్నం కూర్పుతో కె. ఆర్. నరేష్‌కుమార్ నిర్మాత.

మురళీమోహన్

సంక్రాంతి సరదాలు

ఆ రోజుల్లో ...

హాఫ్ ఇయర్లీ పరీక్షలు అయిరతర్వాత సంక్రాంతి సెలవులు ఇచ్చేవారు. అన్ని పండగలూ ఒక రోజయితే — సంక్రాంతి పండుగ నాలుగు రోజులు ... అప్పటికి పొలాల్లో ధాన్యం బాగా పండి, ఇంటికివచ్చి గాదెల నిండా నిండి ఉండేది. ప్రతి ఇంటి ముందు చక్కగా పెద్ద పెద్ద ముగ్గులువేసి, గొబ్బెమ్మలుపెట్టి, బంతిపూలతో అలంకరించి, చూడముచ్చటగా ఉంచేవారు. పల్లె అంతా కళకళ లాడుతూండేది.

మిత్రులతో కలిసి పోగుచేసిన గడ్డి, కర్రలు, తాటిబొండ్లు - వీటన్నిటినీ కలిపి, తెల్లవారు ఝామునే లేచి, భోగిమంట వేసేవాళ్ళం ... కొత్త బట్టలు, పిండివంటలు సరేసరి ... మధ్యాహ్నం నుండి కోడి పందాలు, లాటరీలు జరిగేవి రాత్రిళ్ళు కుర్రాళ్ళందరం కలిసి చెడుగుడు, ఉప్పుబిద్ది ఆడేవాళ్ళం. అలా నాలుగు రోజులపాటు ఆటపాటలతో ఆనందంగా గడిపే వాళ్ళం.

పల్లెటూళ్ళలో పండగ సరదాయే వేరు. పట్నాల్లో పండగ సందడే ఉండదు. మామూలు రోజుకి, పండగరోజుకి తేడాయే కనబడదు.

ఇక, ఇప్పుడో ...

పండుగరోజుల ఆ పాత రోజుల్ని, ఆ సరదాలను గుర్తుకు తెచ్చుకుంటూ గడపడంతో సరిపోతుంది.

అసలు షూటింగ్‌ల హడావిడిలో చాలా సార్లు ఇంటిపట్టున ఉండడానికే వీలవడంలేదు

ఐతే, ఈ సంవత్సరం సంక్రాంతి సమయంలో ఔట్‌డోర్ షూటింగ్‌లేవీ లేవు. మద్రాసులోనే ఇన్‌డోర్ షూటింగ్. అంచేత, ఈసారి సంక్రాంతి ఘనంగానే జరుపుకుంటున్నను.

పైగా, ఈ ఏడు నా సంక్రాంతి పండుగకు ఓ ప్రత్యేకత ఉంది. మొదటి సెంచరీ "వారాలబ్బాయి"తో పూర్తయి, రెండవ సెంచరీ ప్రారంభమవుతోంది.



ఇంతవరకు నాకెంతో ప్రోత్సాహాన్నిచ్చి, నాకో స్థానాన్నిచ్చి, సన్మానించిన ఆంధ్ర ప్రేక్షక మహాశయులకు ఈ సంక్రాంతి లక్ష్మి ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాను.

సినిమా

వంశగౌరవంలో అహంభావం

శశి (విజయశాంతి), రేఖ (గీత) కారులో కాలేజీకి వెళ్తున్నారు. వేగంగా కారుని డ్రయివ్ చేస్తూన్న రేఖ ఒక మలుపులో సైకిల్‌మీద వస్తున్న (రాజా)కి డాష్ ఇచ్చింది. పాపం! ఉద్యోగం ఇంటర్వ్యూకోసం వెళ్తున్న మోహన్ బాలన్స్‌తప్పి, పక్కనున్న మురికినీళ్ళలో పడిపోయాడు.

కారు ఆపమని శశి ఎంత చెప్పినా వినకుండా అహంభావి రేఖ ఆక్సిడెంట్‌కి కారణం అతనిమీదే రుద్దిపోయింది.

'ఇకనైనా మారండి'లో మురళీ మోహన్, పాన్ని



ఆ తర్వాత కాలేజ్ నుంచి ఒంటరిగా తిరిగి వస్తున్న రేఖకు రోడ్డుకు అడ్డంగా పెట్టబడ్డ సైకిల్ కనిపించింది. కారు ఆపి, హారన్ కొట్టింది. ఓ పక్కన నక్కిఉన్న మోహన్ ఆమె ఎదురుగా వచ్చాడు. కారుకి అడ్డంగాఉన్న సైకిల్‌ని తియ్యమని రేఖ దబాయించింది. ఉదయం జరిగిన దానికి క్షమాపణ చెప్పుకుంటేగాని సైకిల్‌ని తియ్యనంటూ మోహన్ "నీ మూలంగా చేతిదాకా వచ్చిన ఉద్యోగం జారిపోయింది. నీకు చదువు వేడుక కావచ్చు. నాకు ఉద్యోగం అవసరం. నీకు పారేసేంత డబ్బుఉండొచ్చు. కాని, నాకు బతకటానికి అవసరం. ఆస్తి అంతస్తును నేర్పాలి - అహంకారాన్ని కాదు. మర్యాదగా జరిగిన దానికి క్షమాపణ చెప్పుకో!" అన్నాడు.

"నాకేం అవసరం? కష్టాల్లో ఉన్నానంటున్నావు కదా? ఈ డబ్బుంచు," అంటూ ఓ వంద రూపాయల నోటును రేఖ అందించింది.

"మనిషి భవిష్యత్తుకు నువ్వు ఇచ్చే విలువ ఇదేనన్నమాట? థాంక్యూ!" అంటూ మోహన్ తన జేబులోంచి ఒక పదిపైసలు తీసి ఆ వంద రూపాయలతో జతచేసి ఆమెకిస్తూ, "దీంతో ఒక పది డజన్ల లిప్‌స్టిక్‌లు, ఒక వంద పౌడర్ డబ్బాలు కొనుక్కో. బైదిబై ... సభ్యత, సంస్కారం అనేవి బజారులో దొరికితే, చెరో వందకిలోలు కొనుక్కొని దాచుకో," అంటూ తన సైకిల్ మీద రివ్వున దూసుకు వెళ్ళాడు.

రేఖ అతను వెళ్తున్నవైపు కసిగ చూస్తూండి పోయింది.

అభినయ ఆర్ట్స్ క్రియేషన్స్ "వంశగౌరవం"లో శోభన్‌బాబు, సుజాత, సత్యనారాయణ, అల్లు రామలింగయ్య, రమణమూర్తి, భానుచందర్, ఝాన్సీ, జానకి, పి. ఆర్. వరలక్ష్మి, టమేటోలక్ష్మి, కొత్త హాస్యనటుడు శివరాజు పాల్గొంటున్నారు. జంధ్యాల, చక్రవర్తి, వేటూరి, వెంకట్, కందస్వామి, కె. ఎస్. రెడ్డి, ఎస్. పి. రంగారావు, శివాజీ, బొక్కసం ఆంజనేయులు ప్రభృతి సాంకేతిక వర్గంతో ఏలూరి దుర్గాప్రసాద్ సమర్పించే ఈ చిత్రానికి జాగర్లమూడి ఆదినారాయణరావు, రావి ఆంజనేయులు నిర్మాతలు. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం : ఎన్. రవీంద్ర రెడ్డి.


అఖిలాంధ్ర కళాభిమానులకు నూతన సంవత్సర-
శుభాకాంక్షలు! మీకు మా సంక్రాంతి సమర్పణ!!
రామకృష్ణా సినీ స్టూడియోస్
అనురాగదేవత
-ఈస్ట్‌మన్ కలర్
నిర్మాత
దర్శకత్వం
కెమేరా
హరికృష్ణ * తాతినేని రామారావు * నందమూరి మోహనకృష్ణ
సంగీతం: చక్రవర్తి, రచన: పరుచూరి, నృత్యం: శీను, కూర్పు: రవి
విజయా రిలీజ్
VIJAYA



శతచిత్ర నటుడు మురళీమోహన్‌కి ఇటీవల విజయవాడలోని కళావాహినివారు ఏర్పాటు చేసిన అభినందన సభకి శ్రీ దాసరి నారాయణరావు అధ్యక్షులుగా, శ్రీ అక్కినేని నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. నటి జయసుధ మొమెంటోని ప్రదానం చేశారు. చిత్రంలో వేదిక నలంకరించిన ప్రముఖులని, నివేదిక సమర్పిస్తున్న కళావాహిని కార్యదర్శి శ్రీ ద్వారకానాథ్ బాబుని చూడవచ్చు.

మధుర స్వప్నంలో ముద్దుల బిడ్డ

గోపాల్ ఇంటికి చేరుకోగానే రాధను దగ్గరికి తీసుకున్నాడు. ఆ అదును చూసి అతనికి తెలియకుండా అతని జేబులోంచి డబ్బులు చల్లగా కాజేసింది రాధ. ఆ తర్వాత "వేళాపాళా లేదేంటి ? కూర్చోండి. కాఫీ తీసుకువస్తాను," అంటూ విడిపించుకుంది.

"ఈ రోజు ఈ డాక్టర్‌గారి సంపాదన చూశావా ?" అంటూ గోపాల్ జేబులోంచి డబ్బులు తీసి, "అయిదు ... పది ... అరే రెండు రూపాయ లేవీ ?" అంటూ తెల్లబోయాడు. అప్పుడు రాధ కిడ్డీ బ్యాంక్‌లో డబ్బు దాచడం గమనించి, "ఓహో... అదా సంగతి ! రోజూ జేబులోంచి కొస్తా కొస్తా డబ్బులు మాయమవుతూంటే, ఏమిటా అనుకున్నాను. ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్టలేడని అన్నారు," అన్నాడు నవ్వుతూ.

"నేనేం దొంగని కాను," అంది రాధ బుంగ మూతెట్టుకొని.

"మరి చేసిందేమిటో ?"

"ఇందులో దాస్తున్నాను," అంటూ కిడ్డీ బాంక్ బొమ్మను చూపించింది రాధ.

[illegible]

"వీడెవడు — నా డబ్బులన్నీ పొట్టన పెట్టుకుంటున్నాడు ?"

"పాపం ! వీడికోసం కాదండీ ... మనకు పుట్టబోయే బిడ్డకోసం ..."

"ఓహో ! పుట్టబోయే బిడ్డకోసం ఇప్పటి నుంచీ డబ్బులు దాస్తున్నారన్నమాట ? ఎప్పుడో నీ కోసం పుట్టి, నీ కోసం పెరిగి, నీ మెళ్ళో తాళి గట్టి, నిన్ను గుండెల్లో దాచుకున్న ఈ మొగుడ్ని మరిచిపోయావన్నమాట ! అంతేలే ఈ ఆడాళ్ళు ..." అంటూ చిలిపిగా చూశాడు గోపాల్.

"నిజమేనండీ ... తల్లి కావడంలో ఉన్న ఆనందం — తనకొక భర్త ఉన్నాడని, తనొక భార్యనన్న సంగతి మర్చిపోతుంది ... ఎక్కడున్నా ... ఏం చేసినా, పుట్టబోయే బిడ్డకోసం రాత్రీ పగలూ ఏవేవో ఆలోచనలు ..." అంటూ రాధ ఊహాలోకాల్లో తేలిపోసాగింది.

ఆమె వంకే గోపాల్ గుడ్లప్పగించి చూస్తూ ఉండి పోయాడు.

'రాగ దీపం'లో నాగేశ్వరరావు, జయసుధ



కృష్ణంరాజు ప్రధాన పాత్ర ధరిస్తూ సమర్పించే గోపీకృష్ణా మూవీస్ "మధుర స్వప్నం" చిత్రాన్ని కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో యు.వి. సూర్యనారాయణరాజు నిర్మించారు.

విజయవాడలో "మహా ప్రస్థానం"

"దైనందిన సమస్యలతో సతమతమవుతున్న సామాన్యమానవుని జీవితానికి మా చిత్రం దర్పణం," అన్నారు డైరెక్టర్ కె. హేమాంబరధరావు. నవీన్ ఆర్ట్ పిక్చర్స్‌వారి పై చిత్రం షూటింగ్ డిసెంబర్ 15న విజయవాడలో నిరాడంబరంగా ప్రజావాహిని మధ్య ప్రారంభమైంది. మాదాల రంగారావు, రంగనాథ్, గిరిబాబు, సాయిచంద్, చలపతిరావు, ప్రరా వెంకటేశ్వరరావు, వీరభద్రరావు, నల్లూరి వెంకటేశ్వర్లు, సరోజ, లక్ష్మీచిత్ర, కరుణ, సీతాలతతోపాటు ప్రజా కళాకారులెందరో పాల్గొంటున్నారు. క్రాంతి కథకుడు. మాటలు, పాటలు శ్రీ. శ్రీ రాశారు. ఆర్. రామారావు ఛాయ, సుబ్బారావు కూర్పు, శేషు నృత్యాలు, గోపాల్ సహకార దర్శకత్వం, బాలు ప్రొడక్షన్స్ నిర్వహిస్తున్నారు. "పూర్తిగా విజయవాడలోనే ఒకే షెడ్యూల్లో పూర్తవుతుంది," అన్నారు నిర్మాత జి. దుర్గాప్రసాద్. "మా మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తి మేసెల్లుర్ రాథా మా చిత్రంలో అద్భుతంగా పాడారు," అన్నారు ఈ చిత్రానికి సారథ్యం వహించే మాదాల రంగారావు.

బాపు దర్శకత్వంలో దుక్కిపాటి మధుసూదనరావు చిత్రం

"ఉప పాత్రలను హైదరాబాద్‌లోని స్థానిక కళాకారులకు ఇవ్వదలిచాం," అన్నారు దుక్కిపాటి మధుసూదనరావు. ఈయన నిర్మించే అన్నపూర్ణ పిక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి చిత్రంలో శరత్‌బాబు — సంగీత, సాయిచంద్ రాధిక, సురేష్ — విజయశాంతి ముచ్చటగా మూడు జంటలు. జె. వి. సోమయాజులు ఒక విశిష్టమైన పాత్రను పోషిస్తారు. చాలాకాలం తర్వాత రమాప్రభ ఒక చక్కని పాత్రతో కనిపించబోతోంది. గెస్ట్‌లుగా అల్లు రామలింగయ్య, సూర్యకాంతం నటిస్తారు. ఆత్రేయ శ్రీ శ్రీ రాసిన గీతాలను ఎం. ఎస్. విశ్వనాథన్ స్వరకల్పనలో రికార్డ్ చేశారు. ముళ్ళపూడి వెంకటరమణ సంభాషణలు, బాబా ఆజ్మీ ఛాయ, భాస్కరరాజు శిల్పం, జి. ఆర్. అనిల్ కూర్పులో బాపు దర్శకుడు. జనవరి 14 నుంచి ఫిబ్రవరి 5 వరకు, ఫిబ్రవరి 16 నుంచి మార్చి 1 వరకు జరిగే రెండు షెడ్యూళ్ళలో చిత్రీకరణ పూర్తవుతుంది. ఇది దుక్కిపాటి మధుసూదనరావు నిర్మించే 16వ చిత్రం. వీరి ఇదివరకటి చిత్రాల లాగానే ఈ చిత్రం కథ కూడా ఎంతో రసవత్తరమైనది. హృదయాలను కదిలించే సన్నివేశాలతోపాటు సున్నితమైన హాస్యం కూడా మిళితమై ఉన్న చక్కని సామాజిక చిత్రం కోసం అసంఖ్యాక ప్రేక్షకులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. చాలాకాలం తర్వాత అన్నపూర్ణ పిక్చర్స్ సంస్థ నూతన చిత్ర నిర్మాణానికి ఉపక్రమించడం నూతన వత్సరారంభంలో ఒక శుభవార్తే మరి ! ★


కృష్ణంరాజు సమర్పించు
గోపీకృష్ణా మూవీస్
మధుర స్వప్నం
కలర్
దర్శకత్వం: కె. రాఘవేంద్రరావు B.A.,
నిర్మాత: యు.వి. సూర్యనారాయణరాజు
జీవితంలో
మధురస్వప్నాలకు
వాస్తవికతకు
జరిగే రసవత్తర
సంఘర్షణ!
లక్ష్మీ ఫిలింస్
LAKSHMI PUBS

1981 లో విడుదలైన తెలుగు చిత్రాలు!

* 1. శ్రీవారి ముచ్చట్లు : దాసరి నారాయణరావు, చక్రవర్తి. 2.* పండంటి జీవితం : తాతినేని రామారావు, చక్రవర్తి. 3.* జగమొండి : వి. మధుసూదనరావు, చక్రవర్తి. 4.* ఆకలిరాజ్యం : కె. బాలచందర్, ఎం.ఎస్. విశ్వనాథం. 5.* ప్రేమ సింహాసనం : బీరం మస్తాన్‌రావు, చక్రవర్తి. 6. దేవుడు మామయ్య : కె. వాసు, చక్రవర్తి. 7.* ఊరికి మొనగాడు : కె. రాఘవేంద్రరావు, చక్రవర్తి. 8. ఆడవాళ్ళూ మీకు జోహార్లు : కె. బాలచందర్, కె. వి. మహదేవన్. 9. కొత్త జీవితాలు ; భారతీరాజా, ఇళయరాజా. 10. గజ దొంగ : కె. రాఘవేంద్రరావు, చక్రవర్తి. 11. పార్వతీ పరమేశ్వరులు : ఎం. ఎస్. కోటారెడ్డి, సత్యం. 12. ఆశాజ్యోతి : తాతినేని ప్రకాశరావు, రమేష్‌నాయుడు. 13. తొలికోడి కూసింది : కె. బాలచందర్, ఎం. ఎస్. విశ్వనాథం. 14. తోడుదొంగలు : కె. వాసు, సత్యం. 15.* పటాలం పాండు : ఎస్. డి. లాల్, చక్రవర్తి. 16. నా మొగుడు బ్రహ్మచారి : ఎం. ఎస్. కోటారెడ్డి, చక్రవర్తి. 17.* ప్రేమాభిషేకం : దాసరి నారాయణరావు, చక్రవర్తి. 18. సంఘం మారాలి : ఎస్. ఎం. సంతానం, మాధవ చౌదరి. 19. ఎవరు దేవుడు : ఎ. భీమ్‌సింగ్, కె. వి. మహదేవన్. 20.* అగ్నిపూలు : కె. బాపయ్య, కె. వి. మహదేవన్. 21. ప్రేమ పిచ్చి : సి. వి. రాజేంద్రన్, ఇళయరాజా. 22. లక్ష్మి : బి. వి. ప్రసాద్, చక్రవర్తి. 23.* గురుశిష్యులు : కె. బాపయ్య, కె. వి. మహదేవన్. 24.* రహస్య గూఢచారి : కె. ఎస్. ఆర్. దాస్, సత్యం. 25. తిరుగులేని మనిషి : కె. రాఘవేంద్రరావు, కె. వి. మహదేవన్. 26. క్రాంతి : ఎం. భీమేశ్వరరావు, కె. వి. మహదేవన్. 27. ఇల్లాలు : తాతినేని రామారావు, చక్రవర్తి. 28. దీపారాధన : దాసరి నారాయణరావు, చక్రవర్తి. 29. గోల నాగమ్మ : పి.వి. రాజు, చక్రవర్తి. 30. త్యాగయ్య : బాపు, కె. వి. మహదేవన్. 31.* ప్రేమ నాటకం : కట్టా సుబ్బారావు, సత్యం. 32. పేదల బతుకులు : వి. మధుసూదనరావు, కె.వి. మహదేవన్. 33. నాదే గెలుపు : పోలవరపు బ్రహ్మానందరావు, సత్యం. 34. పులిబిడ్డ : వి. మధుసూదనరావు, చక్రవర్తి. 35. ఇల్లే స్వర్గం : గొర్ల సత్యనారాయణమూర్తి, రమేష్‌నాయుడు. 36. ఎర్రమల్లెలు : ధవళ సత్యం, చక్రవర్తి. 37.* రామదండు : ఎన్. ఎస్. మణి, ఎం. ఎస్. విశ్వనాథన్. 38 భోగిమంటలు : విజయనిర్మల, రమేష్‌నాయుడు. 39. ప్రణయ గీతం : పి. సాంబశివరావు, రాజన్ — నాగేంద్ర. 40.* న్యాయం కావాలి : ఎ. కోదండరామిరెడ్డి, చక్రవర్తి. 41. స్వర్గం : దుర్గా నాగేశ్వరరావు, చక్రవర్తి. 42.* సత్యం—శివం : కె. రాఘవేంద్రరావు, చక్రవర్తి. 43. హరిశ్చంద్రుడు : యు. విశ్వేశ్వరరావు, టి. చలపతిరావు. 44. భోగభాగ్యాలు : సి. చంద్రశేఖరరెడ్డి, చక్రవర్తి. 45. రుద్ర తాండవం : జి. రామమోహనరావు, శంకర్ గణేశ్—శ్యామ్. 46. పాలు—నీళ్ళు : దాసరి నారాయణరావు, సత్యం. 47. టాక్సీ డ్రయివర్ : ఎస్. డి. చిట్టిబాబు, సత్యం. 48. గడసరి అత్త—సొగసరి కోడలు : కట్టా సుబ్బారావు, సత్యం. 49. ఊరు కిచ్చినమాట : ఎం. బాలయ్య, ఎం.ఎస్. విశ్వనాథం. 50. సప్తపది : కె. విశ్వనాథ్, కె.వి. మహదేవన్. 51. ప్రేమకానుక : కె. రాఘవేంద్రరావు, చక్రవర్తి. 52. జేగంటలు : ఎస్. శ్రీనివాసరావు, కె. వి. మహదేవన్. 53. సంగీత : దాసరి నారాయణరావు, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం. 54. అమృతకలశం : గిడుతూరి సూర్యం, రమేష్‌నాయుడు. 55. సంసారం—సంతానం : వి. మధుసూదనరావు, చక్రవర్తి. 56.* విశ్వరూపం : దాసరి నారాయణరావు, చక్రవర్తి. 57.* జీవిత రథం : వి. మధుసూదనరావు, చక్రవర్తి. 58. రాణీ కాసుల రంగమ్మ : టి. ఎల్. వి. ప్రసాద్, చక్రవర్తి. 59. రగిలేజ్వాల : కె. రాఘవేంద్రరావు, చక్రవర్తి. 60 సంధ్యారాగం : ఎస్. రామచంద్రరావు రమేష్

ధృవతార రాలిపోయింది



దాదాపు మూడు దశాబ్దాలపాటు తెలుగు, తమిళ చిత్ర రంగాల్లో 250 చిత్రాలకి పైగా నటించి అన్ని వర్గాల ప్రేక్షకుల అభిమానాన్ని, ప్రశంసలని అందుకున్న మహానటి, దర్శకురాలు శ్రీమతి సావిత్రి డిసెంబరు 26 రాత్రి మదరాసులోని ఒక ప్రైవేటు నర్సింగ్‌హోంలో తమ అంతిమ శ్వాస విడిచారు. ఈమె వయస్సు 45 సంవత్సరాలు.

గత సంవత్సరన్నరనించి శ్రీమతి సావిత్రి అపస్మారక స్థితిలో ఉన్నారు. శ్రీమతి సావిత్రికి భర్త జెమినీ గణేశన్, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

1950 లో 'సంసారం' చిత్రంతో ప్రారంభమైన ఈమె నట జీవితంలో మైలురాళ్ళుగా నిలిచిపోయిన చిత్రాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా 'దేవదాసు' చిత్రంలో 'పార్వతి' పాత్ర పోషణలో శ్రీమతి సావిత్రి ప్రదర్శించిన ప్రతిభా విశేషాలు అనితర సాధ్యమైనవి.

బ్రతుకుతెరువు, అర్ధాంగి, మిస్సమ్మ, దొంగ రాముడు, తోడికోడళ్ళు, గుండమ్మ కథ, రక్తసంబంధం, డాక్టర్ చక్రవర్తి, వెలుగునీడలు, మనసే మందిరం, మూగమనసులు, నవరాత్రి ఆదిగా గల సాంఘికాలు, నర్తనశాల, పాండవ వనవాసం, మాయాబజార్ మొదలైన పౌరాణిక చిత్రాలలో ఆమె పాత్రలన్నీ ప్రత్యేక ప్రశంసలని అందుకున్నాయి.

నటిగానే కాకుండా దర్శకురాలిగా స్వయంగా 'చిన్నారిపాపలు' చిత్రానికి దర్శకత్వం వహించిన శ్రీమతి సావిత్రి చిరంజీవి, మాతృదేవత, వింత సంసారం, మరికొన్ని తమిళ చిత్రాలకి కూడా దర్శకత్వపు బాధ్యతని నిర్వహించారు.

శోకరస పోషణలో అందెవేసిన చెయ్యిగా పేరు పొందిన శ్రీమతి సావిత్రి 1969 లో భర్త జెమినీగణేశన్‌తో విడిపోయినప్పటినుంచీ ఆమెకి సుఖశాంతులు కరువైపోయి చివరికి ఆమె జీవితమే విషాదాంతంగా ముగిసిపోయింది.

1980 మే 10వ తేదీన ఒక సినిమా షూటింగ్ కోసం బెంగుళూరు వెళ్ళిన శ్రీమతి సావిత్రి ఆ రోజు రాత్రి అపస్మారక స్థితిలో పడిపోయింది. అంతిమ శ్వాస విడిచేవరకూ ఆ స్థితిలోనే ఉన్నది.

తమిళనాడు, కర్నాటక ముఖ్యమంత్రులు, తదితర ప్రముఖులు, నిర్మాతలు, దర్శకులు, ప్రముఖ నటీనటులెందరో ఆమె అకాలమృతికి ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చారు.

మహానటి సావిత్రి మరణంతో చలనచిత్రాకాశంలో ఒక మహోజ్జ్వలమైన ధృవతార రాలిపోయింది.

[— ఎం.]

గాయుడు. 61. అగ్నిరవ్వ: కె. బాపయ్య, కె. వి. మహదేవన్. 62. నేను — మా ఆవిడ : రేలంగి నరసింహారావు, సత్యం. 63. సీతాకోక చిలుక : భారతీరాజా, ఇళయరాజా. 64. అత్తగారిపెత్తనం: రాజాచంద్ర, సత్యం. 65. అమావాస్య చంద్రుడు: సంగీతం శ్రీనివాసరావు, ఇళయరాజా. 66. 47 రోజులు : కె. బాలచందర్, ఎం. ఎస్. విశ్వనాధం. 67. మరో కురుక్షేత్రం : లెనిన్, టి. చలపతిరావు. 68. ముద్దమందారం : జంధ్యాల, రమేష్‌నాయుడు. 69. ఘరానా గంగులు : కట్టా సుబ్బారావు, సత్యం. 70. దారితప్పిన మనిషి : బి. నరసింహారావు, విజయభాస్కర్. 71. చిన్నారి చిట్టిబాబు : ఎన్. గోపాలకృష్ణ, రోహిణీచంద్ర. 72. రామలక్ష్మణులు: ఆర్. త్యాగరాజన్, చక్రవర్తి. 73. జతగాడు : బోయిన సుబ్బారావు, చక్రవర్తి. 74. ప్రేమ మందిరం: దాసరి నారాయణరావు, కె.వి. మహదేవన్. 75. శ్రీరస్తు—శుభమస్తు : కట్టా సుబ్బారావు, జె. వి. రాఘవులు. 76. ఓ అమ్మ కథ : వసంత సేన్, ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం. 77. కొండవీటి సింహం : కె. రాఘవేంద్రరావు, చక్రవర్తి. 78. గిరిజా కళ్యాణం : కె ఎస్.ఆర్. దాస్, సత్యం. 79. అంతం కాదిది ఆరంభం : విజయనిర్మల, రమేష్‌నాయుడు. 80. ప్రియ : ఎస్. పి. చిట్టిబాబు, చక్రవర్తి. 81. చట్టానికి కళ్ళులేవు : ఎస్. ఎ. చంద్రశేఖర్, కృష్ణ — చక్ర. 82. సత్యభామ : కె. రాఘవేంద్రరావు, చక్రవర్తి. 83. గువ్వలజంట : కె. వాసు, జె. వి. రాఘవులు. 84. అద్దాలమేడ: దాసరి నారాయణరావు, రాజన్—నాగేంద్ర. 85. మాయదారి అల్లుడు : కె. ఎస్. ఆర్. దాస్, జె.వి. రాఘవులు. 86. సింహస్వప్నం: పి. దుర్గాప్రసాద్, దేవనాస్ ఘోష్. 87. డబ్బు! డబ్బు! డబ్బు! : జి. రామమోహనరావు, శ్యామ్. 88. మహా పురుషుడు : లక్ష్మీదీపక్, చక్రవర్తి. 89. పక్కింటి అమ్మాయి : కె. వాసు, చక్రవర్తి. 90. రాధా కల్యాణం : బాపు, కె. వి. మహదేవన్. 91. వాలాలబ్బాయి : రాజాచంద్ర, చక్రవర్తి. 92. అల్లుడుగారూ జిందాబాద్: కట్టా సుబ్బారావు, చక్రవర్తి. 93. రామాపురంలో సీత : ధవళ సత్యం, జె. వి. రాఘవులు. 94. మినిస్టర్ మహాలక్ష్మి. డాక్టర్ రంగారావు, మాధవరావు. 95. కిరాయి రౌడీలు : ఎ. కోదండరామిరెడ్డి, చక్రవర్తి. 96. వాడని మల్లి : ఎ. వి. ఎం. మురుగన్, సత్యం. 97. నాయుడుగారబ్బాయి : బి. వి. ప్రసాద్, చక్రవర్తి. 98. నోముల పంట : పి. శేఖర్, సత్యం.

[సేకరణ : జి.వి.జి]

ఆంధ్రసచిత్రవారపత్రిక

1981 ఫిలిం బ్యాలట్ పత్రం

1. ఉత్తమ చిత్రం
....
2. ఉత్తమ నటుడు
....
3. ఉత్తమ నటి
....
4. ఉత్తమ దర్శకుడు
....
5. ఉత్తమ సంగీత దర్శకుడు
....
6. ఉత్తమ సహాయ నటుడు
....
7. ఉత్తమ సహాయ నటి
....
8. ఉత్తమ హాస్యనటుడు
....
9. ఉత్తమ హాస్యనటి
....

ముగింపు తేదీ
6-2-'82

పేరు : ....

అడ్రసు : ....

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఎస్. వి ఆర్ - చినవంక

చెట్టు నీడని, చెరువు నీళ్లని వెన్నెల చల్లదనాన్ని యిస్తుంది. దేనిని ఆశించి ?

★ దేనినీ ఆశించికాదు. అది వాట్ల సహజ గుణం.

నాగేశ్వరరావు - విజయవాడ

పెన్ పట్టుకున్న ప్రతి రచయిత్రీ తనొక పెద్ద రచయిత్రి అయిపోయినట్టు భావించి తన నవలలో స్నేహానికి ప్రేమకు అంతరాలని తొలగించి యువతని చెడగొట్టేస్తున్నారని నా అభిప్రాయం.

★ పాఠకుల పేజీలకి ఉత్తరాలు గుప్పించండి సార్... సంపాదకులు కళ్లు తెరుస్తారు. తక్షణం సంఘం పాడై పోతోందని ఆడరచయితల్ని నోరు మూయిస్తారు! (వరిచిపోయి పది పేర్లతో మీరే - ఒకే వూరునుంచి రాసేయకండి—బాలెట్ పేపరులాగ!)

యు. యు. - ఎమ్మిగనూరు

సర్వ దుఃఖాలకీ కారణహేతువు ఏమిటి ?

★ తీరని కోరికలు.

మానవుడు విజ్ఞాన శాస్త్రంలో సాధిస్తున్న విజయాలు మానవుని జీవనగతిని మార్చగల వంటారా ?

★ మార్చడం సంగతి అటుంచి, క్లిష్టతరం చేస్తున్నాయా అనిపిస్తుంది !

ఎ. ఎస్. కె విజయవాడ

ఇదివరకు పాఠకులకి కోపంగా వెటకరంగా సమాధానాలు యిచ్చేవారు. ఇప్పుడు ఆత్మీయంగా అభిమానంగా యిస్తున్నారు. కారణం ఏమిటి ? కోపం తగ్గించుకున్నారా ?

★ పెరుగుతున్న వయస్సై వుంటుంది. కోపం బి. పి. గా మారిపోయిందెప్పుడో ! !

రవి - ఆదోని

ఆడపిల్ల పుట్టిందంటే 'ఆడపిల్లా' అని విరసపడు తల్లితండ్రుల సంఖ్య నేటి నాగరిక ప్రపంచంలో తగ్గిందనే చెప్పాలి. అందుకు కారణం?

★ ఉపయోగిస్తున్న కూతుళ్లు. చక్కగా చదువుకుంటారు. చదువుకుంటూ తల్లికి సాయంగా వుంటారు. ఉద్యోగం చేస్తారు. కానీ ఖర్చు చేసుకోకుండా జీతం తండ్రికిస్తారు. గీచిన గిరి దాటిపోరు. ఇంతకంటే ఏం కావాలి ? !

ఉదయ్ - విజయవాడ

ఈమధ్య కాలంలో రోజుకో భక్తిరస ప్రధాన చిత్రం నూన్‌షోగా విడుదలై అఖండ విజయాన్ని సాధిస్తోంది. కారణం ఏమై వుంటుంది ?

★ రాత్రి చూసిన రక్తిరస ప్రధాన చిత్రానికి ప్రాయశ్చిత్తంగా ఉదయం భక్తిరస ప్రధాన చిత్రాలు చూస్తున్నారేమో మీ ఊళ్లో !

ప్రభ - భీమవరం


ఎంతో ఉన్నతంగా సంస్కారవంతంగా ఉండే మీ జవాబులు నాకు చాలా యిష్టం. ఎంతో మంచి రచనలు మాకు అందించే మీరు ఏమి చదువుకున్నారు ?


★ మీ అభిమానం అలా అనేలా చేస్తోంది అంతే. నేను చదువుకున్నది చాలా తక్కువే — కాని నలుగురిలో, నల్గురిమధ్య తిరిగి మాట్లాడడం; సవ్యంగా మాట్లాడడం, నాలుగు విషయాలూ కుతూహలంగా తెలుసుకోవడం, చదవడం — యివే — నా కాలేజీ చదువుకి — విలువనిచ్చాయి, ఆత్మాహుతి చేసుకున్న పొట్టి శ్రీరాములుని ఆ సమయంలో తరుచు చూడకల్గిన అదృష్టమూ చనిపోయేముందు ఆంధ్రకేసరి వంటివారిని చూడకల్గిన భాగ్యమూ మర్వని రాజాజీ ఛలోక్తులు ఖాసాతో పంచుకున్న ఆనందం ఆంధ్రావతరణా దేరానగర్ రాజధానీ... ఎన్నెన్నో నా ఆలోచనలకి కొత్త కోణం యిచ్చాయి క్లబ్‌వాలా జాదవ్ ముత్తు లక్ష్మిరెడ్డి, దుర్గాబాయి గారు...సిస్టర్ సుబ్బలక్ష్మిలాంటి సేవాపరాయణులూ ఉన్నతులూ నన్నీరకంగా రూపొందేలా ప్రభావితం చేశారని గర్వంగా చెప్పకోకలను...కాలేజీ నాలుగ్గోడల మధ్య నేర్చే పుస్తకాల చదువుకి సమాజంలో చైతన్య సంతుల వాఖ్యానం — విస్తరణ కార్యక్రమం లాంటి దనిపిస్తుంది నాకు. చదువుకోవాలి. సంఘంలో మీ కాదర్శంగా కొందరైనా వ్యక్తులుండాలి. అప్పుడే చదువుకి సార్థకత.


ఎమ్. ఆర్ ఎస్; మహమ్మద్ హుస్సేన్ షరీఫ్ - గోదావరిఖని

మీరిచ్చే సమాధానాలు చూస్తుంటే మీరుకూడా అనేకానేక సంఘటన అనుభవంతో యిస్తున్నారని పిస్తుంది. లేక ఒక్క విద్యమీదే ఆధారపడి ఆలోచించి సమాధానాలు యిస్తున్నారా ?

★ మనిషికి కళ్లు దేవుడిచ్చిన వరం కొందరు గుడ్డిగా చూస్తారు. కొందరు నిజంగా చూస్తారు. నిజంగా చూస్తే ప్రతి క్షణం యీ సమాజంలో కొత్త పాఠాలు వస్తూనేవుంటాయి; సృజనాత్మక కళలను చేపట్టినవాళ్లు - యిలా నిజంగా చూస్తారు. అదే వారి పెట్టుబడి. ★







మాదాల రంగారావు
సారథ్యంలో
యువతరం పిక్చర్స్
సామాజిక విప్లవానికి
జనసారథ్యం
వహిస్తున్న
ప్రజాశక్తి కివే
విప్లవాభివందనాలు
A
నిర్మాతలు:
టి.కృష్ణ.కె.రాధాకృష్ణ
దర్శకత్వం
శిరం మస్తాన్‌రావు
నవయుగ పిక్చర్స్

ఆశలో ఆశ



చిన్నకోట సుశీలాదేవి

గుడి మెట్లమీద కూర్చున్న బిచ్చగాళ్లకు డబ్బులు వేస్తూ, మెట్లు దిగుతున్నారొక జంట! బిచ్చగాళ్ల వరుసలో కూర్చున్న రాఘవ ఆ జంట వంకే కన్నార్పకుండ చూస్తున్నాడు.

ఆమె ... ఎవరు...అచ్చు మాధవిలానే వుందే! ఆనడక, విశాలమైన కళ్లు... ఎడమ బుగ్గమీద నల్లటి పుట్టుమచ్చ... మాధవే!

ఆమె ప్రక్కన సూటు, బూటులో ఆ వ్యక్తి ఎంతో అందంగా వున్నాడు. ఆ వ్యక్తి చేతిలో బాబు ...

అయితే మాధవి మళ్లీ పెళ్లి చేసుకుందా! ఆ ఆలోచన రాఘవ మనసులో సన్నటి మంట రేపింది.

తనెంత నికృష్ట జాతకుడు! తన అదృష్టమే బాగుంటే ఆ వ్యక్తి స్థానంలో తానుండేవాడు. అలా మాధవి ప్రక్కన నడుస్తూ ఆమెతో కబుర్లు చెప్తూ ఎంతో హాయిని అనుభవించేవాడు.

కాని విధివ్రాతని ఎవరు తప్పించగలరు? రాఘవ చిన్నగా నిట్టూర్చాడు.

ఆమె దగ్గరికి వచ్చేస్తోంది! తన ముఖం ఆమెకి చూపించడం ఇష్టంలేక తలొంచుకున్నాడు రాఘవ.

అయినా తన పిచ్చిగానీ, మాధవి తనని ఎలా గుర్తుపడుతుంది! తనెంతో మారిపోయాడు! తనని తాను చూసుకున్నాడు! దుఃఖం పొంగుకు వచ్చింది.

"ఏయ్! అబ్బీ! చెయ్యి పట్టు!"

రాఘవ ఉలిక్కిపడ్డాడు! ఎదురుగా ఎర్రచీర... జరీ అంచు పచ్చటి పాదాలమీద జీరాడుతోంది.

అప్రయత్నంగా చెయ్యి చాపాడు.

చేతిలో అయిదుపైసల నాణెం పడింది.

"పాపం కాలు, చెయ్యీ లేదు." ప్రక్కనున్న వ్యక్తి మాధవితో అంటున్నాడు.

"ప్చ్!" మాధవి జాలిపడింది.

వాళ్లు ముందుకు సాగిపోతున్నారు! వాళ్ల మాటలు సన్నగా వినిపిస్తున్నాయి.

రాఘవకి తనమీద తనకే అసహ్యం కలిగింది. తాను ఇంకా ఎందుకు బ్రతికున్నాడు! ఏ కోరిక తీరాలని! ఏ ఆనందం అనుభవించాలని! తను జీవించడం వ్యర్థం.

రాఘవ తలెత్తి చూశాడు.

మాధవి మెట్లక్రింద అదృశ్యమైంది!

ఇన్నాళ్లూ తనకి ఒకేకోరిక వుండేది! మాధవిని ఒక్కసారి చూస్తే చాలు అనుకునేవాడు. ఆమె నవ్వుతూ, జీవితం గడుపుతూంటే కళ్లారా చూడాలని ఆశపడుతుండేవాడు.

ఇన్నాళ్లకి ఆమెని చూశాడు! తన కోరిక తీరింది.

కానీ ఎందుకో సంతోషం లేదు, తృప్తిలేదు! గుండెల్లో ఏదో ఆవేదన ...

మాధవి తనమాటే మర్చిపోయి హాయిగా వుంది అందమైన భర్త, చక్కటి బాబుతో ఎంతో సుఖంగా జీవిస్తోంది.

మీరు లేకపోతే నేను బ్రతకలేనండీ ... 'కలిసి జీవిద్దాం! కలిసి మరణిద్దాం'... అన్న మాధవేనా! స్త్రీల ప్రేమ ఇంత క్షణికమా!

తానిప్పుడు మాధవి దగ్గరికెళ్లి ... "నేను నీ రాఘవని" అంటే ఏం చేస్తుంది!

అసహ్యించుకుంటుందా! ఆదరిస్తుందా? అయినా తనే కదా అన్నిటినీ ఎదుర్కుంది! మాధవి సుఖంకోరే తనిలా వచ్చేశాడు! ఇటువంటప్పుడు మాధవి హాయిగా వున్నందుకు సంతోషించాల్సింది పోయి తనెందుకిలా బాధపడుతున్నాడు.

మాధవి తనకోసం ఏడుస్తూంటే బాగుంటుందా?...

రకరకాల ఆలోచనల్తో రాఘవకి బుర్ర తిరుగుతున్నట్లుగా అన్పించి వెనక్కి జారగిలబడి కూర్చున్నాడు.

తనకీ స్థితి రాకుండా వుంటే ...

అసలారోజు ఏ దుర్ముహూర్తాన బయలుదేరాడో కానీ ... ఆ భయంకరమైన రాత్రి ...తన కలలన్నిటినీ సమాధి చేసిన రాత్రి ...

ఆనాటి సంఘటన అతని కళ్లముందు మెదిలింది.

అవి రాఘవకి కొత్తగా పెళ్లయిన రోజులు. పండక్కి అత్తవారింటికి బయలుదేరాడు! రైలు కంటె వేగంగా పరిగెడుతోంది అతని మనసు.

ఎప్పుడెప్పుడు మాధవిని చూద్దామా అని అతని హృదయం ఆరాటపడుతోంది.

మాధవికి ఇష్టమని జరీఅంచు తెల్లచీర కొన్నాడు! ఆ చీరలో అందమైన మాధవి ఇంకెంత మెరిసిపోతుందో! తలుచుకుంటుంటేనే మనస్సు స్వాధీనం తప్పుతోంది! నిజంగా ఆ క్షణాలు అనుభవానికి వస్తే ... ఆ అనుభూతి ఊహకు అందటం లేదు.

'రైలు చాలా నెమ్మదిగా వెడుతోందే' అనుకున్నాడు. అప్రయత్నంగా ఆమాటలే పైకి అనేశాడు.

ఎదుటి సీటులోని ముసలాయన ఆ మాటలకి నవ్వుతూ! "అత్తారింటికి వెడుతున్నావా బాబూ!" అనడిగాడు.

రాఘవ సిగ్గుతో తల పక్కకి తిప్పుకున్నాడు.

కిటికీలోనుండి చల్లగాలి ... మాధవి చేతి స్పర్శలా మెత్తగా తగులుతోంది. మెల్లగా కళ్లు మూసుకున్నాడు. మగతలోకి జారాడు.

ఏవేవో కేకలు... ఏడుపులు విన్పించడంతో మెలకువ వచ్చింది.

రాఘవ కళ్లు తెరిచాడు! రైలు ఒక ప్రక్కకి ఒరిగిపోయింది. ఎదుటిసీటులోని ముసలాయన వేసిన కేకకి పెట్టె అదిరిపోయింది.

తానేదో అఘాతంలోకి పడిపోతున్నట్లన్పించింది రాఘవకి! తూలి పక్కకు పడ్డాడు ... అంతే ... తిరిగి కళ్లు తెరిచేసరికి తెల్లటి గోడలు... చకచకా తిరిగే నర్సులు ... కన్పించారు.

ఇదేమిటి! హాస్పిటల్‌లా వుందే ... తనిక్కడ వున్నాడేమిటి! అనుకుంటూ లేవబోయాడు రాఘవ.

కానీ నడుం పట్టేసింది.

"అమ్మా!" అంటూ బాధతో మూలిగాడు.

నర్సు పరుగున వచ్చింది.

"లేవకండి! కుట్లు కదుల్తాయి!" రాఘవని జాగ్రత్తగా పడుకోబెట్టింది.

రాఘవ శరీరం వైపు చూసుకున్నాడు! చేతులకు కాళ్లకు బాండేజి కన్పించింది.

"సిస్టర్! నాకేమయింది?" భయంభయంగా అడిగాడు!

"రైలు ప్రమాదం జరిగింది సార్! అదృష్టవంతులు కాబట్టి ప్రాణాల్తో బయటపడ్డారు! మీకు బాగా రెస్టు కావాలి! కదలకండి!" అని చెప్పి వెళ్లిపోయింది.

రాఘవ ఆలోచిస్తూ పడుకున్నాడు.

కొద్దికొద్దిగా జ్ఞాపకం వస్తోంది! తను ఏలూరు వెళ్లాలని, రైలెక్కాడు. మధ్యలో ఈ ప్రమాదం జరిగింది!

బంధం



తను హాస్పిటల్లో చేరి ఎన్నిరోజులైందో! అమ్మా, నాన్నగారు, ముఖ్యంగా మాధవి... తనని గూర్చి ఎంత కంగారు పడుతున్నారో! తనని త్వరలో డిశ్చార్జి చేస్తే బాగుండును! వాళ్ళందర్నీ చూడాలని వుంది! అనుకున్నాడు రాఘవ.

అయిదోరోజు కుట్లు విప్పారు. అప్పుడు తెలిసింది రాఘవకి అసలు స్థితి! ఒక కాలు, చెయ్యిలేదు. రాఘవ గుండె బ్రద్దలైంది! నిజాన్ని తట్టుకోలేక స్పృహ కోల్పోయాడు.

ఆ మర్నాడు రాఘవకి ఇంజక్షనిస్తూ — "మీదేవూరు! మీ వివరాలు చెప్పండి. మీ వాళ్ళకి వుత్తరం రాస్తాం!"అన్నాను.

ఆ ప్రశ్నతో రాఘవ ఉలిక్కిపడ్డట్టయ్యాడు.

తన వాళ్ళా!

వాళ్ళు తన స్థితిచూసి తట్టుకోగలరా!

తనపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లీ, తండ్రీ ... మాధవి ...తను కుంటివాడని తెలిస్తే ఏమయిపోతారు! తను వాళ్ళదగ్గరికి వెళ్ళలేడు! వెళ్ళి వాళ్ళకు భారంగా వుండలేడు.

తను రైలుప్రమాదంలో మరణించాడని తెలిస్తే ఒక ఏడుపు ఏడిచి వూరుకుంటారు.

మాధవికి పెళ్ళయి రెండు నెలలే అయింది కాబట్టి మళ్ళా వివాహం జరగొచ్చు!

తానిప్పుడు ఇలావెడితే అమ్మా, నాన్నాలకి — మాధవికి ఒక గుదిబండలా తయారవుతాడు! కాబట్టి తను మళ్ళీ వెళ్ళకపోవడమే మంచిది.

ఇలా ఆలోచించి చివరికి డాక్టరు ఇచ్చిన క్రచలతో విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టాడు.

"ఏరోయ్! నిద్దరోతన్నావా! లే! పోదాం!" తోటి బిచ్చగాడు తట్టి లేపడంతో కళ్ళు విప్పి చూశాడు రాఘవ!

బాగా చీకటి పడింది.

చెట్ల చాటునుండి చంద్రుడు రానా, వద్దా అంటున్నాడు.

రాఘవ మెల్లగాలేచి క్రచసాయంతో అడుగులు వేస్తున్నాడు.

దూరంగా మండపంపైన ఇద్దరు వ్యక్తులు లీలగా కన్పించారు.

'వాళ్ళేనా! ఏమో!' అనుకుంటూ తలొంచుకుని గబగబా మరో ప్రక్కకు అడుగులేశాడు రాఘవ!

ఆ క్షణంలో మాధవి తన ప్రక్కన కూర్చున్న వ్యక్తితో అంటోంది —

"అన్నయ్యా! ఏనాటికైనా నా కోరిక తీరుతుందంటావా!"

చెల్లెలిపై జాలి పడ్డాడతను.

"మాధవీ! నామాట విని మళ్ళీ పెళ్ళిచేసుకో! మూర్ఖంగా ఆలోచించి జీవితాన్ని పాడుచేసుకోకమ్మా!"

అతని మాటలకు మాధవి చిన్నగా నవ్వింది!

"అన్నయ్యా! అదంత సులభంకాదు. నువ్వొక్కసారి ఆయన్నిచూస్తే ఆయనెంత మంచివాడో నీకు తెలిసేది! ఆయనతో నేను గడిపింది కొద్దికాలమే! అయితే ఏం ఆయన పోలికల్తో పుట్టిన ఈ బాబు నాకు చాలన్నయ్యా! వీడిని చూసుకుంటూ ఈ జన్మకింతేనని సరిపెట్టుకుంటాను." కనుకొలకుల్లో నిలచిన నీటిని కొంగుతో తుడుచుకుంది మాధవి!

"అన్నయ్యా! ఆ రైలు ప్రమాదం జరిగినప్పుడు ఆయన్ని ఏ హాస్పిటల్లో జాయిన్ చేశారో మాకు చాలా ఆలస్యంగా తెలిసింది. తీరా మేము వెళ్ళేసరికి ఆయన్ని డిశ్చార్జి చేసేసారుట! ఆయన తనకెవరూ లేరనిచెప్పి వెళ్ళిపోయారుట! కుంటివారైనంత మాత్రాన గుండెల్లో ప్రేమ ఏమవుతుంది? ఆయన చాలా తెలివితక్కువగా ఆలోచించారన్నయ్యా! అమ్మా, నాన్నగారు నా బాధని అర్థం చేసుకోలేదు! సమయానికి నువ్వు కెనడా నుండి వచ్చావు. నన్నర్థం చేసుకుని — నాతో దేశం తిరుగుతున్నావు!"

క్షణం ఆగి అంది —

"అన్నయ్యా! ఆయన ఎప్పటికైనా కన్పిస్తారు! నాకా నమ్మకం వుంది!"

వెన్నెల్లో ఆమె చెంపలమీద కన్నీళ్ళు ముత్యాల్లా మెరుస్తున్నాయి

"ఏమోనమ్మా! నీ సమస్యకి కాలమే పరిష్కరించాలి!" అన్నాడతను, కూర్చున్న చోటినుండి లేస్తూ!

మాధవి కూడా బాబునెత్తుకుని లేచింది.

ఇద్దరూ ఇంటిదారి పట్టారు...

సీరియల్

జీవిత వనంలో కొత్తగాలి

కుందుర్తి ఇందిరాదేవి

24

(గత సంచిక తరువాయి)

శ్రావణ మాసం వచ్చింది. కిరణ్ నాకు ఉత్తరాలు వ్రాస్తూనే ఉన్నాడు. బొంబాయిలో ఉద్యోగం దొరకటం చాలా కష్టం సంధ్యా అని వ్రాశాడు. నా నవనాడులూ క్రుంగిపోయాయి. నా జీవితంలో హఠాత్తుగా శిశిరం ప్రవేశించినట్టుగా, నా కలలు, ఆశలు నేలరాలిపోతున్నాయి.

ఒకరోజు కిరణ్ దగ్గరనుండి ఘాటుగా లెటర్ వచ్చింది. నేను కిరణ్ లెటర్స్ చదివి ప్రక్కన పడేస్తున్నాను. సమాధానం ఏం రాయాలో ఎలా వ్రాయాలో తోచక నేను జవాబు వ్రాయటంలేదు. ఈ ఘాటయిన లెటర్ చదివాను. అందులో నేను మరీ మొద్దుమ్మాయి నయిపోతున్నానని, ఉత్తరాలు వ్రాయటంలేదని నిష్ఠూరం వేస్తూ చివరగా ఇలా వ్రాశాడు – నా సంధ్యా! శ్రావణ మాసంలో నా వివాహం చేయాలని అమ్మ శతవిధాలా ప్రయత్నించింది. అమ్మ ఆరోగ్యంకూడా బాగాలేదు. సుగుణ భర్త డాక్టర్. వైద్యం పేరుతో ఎన్నాళ్ళు కూతురి ఇంట ఉండాలిరా అని అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. సంధ్య మనం వివాహం చేసుకోవాలి. నువ్వెందుకు ఇలా మౌనంగా ఉండిపోయావో నాకు అర్థం కావటం లేదు అంటూ వ్రాశాడు.

నా కళ్ళల్లో నీళ్ళు ముత్యాల్లా జారినాయి. 'నా కిరణ్' అంటూ నా మనసు ఆక్రోశిస్తోంది. ఒకరోజు నేను బస్‌స్టాప్‌లో నిలబడ్డాను. సన్నగా జల్లు పడుతోంది. అటూ, ఇటూ దిమ్మగా చూస్తున్న నా కళ్ళు పత్తికాయల్లా అయినాయి. దూరంగా శశి నడుస్తూ వస్తోంది. అలవాటుగా నడిచి వస్తున్న దాన్ని చూసి నా గుండెలు పిండినట్టయింది. చేతిలో బాగ్‌తో, హైహీల్స్‌తో టిప్‌టాప్‌గా తిరిగే శశి, మామూలు వెలిసిపోయిన చీరతో, మెళ్ళో పసుపుతాడుతో ఎంతో దూరంనుంచి నడిచి వస్తున్నట్టుగా, కాళ్ళు ఈడుస్తూ వస్తోంది.

హఠాత్తుగా జల్లు పెద్దదవటంతో శశి చప్పున షెల్టర్‌లోకి వచ్చింది. 'అబ్బా' అంటూ మొహంమీద వానచినుకుల్ని తుడుచుకోబోయి నన్ను చూసి చప్పున ఆగిపోయింది. ఆ కళ్ళు వెలవెల బోయినాయి. నేను దాన్ని పరిశీలనగా చూస్తుండిపోయాను. శశి ఎంత చిక్కిపోయింది. మెళ్ళో పసుపుతాడు తప్పించి ఎలాంటి ఆభరణాలు లేవు. వర్షం తగ్గింది. శశి బాగా అలిసిపోయింది. రొప్పుతోంది సన్నగా. నాముందు ఎంత నిబ్బరంగా నిలబడాలని ప్రయత్నించినా దానికి సాధ్యం కాలేనట్టుగా క్రింద కూలబడింది. నేను రిక్షా పిలిచాను. ఇద్దరం రిక్షాలో ఇంటికి వచ్చాము. శశిని చూసి అమ్మ నిర్ఘాంతపోయింది. నేను బట్టలు మార్చుకుని వంటగదిలోకి రాబోతూ ఆగిపోయాను.

"ఎలా ఇచ్చాదు!" అమ్మ ఏడుస్తోంది.

"అమ్మా. నీకు దణ్ణం పెడతాను అక్కని ఒప్పించమ్మా" శశి ఏడుస్తోంది.

"శశి!"

"కట్నాలు, కానుకలు లేవు. కనీసం శ్రావణ మాసంలో తీసుకెళ్ళి నోములు పట్టించద్దా అని మా అత్తగారు తిడుతోందమ్మా."

నేను వెనక్కి వచ్చేశాను. కిరణ్‌ని నేను పెళ్ళి చేసుకోవాలని ఎన్ని కలలు కన్నానో చెప్పలేను. నేను ఏ ఒడ్డు చేరతానో ఇంకా తేలటంలేదు. నా చిన్నారి చెల్లెలు... పాతేపోయింది. అప్పుచేసి అయినా శశిని తీసుకువస్తే అమ్మ సంతోషిస్తుంది. అత్తగారి తిట్లు తప్పుతాయి. నేను ఒక నిశ్చయానికి వచ్చి లేచి వెళ్ళాను.

"అమ్మా! శ్రావణమాసం కదా. శశిచేత నోములు పట్టించద్దా" అన్నాను. అమ్మ నిర్ఘాంత పోయినదానిలా కూర్చుంది. శశి కలా నిజమా అన్నట్టు చూసింది. అమ్మ నాటి విషయాలు మాట్లాడుతోంది.

ప్రమీల నన్ను తిడుతూ వ్రాసింది –'సంధ్యా! నువ్వు నిజంగా కిరణ్ అన్నయ్యని ప్రేమించే ఉంటే వెంటనే ముహూర్తం పెట్టించి నాకు శుభలేఖ పంపు' అని వ్రాసింది. నేను ద్రిమ్మరపోయాను. కిరణ్ నుండి మళ్ళీ లెటర్ వచ్చింది. మామూలు క్షేమ సమాచారాలు, నేను ఉత్తరాలు వ్రాయనందుకు కోపం వెలిబుచ్చుతూ, చివరగా ఇలా వ్రాశాడు –

నా సంధ్యా! నువ్వు ఉద్యోగం వదులుకో. మనం పెళ్ళి చేసుకుని అమ్మని తెచ్చుకుందాం. నువ్వు నా మాటమీద నమ్మకముంచు. నా జీతంలో మీ అమ్మావాళ్ళకి డబ్బు పంపుదాం. ఎంత చిన్న ఉద్యోగమైన ఏదో ఒకటి ఇక్కడ వెతుక్కోవచ్చు. అమ్మకి గుండెనొప్పి వచ్చింది సంధ్యా! కొడుకుగ నా బాధ్యత ఇప్పటికైనా నిర్వర్తించకపోతే నేను మనిషి క్రింద లెక్కలోకి రానేమో సంధ్యా! నా నమ్మకం నువ్వు వమ్ముచెయ్యవని గాఢంగానమ్ముతూ –నీ కిరణ్.

నిముషం ఘడామడా తిట్టింది. పెళ్ళికి ఒప్పుకోమని వేధించింది. నేను బెల్లంకొట్టిన రాయిలా ఉండిపోయాను. అమ్మ ఆ రోజు నల్లులముందు తాగాలని చేసిన ప్రయత్నాన్ని నేను ఏ ఒక్కక్షణం కూడా మర్చిపోలేదు. అమ్మ ఆ విధంగా చేసి ఉండకపోతే అమ్మని ఎదిరించి అయినా లేకపోతే చెప్పా పెట్టకుండా ఏ రిజిస్ట్రేషనులోనో గుట్టుచప్పుడుకాకుండా పెళ్ళి చేసుకుని అమ్మ కాళ్ళకి దణ్ణం పెట్టేదాన్ని.

సాయంత్రం ఇంట్లో పేరంటం ఉంది. శశి కొత్తచీర కట్టుకోడానికి నా పెట్టె అంతా వెతికి కిరణ్ నా పుట్టినరోజుకి కొన్న చీర తీసుకుంది. నేను ఒక్కంగితో ఆ చీర లాగేసుకుని –

"సారీ శశీ! ఈ చీర తప్ప నీ ఇష్టం వచ్చింది ఏదైనా కట్టుకో" అవేశాను నిర్మొహమాటంగా.

"పోనీలే ఏదో ముచ్చటపడింది" అంది అమ్మ.

శశి ముఖం గంటుపెట్టుకుని "ఆ చీర నాకికి ఏ అప్పుడో పుట్టినరోజు కానుగ్గా ఇచ్చాడల్లే ఉంది" అంది.

నేను ఛురుమన్నట్టు చూసి "ఆ అప్పుడెవరో మీకూ తెలుసుగా. అతను నా కాబోయే మొగుడేలే" అన్నాను.

శశి ఇంకో చీర తీసుకుని వెళ్ళిపోయింది. అమ్మ కాఫీ తెచ్చింది. నేను ఉత్తరం తీసి ఇచ్చాను. అమ్మ ఉత్తరం చూసి అవతల పెట్టెయ్యబోయింది. నేను చప్పున ఆపేసి "ప్లీజ్ చదువమ్మా" అన్నాను.

అమ్మ సాంతం చదివింది. కప్పు తీసుకుని వెళ్ళిపోబోయింది. నేను ఆశాభంగం చెందిన దానిలా "నీ అభిప్రాయం ఏమిటమ్మా" అన్నాను.

అమ్మ వెనక్కి తిరిగి "అది అసంభవం

జరిగిన కథ - 12: కుటుంబ భారం తనపై వేసి తండ్రి కన్నుమూయగా, సంధ్య ఓ చిన్న ఉద్యోగం చేస్తూ తల్లితో పాటుగా తమ్ముణ్ణి, ముగ్గురు చెల్లెళ్ళను పోషిస్తూ వాళ్ళకి చదువు సంధ్యలు చెప్పిస్తుంటుంది. ప్రమీల అన్న కిరణ్‌తో సంధ్య స్నేహం చిగుళ్ళు తొడుగుతుంది. శశి చదువు పూర్తయి ఉద్యోగంలో చేరగానే ఆమెకు ఆ ఇంటి బాధ్యత అప్పగించి సంధ్యా, కిరణ్‌లు పెళ్ళి చేసుకొని తామూ సహాయపడాలని నిశ్చయించుకొంటారు. ఉద్యోగంలో చేరి ఆ ఇంటికి ఆధారం అవుతుందనుకొన్న శశి, ప్రకాష్‌ని పెళ్ళి చేసుకొని వెళ్ళిపోవడంతో, దిక్కుతోచని పక్షిలా విలవిలలాడిపోతుంది సంధ్య. శశికి ఉద్యోగం వస్తే, తన అత్తగారికి ఇష్టం లేకపోవడంతో చేయనని ఖచ్చితంగా చెప్పేసి వెళ్ళిపోతుంది. కిరణ్‌కి బొంబాయి ట్రాన్స్‌ఫర్ అవడంతో మరీ కృంగిపోతుంది సంధ్య. సంధ్యా కిరణ్‌లు పెళ్ళి చేసుకోవడం ఇరు కుటుంబాలకూ ఇష్టంలేదు.

సంధ్యా'' అని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది. నేను విభ్రాంతురాలిలా ఉండిపోయాను.

బయట పేరంటాళ్ళు వచ్చినట్టు గుర్తుగా సందడిగా ఉంది. నేను మంచంమీదనుండి లేవలేదు. మీనా వచ్చింది వాడిపోయిన ముఖంతో. నా పక్కనే కూర్చుని "అక్కా! నువ్వుకూడా నోము పట్టలేదెందుకు'' అంది.

"నాకా అర్హత లేదు.''

"నీకన్నా శశక్క చిన్నదిగా. నీకు పెళ్ళి కాకుండా చిన్నక్క పెళ్ళి చేసుకోడం తప్పు కదక్కా'' అంది.

"మీనా'' నేను చప్పున మీనాని దగ్గరికి లాక్కున్నాను. చప్పున నీళ్ళు చిప్పిల్లాయి. ఈ ఇంట్లో నా మనసు తెలిసిన ఏకైక ప్రాణి ఈ మీనా అనిపించింది ఆ క్షణంలో. బయట పేరంటాళ్ళు మొదలెట్టారు —

"సంధ్య కాకుండా, చిన్నపిల్లకి పెళ్ళి చేశారేమిటి సీతమ్మగారూ'' అంటూ. అమ్మ తడబడుతూ ఏదో అంటోంది. శశి అక్షింతలు తెచ్చి నా చేతిలో పెట్టింది ఆశీర్వదించు అంటూ.

నేను కాళ్ళు లాగేసుకుని "నేను కన్నెపిల్లను శశీ. నా ఆశీర్వచనం ఎందుకు?'' అనేశాను. శశి ముఖం మాడ్చుకుని వెళ్ళిపోయింది.

రోజులు భారంగా గడుస్తున్నాయి. కిరణ్ మళ్ళీ అదే లెటర్ వ్రాశాడు, తన జీతంలో మీ అమ్మావాళ్ళకి కొంత ఇద్దాం అంటూ. నేను నవ్వుకున్నాను. కిరణ్‌కి వచ్చే జీతంలో నాలుగు వందల రూపాయలు అమ్మకి పంపితే, అతను దర్జాగా ఎలా బ్రతుకుతాడు. అతను ఒక ఆఫీసర్. ఆ హోదాలో అతను బ్రతకాలి. తల్లికి మందూ మాకులు, సంసారం ఎలా గడుస్తుంది? నా కుటుంబం కోసం అతన్ని బాధపెట్టటం ఏం న్యాయం? అతను వ్రాసే లెటర్స్ అన్నీ భద్రంగా ఒక పెట్టెలో పెట్టాను. కానీ ఏ ఒక్కదానికీ జవాబు వ్రాయలేదు.

ఒకసారి కిరణ్ ట్రంక్‌కాల్ చేశాడు —"అమ్మకి సీరియస్‌గా ఉందని టెలిగ్రామ్ వచ్చింది సంధ్యా'' అన్నాడు.

నేను మాట్లాడలేదు. "నేను వెంటనే బయలుదేరి మద్రాస్ వెడుతున్నాను. పెళ్ళికి ఒప్పుకున్నట్టేనా'' అన్నాడు.

"కిరణ్'' నేను వణికిపోతూ పిలిచాను.

"సంధ్యా! నువ్వు ఇంకేం మాట్లాడకు. ఊ అను'' అన్నాడు ఆదుర్దాగా. నేను సమాధానం చెప్పలేకపోయాను. మెల్లిగా ఫోన్ పెట్టేశాను. నా సమాధానం ఏమిటో ఈపాటికి అతనికి అర్థమై ఉంటుంది. నా గుండెల్లో భగభగ మంటలు లేస్తున్నాయి. నిద్రలో నడుస్తున్నదానిలా వచ్చి కూర్చున్నాను. విమల తిట్టింది.

"సంధ్యారాణిగారు అదేమిటి మీరింత పిరికితనంగా ఆలోచిస్తారు'' అని హనుమంతరావు మందలించాడు. నేను ఎవరికీ సమాధానం చెప్పలేదు. నాలో రేగే ఈ అలజడి ఎవ్వరికీ అర్థం కానిది.

ప్రమీల దగ్గర్నుంచి ఆటంబాంబులాంటి ఉత్తరం వచ్చింది. "సంధ్యా నువ్వు మనిషివే అయితే వెంటనే ఈ పెళ్ళికి ఒప్పుకో'' అని వ్రాసింది. నేను మనిషిని కాను. అందుకే నిర్లిప్తంగా ఉండిపోయాను.


25

రెండు నెలలు గడిచాయి. కిరణ్ నాకు ఈమధ్యలో ఉత్తరాలు వ్రాస్తూనే ఉన్నాడు. నేను మౌనంగా వాటిని చదివి పక్కన పెట్టేస్తున్నాను.

ఒకరోజు —

నేను ఆఫీసులో బిజీగా పనిచేసుకుంటుంటే పోస్ట్‌మేన్ లెటర్ ఇచ్చాడు. నేను చేస్తున్న పని అక్కడే వదిలి వెళ్ళి తీసుకుని చూశాను. నాకు సుపరిచితమైన ఆ దస్తూరిని చూడగానే నా మనసులో ఏ మూలో దాగి ఉన్న ప్రేమానురాగాలు వరదలై ముంచెత్తినాయి. టేబుల్ కానుకునే గబగబా లెటర్ చించాను. ఆ లెటర్ చదువుతూనే నా కళ్ళు బైర్లుకమ్మినాయి. చప్పున విమల పట్టుకుంది. నేను ఎలాగో గొంతు పెగుల్చుకుని "మంచినీళ్ళు ఇవ్వు'' అన్నాను.

విమల నీళ్ళిచ్చింది. నేను ఆ ఉత్తరం బ్యాగ్‌లో పెట్టి టేబుల్‌మీద తలవాల్చుకుని రెండు చేతుల్లో ముఖం దాచుకున్నాను. "మైగాడ్! నా కిరణ్ నా కిరణ్! వాట్ ఎ హెల్'' అని గొణుక్కోసాగాను.



పది నిమిషాలకు మెల్లిగా లేచి "విమలా నన్ను ఇంటికి తీసుకెళ్ళగలవా" అని దీనంగా అడిగాను.

విమల ఆశ్చర్యంగా చూసి "సంధ్యా!" అంది.

"ప్లీజ్ విమలా! ఇప్పుడు దయచేసి నన్నేం అడక్కు. నేను ఇంటికి చేరగలనో లేదో. కాస్త తోడురా" అన్నాను.

విమల ఏమనుకుందో ఏమో! "సరే పద" అంది. ఇద్దరం ఆటోలో ఇంటికి బయలుదేరాము. విమల ఉత్తరం చదివి "సంధ్యా! నువ్వు పట్టుకుని పాకులాడే ఈ చెల్లెళ్ళు, తమ్ముళ్ళూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయేవారే! చివరికి నీకు రోగం వచ్చి దిక్కులేకుండా పడుకుంటే గుక్కెడు నీళ్ళుకూడా నీ గొంతులో పోయరు. త్యాగం ఉండాలి నిజమే. కానీ నిన్ను నీవు ఒక్క క్షణం ఆలోచించుకోడం చాలా అవసరం సంధ్యా! అతను ఎంత నిజాయితీగా నెల నెలా డబ్బు మీ అమ్మకి తన సంపాదనలో ఇవ్వటానికూడా ఇన్ని ఉత్తరాలు వ్రాశాడు. అంటే నీకు అతనిమీద నమ్మకంలేదా" అంది కోపంగా.

నేను దుఃఖాన్ని ఆపుకోడనికి విశ్వప్రయత్నం చేస్తున్నాను. కానీ నేనేం చేయగలను. ఇంటికి వచ్చిన మమ్మల్ని చూసి అమ్మ ఆశ్చర్యపోయింది. విమల కాఫీ తాగి వెళ్ళిపోయింది. నేను నా గదిలోకి వచ్చేసి తలుపులు మూసేశాను. తలుపుకి తల ఆనించి అలాగే ఉండిపోయాను. నా మనసులో పెనుతుఫానులు వీస్తున్నాయి. కళ్ళల్లో నీళ్ళు జారాయి. ఎదురుగా 'జీవితవనం' నన్ను పరిహసిస్తున్నట్టుగా ఠీవిగా నిలబడి నవ్వుతోంది. అతని మాటలు, అతని కలలు నా చెవుల్లో హోరున సముద్ర ఘోషలా వినబడుతోంది.

వణుకుతున్న చేతులతో మళ్ళీ లెటర్ తీశాను. అందులో ఇలా ఉంది —

నా సంధ్యా!

నువ్వు ఎందుకింత నిర్లిప్తంగా ఉండిపోయావో నాకు అర్థం కావటంలేదు. నా గుండెల్లో పన్నీరు చిలికిన నువ్వు ఇంత నిరాశ నింపుతావనుకోలేదు. నా సంధ్యా! నువ్వు ఏ సమాధానం చెప్పకుండా ఫోన్ పెట్టేసి నన్ను ఏడిపిస్తున్నావు కదూ. ఇందుకేనా సంధ్యా, నువ్వు నా జీవితంలో ప్రవేశించావు.

జీవితవనంలో కొత్త గాలి

సంధ్యా! నిన్ను దూరం చేసుకుని నేను ఆనందంగా ఉండగలననే నువ్వు అనుకుంటున్నావా? పోనీ ఒక్కసారి నీకు నువ్వు ఆత్మవిమర్శ చేసుకో. నువ్వు మాత్రం బ్రతగ్గలవా?

నా సంధ్యా! నువ్వు నీ కుటుంబం కోసం కొవ్వొత్తిలా కరిగిపోడానికే నిశ్చయించుకున్నావా? వద్దు సంధ్యా! వద్దు. నవు ఏ షరతులు పెట్టినా అన్నిటికీ సిద్ధమే సంధ్యా. ఒక్క రెండు, మూడు సంవత్సరాలు కళ్ళు మూసుకుంటే మనం హాయిగా బ్రతకవచ్చు సంధ్యా. కావాలంటే మనం చిన్న ఇంట్లోనే సర్దుకుందాం. అమ్మని నేను ఒప్పించుకుంటాను. కనీ నా సంధ్యా! నిన్ను ఒదులుకుని మరో రకంగా బ్రతికే శక్తి లేదు నాకు.

నువ్వు పెళ్ళికి ఊ అను సంధ్యా! అమ్మకి గుండెనొప్పి వచ్చింది. ఇక్కడే సుగుణావాళ్ళ ఇంటికి రెండిళ్ళవతల వారి అమ్మాయిని అమ్మ బలవంతం మీద చూశాను. నా సంధ్యా! కాదంటే అమ్మ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఎలాగైనా నాకు పెళ్ళి చేయాలని ఇంట్లో అందరూ కంకణం కట్టుకున్నారు మా బావగారు కేకలేశారు కూడా. "ఇద్దరు కొడుకులుండీ కూతురింట్లో ఏ తల్లి మాత్రం ఎంతకాలం ఉంటుంది కిరణ్" అంటూ. అంతేకాదు కొడుకులు తల్లిని నెట్టేస్తే అల్లుడి పంచన చేరిందని ఎవడో ఒక గాడిద కూశాడు!

నా సంధ్యా! చూశావా ఈ లోకం తీరుతెన్నులు ఎలా ఉన్నాయో. ఇన్నిరోజులుగా నువ్వు నిర్లిప్తంగా, కళ్ళనీళ్ళు పెట్టుకుని చూస్తుంటే సహించాను. ఇక నా వల్లకాదు. నా జీవితం ఏ మలుపు తిప్పుతావో నువ్వే నిర్ణయించు. ఒక్క పదిరోజులు గడువు ఇస్తున్నాను. మా వాళ్ళంతా నాకు ఇచ్చిన గడువు ఖచ్చితంగా పదిరోజులే. నువ్వు నోటితో తెలియ చేయలేని నీ నిర్ణయాన్ని నాకు లెటర్ ద్వారా తెలియ పరుచు. ఒక్క పదిరోజులే గడువు. నువ్వు లెటర్ వ్రాయకపోతే నువ్వు ఈ పెళ్ళికి ఇష్టపడటం లేదన్నమాటే.


నా సంధ్యా! నీకు జీవితంలో ఎన్నో ఆశలు కల్పించాను. నా కళ్ళకి నువ్వు అందమైన కలలని ప్రసాదించావు. వాటిని నిజం చేసుకోవద్దా సంధ్యా! నా ఈ నమ్మకాన్ని వమ్ముచేయద్దు సంధ్యా. నేనెప్పటికీ నీ వాడిననే నమ్మకంతోటే, ఇలా వ్రాస్తున్నాను. మన జీవితవనంలో మనం చిలకాగోరింకల్లా బ్రతకాలని చెప్పేనుగా సంధ్యా. నీ నిర్ణయం కోసం అనుక్షణం ఎదురుచూసే -- నీ కిరణ్.


ఆ ఉత్తరం నేను కొన్ని వందలసార్లు, వేలసార్లు చదువుకున్నాను. చదివినకొద్దీ పిచ్చెక్కినట్టుగా ఉంటోంది. కిరణ్ దూరమైపోతాడేమో అనే బాధ. ఈ కుటుంబాన్నంతా నా నెత్తిమీద పడేసి వెళ్ళిపోయిన నాన్నగారిమీద, నా రాత ఇలా వ్రాసిన విధాతమీద ఆగ్రహం పెరుగుతోంది. అమ్మ భోజనానికి రమ్మని ఎన్నిసార్లు తలుపు తట్టినా నేను తియ్యలేదు. ఉష, మీనా, ఫల్గుణ తలుపులు బాది విసిగి వెళ్ళిపోయారు. అలా తలుపు బాదుతుంటే అమాంతం లేచివెళ్ళి వాళ్ళ బుర్రలు పగలగొట్టాలని, వాళ్ళ పీకలు నొక్కి పారేయాలన్నంత కసి పెరుగుతోంది.


కానీ నేను పడుకున్న చోటునుంచి ఒక్క అంగుళం కూడా కదలలేకపోయాను. కారణం నా పిరికితనం! కొంతమంది తమకు కావాలసిన దానికోసం బహిరంగంగా పోట్లాడి అయినా, యుద్ధం చేసి అయినాసరే గెలుచుకుంటారు. కానీ నాలాటి పిరికివారు నోరు తెరిచి ఎవరిని ఏమీ అనలేరు. మనసులోనే అందరినీ తిట్టుకుంటూ. మనసులో అంతర్యుద్ధం చేయటం తప్పించి ఇంకేమీ చేయలేరు.


రాత్రి బాగా పొద్దుపోయింది. నేను నిశ్చేష్టురాలిలా అలాగే కూర్చున్నాను. అతను నేసి నాకు బహుమతిగా ఇచ్చిన ఆ జీవితవనంలోకి నాకు ప్రవేశం దొరకటంలేదన్నట్టు, నా అసమర్థతని ఎత్తిచూపుతున్నట్టుగా ఉంది. నేను హఠాత్తుగా దిండులో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవ సాగాను. అమ్మ గాభరాగా పిలిచినా నేను పలకలేదు. తెల్లవార్లూ ఏడుస్తూండిపోయాను.

మర్నాడు నాకు బాగా జ్వరం రావటంతో ఆఫీసుకి వెళ్ళలేదు. ఫల్గుణ టెంపరేచర్ చూసి టాబ్లెట్స్ తెప్పించివేశాడు. నేను టాబ్లెట్స్ వేసుకోను అని హఠం చేయలేదు. జీవితంలో నేను అనుభవిస్తున్న ఈ చేదుకన్నా ఆ టాబ్లెట్ల చేదు









ఏమంత పెద్దది కాదు అనిపించింది. అంతులేని నా మానసిక వ్యధ – నన్ను త్వరగా ఆ జ్వరం నుంచి కోలుకోనివ్వలేదు.

* * *

పది రోజులు గడిచాయి. నేను అప్పటికీ ఆశ చంపుకోలేక అమ్మకి కిరణ్ వ్రాసిన లెటర్ ఇచ్చాను. అమ్మ చదివి కళ్ళు తుడుచుకుని వెళ్ళిపోయింది. నేను నీరసంగా నవ్వుకున్నాను. కిరణ్ నాకు ఇచ్చిన గడువు అయిపోయింది. ఇక నేను కిరణ్ ఇవ్వబోయే తీర్పు కోసం ఎదురుచూస్తున్నాను.

పైకి నిర్లిప్తంగా ఉన్నా ప్రతి రాత్రీ నిద్ర లేకుండా శూన్యంలోకి చూస్తూ, మధ్య మధ్య వెక్కి వెక్కి ఏడుస్తుండటంతో జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్ళీ తిరగబెట్టింది. మళ్ళీ సెలవు పెట్టాను. అప్పటికి కిరణ్ నాకు లెటర్ వ్రాసి ఇరవై రోజులు అయింది.

ఒకరోజు శశి, ప్రకాష్ వచ్చారు. శశి ఆనందంగా "అమ్మా" అని అరుస్తూ వచ్చింది. వస్తూనే అమ్మా "ప్రకాష్‌కి ఉద్యోగం వచ్చింది" అని అరిచింది. అమ్మ ముఖం మతాబాలా వెలిగి పోవటంతో లేచి వెళ్ళిపోయింది. నేను మౌనంగా పడుకున్నాను. ప్రకాష్, శశీ ఇద్దరూ వచ్చి "విజయవాడలో ఉద్యోగం వచ్చింది" అని చెప్పారు. నేను నిర్లిప్తంగా విని ఊరుకున్నాను.

బయట వాళ్ళేదో మాట్లాడుకుంటున్నారు. నాకు సరిగ్గా వినపడటంలేదు. వాళ్ళు వెళ్ళిపోయిం తర్వాత అమ్మ వెలిగిపోతున్న ముఖంతో నా దగ్గరికి వచ్చింది.

"మన శశి అదృష్టవంతురాలె సంధ్యా. అల్లుడికి ఉద్యోగం వచ్చింది. ప్రకాష్ ఎంత బుద్ధిమంతుడనుకున్నావు. అత్తగారూ! నా సంపాదనలో కొంత మీకు పంపుతాను. సంధ్యకి కూడా పెళ్ళి చేయండి అని చెప్పాడు" అంది ఆనందంగా.

నేను చివ్వునలేచి కూర్చుంటూ "అమ్మా" అన్నాను ఆశ్చర్యంగా. అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ "నీ మనసు ఇప్పటికే బాధ పెట్టానే

జీవితవనంలో కొత్తగాలి

సంధ్యా! ఏంచెయ్యమంటావు చెప్పు. పరిస్థితులు అలా వచ్చాయి. పెళ్ళికి ఒప్పుకున్నట్టు వెంటనే ఆ అబ్బాయికి ఉత్తరం వ్రాయి" అంది. అమ్మ మాటలు పూర్తికానేలేదు. నాకు అంత హుషారు ఎక్కడనుంచి వచ్చిందో, ఎప్పుడు లేచానో మంచంమీద నుండి "థ్యాంక్యూ! థ్యాంక్యూ! అమ్మా" అంటూ అమ్మని పట్టుకుని ఇల్లంతా గిరగిరా తిప్పాను ఆనందంగా.

ఇల్లంతా నవ్వులతో మారుమోగిపోయింది.

ఆ రాత్రి కూర్చుని కిరణ్‌కి లెటర్ వ్రాశాను.

"నా కిరణ్ :

ఇంత ఆలస్యం చేసినందుకు నన్ను క్షమించు. నేను నీ మాట ఎప్పుడైనా కాదన్నానా కిరణ్. నీ ఇష్టం, ఎప్పుడు పెళ్ళి అంటే నేను అప్పుడు రెడీ. నీకేనా బాధ! నేను మాత్రం బ్రతగ్గలనా నిన్ను విడిచి. ప్రకాష్‌కి ఉద్యోగం వచ్చింది. ఇదంతా శశిది కాదు. నా అదృష్టం. ఏమిటి నవ్వుతున్నావా? నీకోసం ఏం చెయ్యమన్నా నేను సిద్ధమే. నువ్వు తోడుంటే చెట్టుక్రింద కాపురం అన్నా నేను జంకను తెలుసా! మరి నువ్వు నాకెన్నో ఆశలు పెట్టావు. అవన్నీ నిజం చెయ్యకపోతే నేమూరుకోను. నువ్వు నాకోసం సృష్టించిన ఆ జీవితవనంలో ఇంత కాలం ఒంటరిగా విహరించాను. మరి ఇప్పుడు నువ్వు తోడున్నావుగా. నువ్వు అందులో ఏ ఒక్క కలా నిజం చెయ్యకపోతే నేమూరుకోను తెలుసా?

వెంటనే ఈ శుభవార్త మీ... కాదు కాదు... మా అత్తగారి చెవిన వేయి, ఏమిటి అర్థమైందా సార్! మన పెళ్ళి ఎప్పుడు, ఏమిటి విశేషాలు మాట్లాడటానికి నువ్వే స్వయంగా బయలుదేరి రాకూడదూ. లేకపోతే ఉత్తరం వ్రాయి. ఇంకే అమ్మాయినైనా పెళ్ళిచూపులు అంటూ చూశావా జాగ్రత్త మరి. వెంటనే నీ నిర్ణయం తెలియజేయి. టాటా! ఛీరియో!

ఎప్పటికీ,
నీ
సంధ్య."

మనసు సంతోషంతో ఉరకలు వేస్తుండటంతో నాకు ఆ రాత్రి కంటిమీదికి కునుకు రాలేదు మర్నాడు స్వయంగా నా చేత్తో నేనే ఆ లెటర్ కిరణ్ చెల్లెలింటి అడ్రెస్‌కి పోస్ట్ చేశాను. కిరణ్ అక్కడే ఉంటానని మెడ్రాస్ అడ్రెస్ ఇచ్చాడు. ఆ రెండు రోజులు నేను తియ్యని కలలుకంటూ, కూనిరాగాలుతీస్తూ హాయిగా గడిపాను. నాకు జ్వరం తాలుకు నీరసం కూడా ఉందనిపించలేదు.

సోమవారం :

నేను హుషారుగా ఆఫీసుకి వెళ్ళాను.

"ఏమిటి విశేషం ?" అంది విమల వింతగా చూస్తూ.

"అమ్మగారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు పెళ్ళికి" నవ్వుతూ అన్నాను.

"కంగ్రాట్యులేషన్స్" అంది నా చెయ్యి ఊపేస్తూ.

మధ్యాహ్నం నేను కిరణ్‌కి ట్రంక్‌కాల్ చేద్దామని నిశ్చయించుకుని లేచాను. అప్పుడే పోస్ట్‌మేన్ వస్తున్నాడు. ప్యూన్ ఒక కవరు తెచ్చి నా చేతికిచ్చాడు. నేను అనుమానంగా చూశాను. అది శుభలేఖలాగుంది. కవరుపై నాకెంతో సుపరిచితమైన దస్తూరిని చూసి, నా ఒంట్లో ఒణుకులాంటిది ప్రారంభమైంది. మనసు ఎందుకో కీడును శంకిస్తోంది. చప్పున శుభలేఖ లాగాను. మెల్లిగా తెరిచి చూశాను.

అంతే! నా కళ్ళముందు మెరుపులు మెరిశాయి. నా కళ్ళు నన్ను మోసం చేస్తున్నాయేమో అనిపించింది. అందులో చి॥ కాంతికిరణ్‌కి, చి॥ సౌ॥ కమలదేవికి...... అప్పటికే నా శరీరం నా వశం తప్పుతోంది. కళ్ళముందు చీకటివలయాలు వలయాలుగా వస్తోంది. స్పృహతప్పి పడిపోతున్న నాకు "సంధ్యా" అని గాభరాగా పిలుస్తున్న విమల కంఠం, ఆ వెంటనే ఎవరో పట్టుకున్నట్టు లీలగా గుర్తుంది. ఆపైన నాకేమైందో నాకే తెలీదు.

క్రొత్త ప్రెస్టీజ్




100% భద్రత

గేస్కెట్ రిలీజ్ సిస్టమ్ కలిగిన క్రొత్త ప్రెస్టీజ్ అత్యంత భద్రమైన ప్రెషర్ కుక్కర్

ఆహార పదార్థములచే వెయిట్ వాల్వ్ మూయబడినచో ప్రెషర్ కుక్కర్‌లో హెచ్చు ఒత్తిడి కలుగును మామూలు కుక్కర్లలో అలాంటప్పుడు ప్రేలిపోకుండా నివారించగల శక్తి ఒకేఒక సేఫ్టీ ప్లగ్ మీద మాత్రమే అధారపడియుండును. కానీ అ సేఫ్టీ ప్లగ్ నకిలీదైతే-అప్పుడేమౌతుంది? సేఫ్టీ ప్లగ్ నకిలీదో, అసలైనదో మీరు గుర్తించలేరు. అందువలనే ప్రెస్టీజ్ వారు పూర్తి భద్రత కలిగిన ప్రెషర్ కుక్కర్‌ను రూపొందించినారు. సేఫ్టీ ప్లగ్ నకిలీదైనాకూడా ఫరవాలేదు.


క్రొత్త ప్రెస్టీజ్ పూర్తి భద్రత కొరకు రూపొందించ బడింది.

వంటగదిలో ప్రమాదాల నివారణకు సేఫ్టీ ప్లగ్ పై మాత్రమే అధారపడవలసిన అవసరములేని ఏకైక ప్రెషర్ కుక్కర్ "క్రొత్త ప్రెస్టీజ్". అందువలన నకిలీ విడిభాగాల విషయమై మీరు చింతించాల్సిన అవసరమేలేదు. మౌలికంగానే "కొత్త ప్రెస్టీజ్" పూర్తి భద్రతతో తయారుచేయబడినది. ఎలాంటి పరిస్థితిలోనైనా అత్యంత భద్రత కలిగిన దానిగా అద్వితీయమైన గేస్కెట్ రిలీజ్ సిస్టమ్ దానిని తీర్చి దిద్దుతుంది.



అద్వితీయమైన గేస్కెట్ రిలీజ్ సిస్టమ్ ఎలా పనిచేస్తుంది.

ఏ హెచ్చు ఒత్తిడి మిగతా కుక్కర్లను ప్రమాదకరమైనవిగా మారుస్తుందో, అదే ఒత్తిడి క్రొత్త ప్రెస్టీజ్‌లో రూపొందించబడిన సేఫ్టీ సాధనాన్ని పనిచేయిస్తుంది. ప్రెషర్ కుక్కర్ మూతలో అమర్చబడిన 'గేస్కెట్ రిలీజ్ సిస్టమ్' రబ్బర్ గేస్కెట్‌ను సాగేలాచేసి, అధికమైన ఒత్తిడిని వదిలివేస్తుంది. కుక్కర్ బ్రద్దలవడం చిందర వందర కావడం ఏమీ ఉండదు.



క్రొత్త ప్రెస్టీజ్ మీకు ఎక్కువ సౌకర్యము నిచ్చును

గేస్కెట్ ఆవిరిని వదిలి పెట్టగానే మీరు చేయవలసింది దాని స్థానములోనికి దానిని తోయడము మాత్రమే. అప్పుడు మీ కుక్కర్ తిరిగి, వాడకానికి కొన్ని క్షణములలో సిద్ధము.



క్రొత్త ప్రెస్టీజ్ ఎంతో మన్నిక కలది

ఆవిరి ఒత్తిడి సమయమునైనను అపాయకరమైన స్థితికి చేరదు కనుక, కుక్కర్‌కు అరుగుదల చాల తక్కువ అందుచేతనే మిగతా మామూలు కుక్కర్లకన్న క్రొత్త ప్రెస్టీజ్ చాలాకాలము మన్నును.



క్రొత్త ప్రెస్టీజ్ వల్ల ఎన్నో అధిక లాభములు

* ఎక్కువ మన్నికైన దళసరి అడుగు.
* మన్నికైన స్టెయిన్‌లెస్ స్టీలు స్క్రూలతో బిగించిన దృఢమైన పిడులు.
* ఎప్పుడు వేడెక్కని, పట్టునిచ్చు క్రొత్త "అక్సులరి" పిడి
* పటుత్వము, దృఢత్వము కలిగిన క్రొత్త "ట్రివేట్"

మరియు ఏ లాభములవలన భారతదేశములో 30 సంవత్సరములకు పైగా ప్రెస్టీజ్ కుక్కర్ అందరికి కావలసిన కుక్కర్ అయినదో ఆ లాభములన్నీ ఇందులో వున్నాయి.

ttk తయారీ.

Prestige



భారతదేశములో ప్రెషర్ కుక్కర్‌ను ప్రవేశపెట్టినవారు

జీవితవనంలో కొత్తగాలి

26

కిరణ్ పెళ్ళి! ఇది పచ్చినిజం. నేను మతిబోయినదానిలా దాన్ని ఇంకా అలాగే చూస్తున్నాను. నేను స్పృహ తప్పిపోగానే ఆఫీసులో అందరూ గాభరాపడిపోయారట. నన్ను పట్టి తీసుకునివస్తున్న విమలని, హనుమంతరావుని చూసి అమ్మ గాభరాపడిపోయింది నన్ను మంచంమీద పడుకోబెట్టి అమ్మతో హనుమంతరావు "ఏదో శుభలేఖ వచ్చిందండీ. అది చూస్తూనే స్పృహతప్పి పడిపోయారు." అంటూ విమలని అడిగి కవరు తీసి ఇచ్చాడు. అది చూస్తూనే అమ్మ ముఖం పాలిపోయింది. నేను పిచ్చెక్కినదానిలా అయిపోయాను.

"భగవాన్! వాట్ ఏ హెల్! వాట్ కెన్ ఐ డూ" అని ఏడ్చేస్తున్నాను. కిరణ్ నుంచి శుభవార్త వస్తుందని ఎదురుచూస్తున్న నాకు శుభలేఖ వచ్చింది. నా కిరణ్ నాకు దూరమయిపోతున్నాడు. భగవాన్! తండ్రీ నేనేంచెయ్యాలి! నేనేంచెయ్యాలి హృదయవిదారకంగా, గుండెలు పగిలేలా ఏడుస్తున్నాను.

ఇంట్లో అందరూ కాళ్ళూ చేతులూ ఆడనట్టుగా, చేతులు నలుపుకుంటూ చూస్తున్నారు. ప్రకాష్ విజయవాడ వెళ్ళిపోతున్నాడని,రెండు రోజులు వచ్చి ఉండమని అమ్మ కోరటంతో ఇద్దరూకూడా వచ్చారు. కానీ ఎవ్వరికీకూడా ఏమి అనే ధైర్యం లేదు.


నా గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలవుతున్నాయి. నాకు చచ్చిపోతే బాగుండుననిపిస్తోంది. కిరణ్ ఆ పదిరోజులూ నా జవాబు కోసం ఎంతగా ఎదురుచూశాడో! అతని తప్పేం ఉంది? అంతా నా దురదృష్టం. నావాళ్ళంతా నా ఆనందాన్ని కొల్లగొట్టారు. నా కిరణ్‌ని నాకు దూరం చేశారు.

కిరణ్! కిరణ్! నా ఆక్రందన నా కిరణ్‌కి ఎలా వినిపిస్తుంది? నేను నీదాన్ని కిరణ్ అని అరిచి చెప్తున్నా ఆ పిలుపు అందుకోలేని దూరతీరాలకి వెళ్ళిపోతున్నాడు నా కిరణ్. అతనికీ, నాకూ ఇక ఏ సంబంధం లేదు. ఆ ఊహే నేను భరించలేకపోతున్నాను. నా మనసంతా తగలబడుతున్న మహారణ్యంలో చిక్కుకుపోయిన లేడిపిల్లలా ఉంది. ఆ మంటల్లో నేను దగ్ధమైపోవాల్సిందే. నన్ను ఎవరూ రక్షించలేరు. నేను వెక్కి వెక్కి ఏడుస్తున్నాను.

"సంధ్యా... అక్కా...వదినగారు..." బయట తలుపులు బ్రద్దలవుతున్నాయి. నేను ఆడపులిలా లేచాను. "వెళ్ళిపోండి మీరంతా. చంపేస్తాను... మీరంతా కలిసి నా జీవితం నాశనం చేశారు. నన్ను పావులా వాడుకున్నారు. స్వార్థపరుల్లా నన్ను దోచుకున్నారు. ఇప్పటికైనా మీ కళ్ళు చల్లబడ్డాయిగా... వెళ్ళిపోండి... వెళ్ళిపోండి... భగవాన్...!"

ఆ నాలుగు రోజులు నాకు తిండిలేదు. నిద్రలేదు. మతిబోయినదానిలా ఏడుస్తూ ఉండిపోయాను. నా జీవితవనం వాడిపోయింది. నా కలలు నేలరాలిపోయాయి.

(ఇంకా వుంది)


మహేశ్వరి మూవీస్
బంగారుభూమి
కలర్
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: పి.చంద్రశేఖరరెడ్డి B.A.
నిర్మాత: ఎస్.పి.వెంకన్నబాబు
THARAKA PRABHU ADS
నెల్లూరు: కళ్యాణిశ్రీ ఫిలింస్. సీడెడ్: నాగార్జున పిక్చర్స్ చిత్తూరు జిల్లా: నవభారత్ ఫిలింస్ నైజాం: విక్రమ్ ఫిలింస్.

(గత సంచిక తరువాయి)



[ఇంకా ఉంది]

రెండవ బహుమతి రు. 150 లు పొందిన వ్యాసం

నిరూపణ, జవాబు, ప్రత్యక్ష సాక్ష్యాలు

విజమైన పుత్రుడు

ఈ కథ నా దృష్టిలో మొదటి బహుమతికి అర్హమైన కథ. ప్రతి తల్లికీ, తండ్రికీ తమ సంతానం ప్రయోజకులు కావాలనీ, వృద్ధాప్యంలో కొడుకు – కోడళ్ళ ఆదరణలో మనవల ఆట పాటలతో కాలం గడపాలనే ఉంటుంది. వెంకటపతి, జానకమ్మలు ఆ కోవకి చెందినవారే. తన బిడ్డ భవిష్యత్తుకు బంగారుబాట వేయాలని పరాయి పంచన చేరిన జానకమ్మ, తను జన్మనిచ్చిన పుత్రుడు ఉన్నతంగా ఉండాలని యాచక వృత్తిలోకి దింపకుండా, స్వశక్తితో తన కోరికల కనుగుణంగా తీర్చిదిద్దిన వెంకటపతి, వీరిద్దరి ఆశలు – ఆశయాలు ఒకటే. తన ఉన్నతికై జీవితాన్నే పణంగా పెట్టిన తల్లికోసం ప్రపంచాన్నే ఎదిరించగల శేఖర్ అత్యంత ఆదరణ, కేవలం భార్యా విధేయుడై కన్న తండ్రినే అవమానించిన కృష్ణ నిరాదరణ వారి వ్యక్తిత్వాల పై చిత్రంగా దెబ్బతీశాయి. తల్లిదండ్రులఆశలను అర్థంచేసుకుని నడుచుకునేవాడే నిజమైన పుత్రుడు అని నిరూపించాడు శేఖర్.

కోరిక

కష్ట సుఖాలో భర్తతో పాలు పంచుకునే గృహిణి, బిడ్డలకు అనురాగాన్నందించే మాతృమూర్తి అన్నేళ్ళ సాంసారిక జీవితంలో ఒకే ఒక కోరిక కోరింది. అది కాశీకి వెళ్ళడం. భార్యకోర్కె తీర్చలేని మాధవరావు నిస్సహాయత, చివరికి ఆ కోర్కె తీర్చిన విధం హృదయాలను కదిలించేలావుంది సామాన్యుల సగటు కోరికలు కూడా తీరని కోరికలుగా మిగిలిపోతాయని చెప్పే కథే 'కోరిక.'

ఇది ప్రశ్న—అది జవాబు

ఈ కథలో చావు భయంతో కొట్టుమిట్టాడే శివయ్య పాత్ర పాఠకుల సానుభూతికి నోచుకునే పాత్ర ఎవరు పోయినా తనే ముందుండే శివయ్య చావు భయం మనిషికి జీవితం పట్లగల మమకారాన్ని తెలియచేస్తుంది. జననం ధర్మం— మరణం ఖర్మం అనే వేదాంతాన్ని వంటబట్టించుకున్నవాడైనా చివరి క్షణాలో మృత్యు ద్వారాలు స్వాగతం పలుకుతుంటే భీరువౌతాడు అయితే ఆ మృత్యువునే జయించిన శివయ్య పాత్ర పాఠకుల ముందున్న ప్రశ్నయితే, రాజా అన్న హఠాన్మరణం ఆ ప్రశ్నకి జవాబు కాగలదు.

మానవత్వం

అధికారంలో ఉన్నవాడెప్పుడూ తన కింద వాడిని ఇంకోమెట్టు కిందికి దించాలనే చూస్తాడు. ఆ వర్గానికి ప్రతినిధులు దయానిధి, శర్మలు. రాజకీయ కక్షతో క్రింది ఉద్యోగికి రావల్సిన డబ్బుని ఆపేసి, ఆ డబ్బే తన అవసరాలు తీరుస్తుందని తెలిసినప్పుడు దయానిధి పడిన తపన, అనుభవించిన మానసిక వేదన 'మానవత్వం' కథలో ప్రతిఫలిస్తాయి మనిషికి మానవత్వం కొలబద్ద కావాలని నిరూపించిన కథ మానవత్వం.

పచ్చతోరణం

కని పెంచి విద్యాబుద్ధులు నేర్పి, వారు గొప్పవారైతే చూసి ఆనందించాలని, ఇల్లు నిత్య కల్యాణం–"పచ్చతోరణం"గా ఉండాలని ప్రతివారికీ ఉంటుంది రెక్కలొచ్చిన పక్షులు గూటిలో ఉండనట్లే ఎవరి స్వార్థంతో వారు చెట్టుకొకరు అయిపోతే ఆ తల్లిదండ్రులబాధ వర్ణనాతీతం. అందుకు ప్రత్యక్ష సాక్ష్యాలు వైకుంఠమూర్తి, ప్రమీలలు.

— వేమూరి శ్రీదేవి

మెఱుపు!

వెన్నెలలో పిలపిల్ల
ఇండ్లలో మెఱుపు...

ముగ్గులతో శోభిల్లు
వాకిలి మెఱుపు...


వంటలతో రాజిల్లు
గాదెల్లో మెఱుపు...

కూతుళ్ల అల్లుళ్ల
ముఖముల్లో మెఱుపు

నీ ఇల్లు నా ఇల్లు
ఊరంత మెఱుపు...

వాడ వాడల లోన
సంక్రాంతి మెఱుపు!

—ఎస్. వి. ఆర్. సత్యనారాయణమూర్తి



వారఫలం

22-1-1982 శుక్రవారం మొదలు
28-1 1982 గురువారంవరకు

మేషం: ఆదాయం సంభవమనీ, రావలసిన అప్పులు వసూలు కాగలవనీ, ఉద్యోగ వృత్తులందు ప్రగతి కలుగనున్నదనీ, రాజకీయంగ కొందరకు, రాశి జాతకులకు మేలున్నదనీ, క్రీడారంగంలో విశేషాదరణ గలదనీ చెప్పదగిన వారం. స్త్రీలకు: సుఖ సంతోషాలు, సంతానం వలన ఆనందం, అవివాహితులకు శుభం జరిగే సమయం.

వృషభం:— పలు విధాల లాభ దాయకం, ప్రతిభ రాణించే అవకాశం, శుభ కార్యానుకూలత. మీరు చేసే ఉద్యోగంలో పెంపునకు అవకాశం, వృత్తిలో ప్రగతికి అవకాశం గల వారం. చాల మందికి క్రీడా రంగంలో అవకాశాల లభించటం, విద్యార్థులకు పెంపు గల వారమే. స్త్రీలకు: ధనాదాయం, విక్రయ లాభం కనిపిస్తుంది.

మిధునం:— గృహ నిర్మాణ కార్యక్రమానికి అనుకూలత, కొందరకు భూమి కొనుగోలు చేసే ప్రయత్నం కూడా సాగుతుంది. ఒకానొక క్రయ విక్రయ సంబంధమైన విషయంలో మేలు సంక్రమించే అవకాశమున్నది. రాజకీయంగా కొందరకు అనుకూలత సంభవం. స్త్రీలకు: ఆరోగ్యభాగ్యం, ఆదాయం, కార్యానుకూలత గలదు.

కర్కాటకం: గ్రహించండి. మీయింట శుభ కార్యం జరిగే అవకాశమున్నది. బంధువులు కాని వారితో, ఏదో సంబంధం నిశ్చయించుకోనున్నారు. భూసంబంధమైన ఆదాయం చేకూరగల వారమనీ, అప్రయత్నంగా ఆదాయముంటుందనీ చెప్పదగిన వారం. వైద్య వృత్తి 'కంట్రాక్టు' వృత్తి సుకరంగా సాగే అవకాశం గలవారం. స్త్రీలకు: భోగభాగ్యాలకు కొరత లేదు. సుఖ శాంతులకు కొదువరాదు.

సింహం: రాశికి రెండింటగల 'శని' గ్రహం ధనాదాయానికి సుఖశాంతులు లోపించుటకు నిశ్చయముగా అనారోగ్యతకు, హటాత్తుగా ఏదైనా ప్రమాదం సంభవించుటకు 'శని గ్రహం 'కారకుడే! వ్యాపారానుకూలతకలదే గాని, ఎంతో జాగ్రత్తగా మెలగవలసిన అవకాశం కూడా లేక పోలేదు. స్త్రీలకు: ఆదాయం, ఉద్యోగాభివృద్ధి గలవారమే.

కన్య: వస్తువులు కొనుటయందు, విక్రయించుటయందు ఎంతో జాగరూకత అవసరం. బంధు

ఆంధ్రపత్రిక

దుందుభి నామ సంవత్సరాది సంచికకు

తమ రచనలను పంపవలసినదిగా రచయిత(త్రు)లను కోరుతున్నాము. రచనలు మా కార్యాలయానికి జనవరి 31 లోగా అందవలెను.

— సంపాదకుడు.

వారఫలం

వుల మూలాననో, ఆత్మీయుల వలననో సహచరుల వలననో కొంత ఇబ్బంది కలిగే అవకాశమున్నది. స్వకార్యాచరణమునకు తోడు ఇతరులకు కూడ సహాయం చేయగలరు. స్త్రీలకు: సభాగౌరవం, రచనానుకూలత, పత్రికా గౌరవానికి చక్కని ఆరోగ్య భాగ్యానికి అవకాశం గలవారం.

తుల: నాటివరకు ఒక్కొక్క విషయం సాగించుకొన్నది మరలా ప్రగతి మార్గాన్ని పట్టుతుంది. రచయితలకు, పెద్ద ఉద్యోగాలలోనున్నవారికీ, బ్యాంకు ఉద్యోగస్తులకు పదవకాశాలు లభింపగలవు. స్త్రీలకు : ముఖ్యరంగాలలో అనుకూలత, స్వల్పంగా ఆదాయం వచ్చే వీలున్నది. ఆరోగ్యలోపం లేదు.

వృశ్చికం: ఆలోచనలో ఉత్సాహ పూరితంగా చేపబడిన పనులు ప్రత్యక్షంగా విజయవంతం కాగలవు. చిక్కులలో నుండి విడివడగలరు. పరుల వ్యవహారాలను పైన వేసికొని తీరిక లేకుండా సంచరించటం జరుగుతుంది. దైవకార్యాచరణ సమకూరుతుంది. ఆస్తిని అభివృద్ధి గావించుకొనే ప్రయత్నాలుంటాయి. క్రీడారంగంలో విశేషావకాశం లభింపగలదు. స్త్రీలకు: ఉద్యోగాభివృద్ధి, ధనాదాయం, వ్యవహారానుకూలత గలవారం.

ధనుస్సు: అకాల భోజనం, పనుల వత్తిడి, ఆదాయలోపం, చిక్కిన అవకాశాలు చేయిజారిపోయే పరిస్థితి ఏర్పడవచ్చు. లాభదాయకమైన క్రొత్త దారులు త్రొక్కే అవకాశమున్నది. వృత్తి వ్యాపారాలు ఒక మోస్తరుగా సాగుతాయి. విద్యార్థులు సత్ఫలితం చేత చిక్కించుకొంటారు. స్త్రీలకు: విలువ గల వస్తుసంపాదనా, వృత్తిలో అభివృద్ధి, ధనలబ్ధి, మనశ్శాంతి, ఆనందం సంతరించుట ముఖ్యాంశాలు.

మకరం: మీ జీవన రథం ఒడిదుడుకులు లేక సరసరా సాగిపోతుంది. ప్రగతి మార్గాన్ని పట్టుతుంది. ఎంతో కొంత ఆదాయం కూడా లేకపోలేదు. ఆదాయానికన్నా, ఆస్తి, అంతస్థు అనుకూలత ఆనందోత్సాహాలు పెరిగే అవకాశాలున్నాయి. ఏవైనా వివాదాలుంటే అలాంటి వ్యవహారాలుంటే పరిష్కరింపబడుతవి. కానివారిని సాధించుట మానుకోవాలి. స్త్రీలకు: విత్సాంగత్యం, వృత్తిలో పెంపు సంభవం.

కుంభం: మీకు సంబంధించిన వివాదాలేమైనా వుంటే అవి సామరస్యంగా తీర్మానింపబడతాయి. స్థిర చరాస్తుల వ్యవహారాలు మీకు అనుకూలముగా పరిష్కరింపబడగలవు. నూతన వస్తుసేకరణ సులువుగా చేసికోగలుగుతారు. స్త్రీలకు: పుత్రీ పుత్రులవలన ఆనందం, కుటుంబ విష


యాలలో ఉత్సాహం, కించిత్తు ఆదాయం గలవారం.

మీనం: ప్రతివారం ఈ ఏడు దినాల వలె ఉండలేదు గదా! అవి మీరే గ్రహించులాగు

నాల్గు విధాలా మేలు చేకూరగల దినాలు. సుఖ శాంతులకీ. ఆదాయానికీ, ధనలబ్ధికి అనుకూలత గలవారం. ఎన్నో నూతన విషయాలు పొంపి కంగా లాభ దాయకములను గ్రహింపగలరు.

స్త్రీలకు: కళాసాహిత్య రంగాను కూలత క్రియ విక్రయములందు లబ్ధి. అధికారుల ఆదరణ లభించగల వారం.

విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి



అమ్మాయి అద్భుతాలు!

కురుక్షేత్ర కళాశాలలో బియ్యే చదువుతున్న సంతోషశర్మ అనే అమ్మాయి పక్షికున తాను తమాషాలు చేస్తానని చెప్పి సభరున వెళ్ళి రెండు కార్లను చప్పున నిలిపివేసిందట. వూపిరి బిగపట్టి గుండె, నాడిని కొట్టుకోడం ఆపేసి చూపిందట. ఫుట్‌బాలు బ్లాడరులో ముక్కుతో గాలి వూది ఆ బ్లాడరు పగిలేసిందట. ఇత్తడి పళ్లేన్ని కాగితం చింపినట్టు చింపేసిందట. గాజు ముక్కలను అర చేతిలో వేసుకుని, రెండో చేత్తో ఆ ముక్కలను మెత్తని పొడి అయ్యేలా నలిపేసిందట. ఆమె రోజూ తన యింటి నుంచి ఆ కాలేజికి 15 కిలోమీటర్లు సైకిలుమీద వస్తూందట. మరిహనేం!

దయలేని పుత్రులు....!

దిశవిళక్కు అనే గ్రామానికి చెందిన యాభయి ఏళ్ల పెరుమాళ్ గవుండరు తన భార్య చనిపోయినందువల్ల చిన్నపొణ్ణు అనే ఆమెను ఆశనాయకి (ఉంపుడుగత్తె)గా ఉంచుకొన్నాడట. ఆస్తిని భాగాలు చేసి తన ఏడుగురు కొడుకులకూ, ఒక కూతిరికి పంచి, తనకని ఓ భాగం పెట్టుకున్నాడట. ఆ భాగాన్ని అమ్మజూపటంతో కొడుకులకు కోపం వచ్చిందట. అమ్మి, ఉంచుకున్నదానికి నగలుగా మార్చేస్తాడుగావును అని భయపడి మొన్న ఎనిమిదో తేదీ ఆ పెరుమాళ్ కొండకారనూరులో ఉన్న కూతుర్ని చూసి వస్తుండగా నడి రోడ్డులో ఏడుగురు కొడుకులూ నిలేసి, చితకబాది, మెడకు తాడు గట్టి వూళ్లో పిచ్చి కుక్కను లాక్కుపోయినట్టు లాక్కుపోయారట. నడవలేక క్రిందపడిపోయినా, దయాదాక్షిణ్యాలు లేకుండా, రోడ్డుమీద బరబరా ఈడ్చటం వల్ల అతను రక్తపు ముద్దగా మారి చనిపోయాడట.




మహమ్మదాలీ ఓటమి!

ప్రపంచవిఖ్యాతి పొందిన ముష్టి యుద్ధ వీరుడు మహమ్మద్ అలీని కెనెడా వీరుడు ట్రావర్ బెర్‌బిక్ అనే అతను ఇండియాదీవి బగామస్‌లో చిత్తుగా ఓడించాడట. అక్కడ జరిగిన "హెవీ వెయిట్ చాంపియన్‌షిప్" పోటీలో తాను ప్రథమునిగావచ్చి ఆ పట్టం తీసుకోడానికి...ఆ తరువాత నిబ్బరంగా, సుబ్బరంగా విశ్రాంతి తీసుకోదల్చుకొన్నట్టూ కృతనిశ్చయుడైనట్టు ప్రకటించాడట మహమ్మద్‌అలీ. అలీకి భగవంతుడు తోడయినట్లు కనపడలేదు. ఇది అతని రెండో పరాజయం.

దేశద్రోహం!

ఢిల్లీ నాదర్‌హెడ్ క్వార్టర్సులోని ఫోటోగ్రఫీ విభాగంలో పని చేస్తున్న ఎస్. డి. పచ్ భావే అనే అతను భారత యుద్ధ నౌకలలోని విభాగాలు తీసిన ఫోటోలను అతి రహస్యంగా పాకిస్తాన్ ఎంబాసిడర్ కార్యాలయానికి చెందిన ఒకాయనకు నవంబరు 21వ తేదీన యిస్తూండగా పోలీసులు అతి చాకచక్యంగా వారిద్దర్నీ పట్టేశారట. చాందినీ చౌక్ ప్రాంతంలోని ఓ పార్కులో యీ చేతులు మార్పిడి జరుగబోయిందట. ఈ సందర్భంగా ఒక యువ న్యాయవాది రాజన్ బక్షిని కూడా అరెస్టు చేశారట.



గుంటూరులో నెలకి 1500 గర్భసంచి ఆపరేషను!

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోయినేడు 1585 మందిరోగులకు చికిత్సజరిగిందనీ, అందులో 840 కేసులు ఆపరేషన్లనీ, అందులో 577 కేసులు గర్భ సంచి తొలగించిన కేసులేనని ఆ ఆసుపత్రిగైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సావిత్రి అన్నారట. కృష్ణా, గోదావరి తీర గ్రామాలలో ఈ గర్భసంచి తొలగించి ఆపరేషన్లు సర్వసాధారణమైపోయాయనీ, ఆడవారు బొత్తిగా యీ ఆపరేషన్‌కు భయపడ్డం మానేశారని ఓ డాక్టర్ అన్నారట. గుంటూరులో మొత్తం ప్రయివేటు నర్సింగ్ హోములలోనూ, ప్రభుత్వ ఆసుపత్రిలోనూ కలపి నెలకు 1500 గర్భ సంచి ఆపరేషన్లు జరుగుతాయట. ఆ ప్రాంతంలో కొంత మంది డక్టర్లు డబ్బుకు ఆశపడి అక్కర్లే పోయినా, ఈ బిడ్డసంచిని తీసివేయాలని రోగులను భయపెట్టి ఆపరేషన్లు చేసి డబ్బులు గుంజుకుంటున్నారట. ఈ ఆపరేషను అనుభవం లేని డాక్టర్లు చేస్తే అది గర్భ సంచి స్థానంలో కాన్సరు వచ్చే ప్రమాదం ఉందనీ, అంతేగాక, మెదడు, గుండె కాయలకు కూడా ప్రమాదమనీ ఒక డాక్టరు అభిప్రాయపడ్డారట.

కలు తగాదా!

పూలాంపట్టి అనే వూరిలో పళనిసామి అనే అతనికి, రాజామణి అనే కల్లు వ్యాపారికి కల్లు విషయంలో అభిప్రాయభేదం వచ్చి అది పెరిగిందట. దాంతో రాజామణి తన స్నేహితులతో ఓ అయిదుగుర్ని సహాయానికి పిలిచి, పళనిసామిని వారంతా చేరి, కొడవళ్లతోనూ, కర్రలతోనూ ఎదుర్కొని అతను పారిపోయేసరికి కూడా పడి నరికి పోగులు పెట్టి పోలీసులకు దొరక్కుండా చెక్కేసారట.


ప్రాథమిక పాఠశాలల దుస్థితి!

ఉత్తరప్రదేశ్‌లో ఉన్న డెబ్బయిఒక్క వేల ప్రైమరీ స్కూళ్లలో సుమారు పదహారు వేల స్కూళ్ల గతి దుర్భరంగా ఉన్నదనీ, స్కూలు అనే పదార్థాలే కొన్ని చోట్ల లేవనీ చెట్టు క్రిందో చావు క్రిందో పబ్బంగడుపుకొంటున్న విద్యాలయాలు ఉన్నాయి అనీ, బ్లాక్‌బోర్డులు గానీ, వయిట్ చాక్ పీసులు గానీ ఆ స్కూళ్లు ఎరుగవనీ యు. పి. ప్రయిమరీ స్కూళ్ల ఎసోసియేషన్ ప్రెసిడెంట్ మిస్టర్ పాండే విన్నవించారట.


లంచాలు మేసే చెత్తబుట్ట!

పంజాబు రాష్ట్ర ఎక్సయిజ్, వ్యాపార పన్ను శాఖలోని ఓ ఆఫీసరుగారు లంచం పుచ్చుకోడంలో ఓ అధునాతన పద్ధతి కనిపెట్టాడట. ఇవ్వదల్చుకున్న లంచాన్ని చెత్తబుట్టలో పడెయ్యమంటాడట. సాయంత్రం ఆఫీసు టయిము దాటాక ఆ చెత్తబుట్టలో డబ్బును ఏరుకు చక్కా పోతాడట మా వాయనే!

అద్భుతమైన క్రొత్త సాధనం!




ఈగిల్ కోసీ టీ-పాట్ వుంటే చాలు, రోజంతా టీ, కాఫీ త్రాగే అనుకూలమే మరి!




మోడల్	గైషా	ఎక్స్‌ప్రెసో	గార్సొం	మైత్రే	డ్యూవార్డ్
పరిమాణం	8 కప్పులు	4 కప్పులు	2 కప్పులు	5 కప్పులు	8 కప్పులు

కాఫీ, టీ తయారు చేయడం ఎంతో బాదర బందీతో కూడిన పని. మళ్ళీ-మళ్ళీ పాలను వేడిచేయడం, వడకట్టిన టీ, కాఫీ పొడిని పడేయడం, కడగడం, తుడవడం— ఇవన్నీ ఎంతో విసుగు కలించే పనులు. ఇప్పుడు ఈగిల్ కోసీ టీ-పాట్స్ మళ్ళీ-మళ్ళీ టీ, కాఫీ తయారు చేసే ఈ బాదర-బందీని తొలగిస్తాయి. ఒక్కమారు తయారు చేసి అందులో పోసి వుంచుకొంటే చాలు, ఎన్నో గంటలపాటు రుచికరమైన తాజా టీ, కాఫీ హాయిని అనుభవించవచ్చు. ఈగిల్ టీ-పాట్స్‌తో రోజంతా ఎప్పుడు కావాలన్నా వేడి-వేడి కాఫీ, టీ తయార్!



ఈగిల్ కోసీ టీ-పాట్. ఎన్నో గంటల పాటు వేడిగా వుంచుతుంది

CASE-133-244 TEL



ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

ఏది జీవహింస?

ఇతర విషయాలలో భిన్నాభిప్రాయభేదాలున్నా అహింస విషయంలో అన్నిమతాల ధోరణీ ఒక్కటే— జీవహింస చెయ్యకూడదని. జీవహింస మహాపాపం. అయినా, మనకు తెలియకుండానే ఎన్నో ప్రాణులను మనం హింసిస్తున్నాము. మనం నడిచేటప్పుడు ఎన్నో క్రిమికీటకాదులు మన పాదాల క్రింద పడి అణగారిపోతున్నవి. అట్టి కీటకాదులకు కూడా హింస కలగకుండా పూర్వకాలంలో బౌద్ధమతస్థులు నెమలిపురి చీపుళ్లతో దారిని తుడుచుకుంటూ చీమలు మొదలైనవి లేకుండా చూచి నడిచి వెళ్లేవారట! కాని, ఆ పద్ధతి ఎన్నడో మాసిపోయింది.

కొందరు అహింసను అక్షరాలా పాటిస్తున్నామని అనుకొంటూ మనుష్యులు తొక్కుతున్న రిక్షాలు ఎక్కమనీ, ఎద్దులూ, గుర్రాలూలాగే బండ్ల మీద ప్రయాణం చెయ్యమనీ నియమం పెట్టుకుంటారు. అది సరియైన అహింస కాదు. అలాటి వాహనాల మీద ప్రయాణం చేస్తే మనుష్యులను పశువులను హింసించినట్లు కాదు. రిక్షావాళ్ళు తమ జీవనం కోసం ఆ వృత్తిని చేపట్టారు. అలాగే బండ్లవాళ్ళున్ను తమ జీవనం కోసం గుర్రాలచేత, ఎడ్లచేత బండ్లు లాగిస్తున్నారు. మనం ఆ వాహనాలు ఎక్కకూడదనుకుంటే— ఆ వృత్తిలో ఉన్నవాళ్ళకి అపకారం చేసినట్లే అవుతుంది.

తిరుమలకు రోడ్డు పడి, బస్సుల సౌకర్యం లేనప్పుడు, ఏడు కొండలూ ఎక్కలేని వారు డోలీలో కూర్చుండి శ్రీనివాసుని దర్శించడానికి వెళ్లేవారు. ఇప్పుడూ హిమాలయ పర్వతాలమీద కొన్ని క్షేత్రాలకు డోలీలలోనే వెళ్లేవారున్నారు. ఆ డోలీలను మనుష్యులే మొయ్యవలసి ఉన్నది. జీవహింస కూడదని వాటిమీద వెళ్లకపోతే, ఆ వృత్తిపై ఆధారపడినవాళ్ళకి అపకారం చేసినట్లవుతుంది. వాళ్ళకు వాళ్ళు అనుకున్నదానికంటె ఎక్కువ

కబ్బులు ఇస్తే వాళ్ళు పరమానందభరితులై తమ కష్టాన్ని మరచిపోతారు. ఆ విధంగానే పక్షులకు, పిచ్చుకలకు మంచి దాణా కావలసినంత పెడితే అవి తమ శ్రమను మరచిపోయి తమ పనిలో ఉత్సాహాన్ని చూపుతాయి.

అహింసను పాటిస్తున్నామనుకునే వారు పై విషయాలను గమనించి ప్రాణులకు ఉపకారం చెయ్యడమే, వారనుకునే అహింస కంటె ఉత్తమ ధర్మమని గ్రహించి, అందు కోసం అన్నివిధాలా కృషిచెయ్యడం ముఖ్యం.

ఏట్రిది హింసయో, ఏది అహింసయో— కులపతి మాస్టర్ శ్రీ వి. కె. గారు ప్రసంగవశాత్తు ఒకరి ప్రశ్నకు సమాధాన మిస్తూ చక్కగా వివరించారు.

మూడవ బహుమతి రు. 100 లు పొందిన వ్యాసం

దీపావళి వెన్నెలా?

ఇది ప్రశ్న - అది జవాబు

"విధి బలీయమైనది. ఏ నిముషంలో ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు" అనే సత్యాన్ని నిరూపించింది యీ కథ నా అనే వారు లేని శివయ్య జబ్బుతో చనిపోతాడనుకొంటే అతను కోలుకొని, రాజా వాళ్ళన్నయ్య అకస్మాత్తుగా పోవడం విచిత్రంగా వుంది. జీవితంలో యిలాంటి సంఘటనలు కాకతాళీయంగా జరుగుతుంటాయి.

కోరిక

మధ్యతరగతి బ్రతుకులకు ప్రతిబింబం యీ కథ. ఆర్థిక యిబ్బందుల వలన అవసరాలు తీరక ఎప్పటికప్పుడు ఎలా వాయిదా పడతాయో చక్కగా చిత్రించారు. కాశీ వెళ్ళాలనే చిరకాలవాంఛ తీరకనే మాణిక్యం మరణించడం, ఆమె అస్థికలు తీసికొని ఆవిడ సొమ్ముతోనే మాధవరావు కాశీకి బయలుదేరడం పాఠకుల సానుభూతికి నోచుకొంది.

మాటవినే కార్లు!

ప్రస్తుతం రోడ్లమీద కార్లను నడిపినట్లు, నడిచే కార్లు అనగలిగితే, పశ్చిమ జర్మనీలో చెప్పిన మాట వినే కార్లను తయారుచేస్తున్నారు. ఈ రకం కారు డాష్ బోర్డులో ఒక కంప్యూటరును అమరుస్తారు. ఈ కంప్యూటరు డ్రైవరు నుండి ఆజ్ఞలను అందుకుని వాటిని నెరవేరుస్తుంది. కారును స్టార్టు చెయ్యడం, హారన్ ప్రయోగించడం, లైట్లను వెలిగించడంవంటి తేలిక పనులను ఈ కంప్యూటరు చెయ్యగలదు. ఈ కారును వికలాంగుల కోసం ప్రత్యేకంగా తయారు చేశారు. అంతేగాక యీ కారును తయారుచేసిన హాన్స్ కెంఫ కూడా ఒక వికలాంగుడే! ఈ కంప్యూటరు చర్యలు పరిమితం కావడంతో స్టీరింగును డ్రైవర్లే నిర్వహించవలసి వుంటుంది.

నిజమైన పుత్రుడు

వెంకటపతి గుమాస్తాగిరి చేసుకొంటూ తన కొడుకు కృష్ణమూర్తిని చదివించి ఉద్యోగస్థునిగా తీర్చిదిద్దితే కృష్ణమూర్తి తండ్రిని, ఆయన యాచక వృత్తిని యీసడించుకొంటాడు. బంధుత్వం లేకపోయినా కేవలం పరిచయస్థురాలైన జానకమ్మ కొడుకు శేఖర్ వెంకటపతిని సొంతకొడుకు కంటె మిన్నగా ఆదరిస్తాడు. ఒక్కోసారి రక్తసంబంధం కంటె స్నేహబంధం ఉన్నతమై నిలుస్తుంది.

పచ్చతోరణం

రెక్కలొచ్చిన పక్షులు గూడు విడిచినట్లు కన్నకొడుకులు ముగ్గురూ యిల్లు వదలిపోవడం ప్రమీలకు, వైకుంఠమూర్తికి ఎంత మనస్తాపం కల్గించిందో చక్కగా వర్ణింపబడింది. సంతానం కల్గి అనుభవించడానికి అన్నీ వుండి కూడ జీవిత చరమాంకం బరువుగా, బాధగా, గడుపుతున్న ఆ దంపతుల స్థితి జాలికొల్పింది. దీపావళి నాటి వర్ణనలో 'వెన్నెల వచ్చగా వుంది' అని వ్రాశారు. దీపావళి నాడు వెన్నెలను చూడగల్గిన ఆ రచయిత(త్రి) అభినందనీయులు.

మానవత్వం

యూనియన్ స్పర్ధల మూలంగా ఆఫీసు వాతావరణం కలుషితమై వ్యవహారాలెలా కుంటుపడతాయో చూపారు. రాజకీయాల ముసుగులో మానవత్వం నశింప కూడదని చెప్పడంలో రచయిత(త్రి) కృతకృత్యులయ్యారు. పార్టీ భేదాలు విస్మరించి మానవత్వం చూపే విన్సెంట్ లాంటి విలక్షణమైన వ్యక్తులు అరుదుగా వుంటూనే వుంటారు.

విభిన్నమైన యితివృత్తాలు గల మంచి కథలు బహుమతి పొందడం యీ దీపావళి ప్రత్యేకత.

— దివి మురళీకృష్ణ

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

ఇం. కాం. రాష్ట్రాలలో శాంతి !

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి శ్రీ యోగేంద్ర మక్వానా డిసెంబరు 20న పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో మాట్లాడుతూ, ఇందిరా కాంగ్రెసు పాలనలో ఉన్న రాష్ట్రాలలో రాజకీయ హత్యలు జరుగడంలేదన్నారు. తమ ప్రభుత్వం రాజకీయ హత్యలను సహించదని, రాజకీయ హత్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని అన్నారు. వామపక్షసంఘటన అధికారంలో ఉన్న రాష్ట్రాలలో శాంతి భద్రతల పరిస్థితి క్షీణించిందని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాలులో ప్రభుత్వాన్ని తాము పడగొట్టమని, కాని శాంతి భద్రతలు క్షీణించినందున ప్రజలే దాని సంగతి చూసుకుంటారని, వామపక్షసంఘటన అధికారంలో ఉండిన కేరళలో ఇప్పుడిప్పుడే శాంతి నెలకొంటున్నదని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు.

హరిజనులకు హితవు :

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ యోగేంద్ర మక్వానా డిసెంబరు 20వ తేదీన అఖిల భారత అనుసూచిత జాతి పరిషత్ (షెడ్యూల్డు తరగతుల పరిషత్తు) సమావేశాన్ని ప్రారంభిస్తూ, సామాజిక ఆర్థికరంగాలలో హరిజనుల పరిస్థితి మెరుగుపడనంత వరకు వారికి అభ్యున్నతి వుండదని, వారు సంఘంలోని ఇతరవర్గాలతో సమానస్థాయి రావాలంటే, దేశం మొత్తం మీద ఉన్న 15 కోట్ల మంది హరిజనులు ఏకమై పోరాడాలని సలహా ఇచ్చారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం ఎంత సహాయం చేసినా, సంఘటితంగా లేనందున వారు అభివృద్ధి చెందలేదని అన్నారు. హరిజనులు తమ కోర్కెల కోసం సంఘంలోని ఇతర వర్గాలను దూషించడం గాని, హింసాత్మక చర్యలకు పూనుకోడం గాని తగదని సంప్రదింపులతోను, సామరస్యంతోను తమ కోర్కెలు సాధించుకోవాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి శ్రీ అంజయ్య ప్రసంగిస్తూ, హరిజనులు సంఘంలోని ఇతర వర్గాలతో సమానస్థాయికి వచ్చేవరకు రిజర్వేషన్లు తొలగించే ప్రసక్తి లేదన్నారు. మంత్రులు శ్రీయుతులు కోన ప్రభాకరరావు, కోనేరు రంగారావు ప్రసంగించారు. సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరిగినా, సభాంగణం ప్రేక్షకులు లేనందున వెలవెల బోయింది.

ఐదులక్షలు ఏ మూలకు ?

అంతర్జాతీయ తెలుగు సంస్థ సారథాధ్యక్షుడు శ్రీ వందేమాతరం రామచంద్రరావు డిసెంబరు 17న పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో మాట్లాడుతూ తమ సంస్థకు ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న ఆర్థిక సహాయం ఐదు లక్షల రూపాయలు చాల కొంచెమని సంస్థ ఆశయాలు సాధించాలంటే ఇతోధిక ఆర్థిక సహాయం అవసరమని అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆస్థానకవి డాక్టర్ దాశరథి కృష్ణమాచార్యులు ప్రసంగిస్తూ, విదేశాలలో నివసిస్తున్న తెలుగువారు పెద్దబాలశిక్షకోసం తపించి పోతున్నారని, దానిని ఆధునిక పద్ధతులపై ముద్రించడానికి ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. అంతర్జాతీయ తెలుగు సంస్థ సొంత భవన నిర్మాణానికి యత్నిస్తున్నదని, ఈ భవన నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రెండున్నర లక్షలరూపాయల ఆర్థిక సహాయం చేసిందని శ్రీ రామచంద్రరావు తెలిపారు.

ముఖ్యమంత్రి మంచి టీక :


ముఖ్యమంత్రి శ్రీ అంజయ్య డిసెంబరు 18న జూబిలీహాలులో ఏర్పాటుచేసిన "క్రిస్మస్" మిలన్ ఉత్సవంలో ప్రసంగిస్తూ, రాజకీయాలు మిళితం కాని మతం లౌకికవాదం (సెక్యులరిజం) అని, రాజకీయ మిళితమైన మతం మతోన్మాదమని, చక్కని టీక చెప్పారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని తనదృష్టిలో సర్వమత సామరస్యమే లౌకిక వాదం (సెక్యులరిజం) అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 32వేల దేవాలయాలున్నాయని, రాష్ట్ర ప్రజలు గొప్ప మతాభిమానులనీ ఆయన ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో వుండి పోవలసిందిగా కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామిని కోరానని ముఖ్యమంత్రి అన్నారు.

సికిందరాబాద్ స్టేషన్ బస్సు టెర్మినస్ బదిలీ:

ప్రస్తుతం సికిందరాబాద్‌స్టేషన్ కాంపౌండులో ఉన్న బస్సుస్టాండును స్టేషను తూర్పువైపునకు తరలిస్తారు. దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజరు శ్రీ షంసేర్‌సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం చేశారు. ఈ సమావేశంలో హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్ ప్రధానాధికారి శ్రీ అర్జునరావు, ఆంధ్రప్రదేశ్ రోడ్ రవాణా శాఖ జనరల్ మేనేజరు శ్రీ పి. ఎస్. రామమనోహరరావు భాగ్యనగర్ పట్టణాభివృద్ధి సంస్థ ముఖ్య ప్లానింగ్ ఆఫీసరు శ్రీ కె. జి. కృష్ణస్వామి, ట్రాఫిక్ డిప్యూటీ పోలీసు కమీషనర్ శ్రీ ఎం. ఎ. బసిత్ పాల్గొన్నారు. రైలుస్టేషనుకు చేరే రోడ్డును వెడల్పు చేయాలని స్టేషను ఎదుట ఉన్న సుభాస్ చంద్రబోస్ విగ్రహాన్ని మరొక చోటికి తరలించాలనికూడా నిర్ణయం జరిగింది. ఈ సమావేశం డిసెంబరు 21న జరిగింది.

ఉపశ్రుతి :

ఏమిటి మిడసరి లగ్నంలో వస్తున్నారు ? అనడిగారు నన్ను మిత్రులు డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ. నిన్న డాక్టరు రామరాజుగారింట వివాహభోజనము అంటే, ఇవాళ అనుకొని వచ్చాను. ఏ బండి 24 గంటలు లేటు అన్నాను. శ్రీ ఆరుద్ర వీరైలు ఒక జీవితకాలం లేటు అన్నారు గదా. మీ రైలు 24 గంటలే లేటు. మరేం ఫర్వాలేదు. అన్నారు డాక్టర్ రాధాకృష్ణ. శ్రీ ఆరుద్ర వీరైలు ఒక జీవితకాలం లేటు అన్నారుగాని, ఆయన రైలు జోరుగానె, సకాలానికే వస్తున్నదిగదా. అని చమత్కరించారు. మిత్రులు డాక్టర్ అబ్బూరి వరదరాజేశ్వరరావు.



డాక్టరు సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

వి. డి. ఆర్. — రాయగిరి

నాకు కడివైపు హెర్నియా ఆపరేషన్ జరిగింది. ఇది వివాహ జీవితానికి ఏమైనా ఆటంకమా? ఏది ఏమైనా, వైకల్యాన్ని కలిగిస్తుందా? ఏమైనా మందులు వాడాల్సి ఉంటుందా?

హెర్నియా ఆపరేషన్‌కీ వైవాహిక జీవితానికీ ఏ సంబంధమూ లేదు.

కండరాల పటుత్వం తగ్గటం వల్లగానీ, పుట్టినప్పటినుంచీ కొన్ని కండరాల నిర్మాణ లోపం ఉండి ఒకఖాళీ ఏర్పడటం వల్లగానీ హెర్నియా రావచ్చును. అంటే ఈ ఖాళీద్వారా కడుపులోని ప్రేగులు దిగడం అని అర్థం. ఈ రోగం వైకల్యం కాదు. ఈ రోగానికి శస్త్ర చికిత్సమాత్రమే ఉత్తమ సాధనం.

జి. ఎన్. ఆర్. — గుంటూరు

నా వయస్సు 19 సం.లు. నాకు చేతివ్రేళ్ల మధ్య చిన్న పొక్కులు లేచినవి. అవి గజ్జి పొక్కులు మాదిరిగా ఉన్నాయి. పెన్సిలిన్ ఇంజక్షన్లు చేయించుకున్నాను. పరిపూర్తిగా మాని పోయినవి. కాని మరల 20 రోజుల తర్వాత మామూలుగా తిరిగా వచ్చినవి. దీనికి ఏమి చెయ్యాలి?

ఈ లక్షణం "స్కేబీస్" ని తెలియజేస్తున్నది. బెంజైల్ బెంజొయేట్ 20 శాతం ఎమల్షన్, చర్మం బాగా శుద్ధి కడిగిన తర్వాత ఒకసారి పట్టించి, మరలా 12 గంటల తర్వాత అదే విధంగా పై పూతగా వ్రాయాలి. ఇలా రెండవసారి రాసిన 12 గం. తర్వాత బాగా శుద్ధి స్నానం చేయాలి. ఇలా వారంలో ఒకసారి వంతున రెండు మూడు వారాలు వరుసగా ఈ మందు పై పూతగా వాడాలి. గుడ్డలు, గలీబులు, దుప్పట్లు బాగా వేడినీళ్లలో ఉడికించి ఎండబెట్టిగాని వాడకూడదు.

ఇలా చేయనప్పుడు ఈ కురుపులు మళ్లీవచ్చే అవకాశం ఉన్నది.

టి. వి. ఎస్. ఆర్. — ఇల్లందు

నా స్నేహితునకు పళ్లవరుస సరిగ్గా లేదు. వీటికి ఏవో క్లిప్స్ వాడతారని విన్నాను. అవి ఎక్కడ లభిస్తాయో అడ్రస్ తెలుప ప్రార్థన.

ఈ క్లిప్స్ దంత వైద్యులు ప్రైవేటుగా గాని, డెంటల్ కాలేజీలలో గాని వేయడం జరుగుతుంది. పెద్ద పట్టణాలలోను, జిల్లా కేంద్రాలలోను ఈ వసతి లభిస్తుంది.

ఎస్. వి. ఎస్. వి. — పాలకొల్లు

ఆహారం తీసుకన్నా తీసుకోకపోయినా నోటి ద్వారా తేన్పులు వస్తున్నాయి. ఈవిధంగా రెండు సంవత్సరముల నుండి ఉన్నది. అప్పుడప్పుడు తగ్గుతుంది కాని పూర్తిగా తగ్గదు.

కొందరికి ఇంగరు. మానసిక ఆందోళన ఎక్కువగా ఉంటాయి. ఆ సమయాలలో వారు ఎక్కువగా ఆలోచించడం కూడా జరుగుతుంది. ఆ సమయాలలో వారికి తెలియకుండానే అనేకసార్లు గుటకలు వేయటం, ఒక్కో గుటకతోను కొంతగాలి కడుపులో పోవడమూ జరుగుతుంది. ఇలా ఉన్నవారికి అడపా దడపా త్రేన్పులు రావడం జరుగుతుంది.

మానసిక ఆందోళనలు తగ్గించుకోవడమే దీనికి తగిన చికిత్స. ఏదో ఒక వ్యాపకం కలిగించుకొని దానిమీద మనసు మళ్లించడం వల్ల ఈ లక్షణం (రోగం కాదు) తగ్గుతుంది.

పి. పి. — పిఠాపురం

కైలాయిడ్స్ అంటే ఏమిటి?

కోలాయిడ్స్ అంటే చర్మంలో ఏర్పడే గడ్డ వంటి వాపులు. ఇవి కొందరి శరీర తత్వాన్నిబట్టి ఏర్పడతాయి. చిన్నదెబ్బ తగిలినా, ఆపరేషన్ చేసినా, వాక్సినేషన్ మొదలయినవి చేసినా పుండు మానిన తర్వాత ఆ చోట్లలో కాయలులాగా లేవడం జరుగుతుంది. ఇవికొన్నిరోజులపాటు పెరుగుతూ వస్తాయి. తర్వాత వాటంతట అవే పెరగడం ఆపివేస్తాయి.


వీటిని శస్త్ర చికిత్స ద్వారా తీసివేయగలిగినా తిరిగి అదే ప్రాంతంలో ఇవి పెరిగే అవకాశాలు ఎక్కువ అనే చెప్పవలసి ఉంటుంది.

ఎస్. పి. బి. — హైదరాబాద్

నాకు అప్పుడప్పుడు నోరు పూస్తుంది. ఎందువలన వస్తుంది? అది ఎలా తగ్గుతుంది. మళ్లీ రాకుండా ఉండాలంటే ఏమి చెయ్యాలి?

ఇలా అడపాదడపా నోరు పూయటాన్ని అఫ్తస్ స్టొమటైటిస్ అని అంటారు. ఇవి రావడానికి ఎన్నో కారణాలను శాస్త్రజ్ఞులు వివరించినా ఫలానా ప్రత్యేక కారణం అంటూ ఇంత వరకు తెలియదు. బికాంప్లెక్స్ విటమినుల లోపం, మానసిక ఆందోళన మొదలయిన కారణాలు వీటికి దోహదం చేస్తాయి.

1 శాతం సిల్వర్‌నైట్రేట్ సొల్యూషన్‌ని ప్రత్తితో ఆ పుండ్ల మీద అద్ది వెంటనే ఉప్పు నీళ్లతో పుక్కిలించి ఉమ్మడం చేయాలి. అలా రెండు మూడు రోజులు రోజూ రెండు మూడుసార్లు చేయడం మంచిది.



అవీ... ఇవీ... అన్నీ...

హిందూ ధర్మాన్ని ప్రబోధించే ముస్లిం!

కృష్ణా కాన్షస్ సొసైటీ మద్రాసులో 'సమస్త విశ్వాసాల దృక్పథం' [ది యూనిటీ ఆఫ్ ఆల్ ఫెయిత్స్] సమావేశాలలో పాల్గొనటకు విచ్చేసిన రమణారీదాస్ [మహమ్మద్ ఉస్మాన్ యాసన్] ఒక పత్రికా సమావేశంలో మాట్లాడుతూ తాను పాకిస్తానులోని అక్కాలోల మల్లాల వంశానికి చెందిన వాడిననీ, అయినా ఇస్లామ్ బోధకులు భగవత్స్వరూపాన్ని సమగ్రంగ తెలియచేయలేక పోయారనీ కొరాన్ పఠనంలో విసుగు చెంది, గురుశ్రీల ప్రభుపాద పరిచయంతో కృష్ణభక్తుడయి 'ఉస్మల్లాహు అల్ అజామ్' కొరాన్‌లో చెప్పబడిన భగవంతుని గొప్ప గుప్త నామమనీ, భగవంతుని ప్రేమించి ఆత్మార్పణ చేసుకున్నవాడు నిజమైన ఇస్లామీ అనీ దానిని తాను హరేకృష్ణ నామ జపంతో సాధిస్తున్నాననీ చెప్పారు. కొరాన్‌లో గోమాంస భక్షణ నిబంధన లేదనీ, అంతే గాక సురాహాతుల్ బక్రా గోవును కీర్తించిందనీ భగవంతుడు అద్వితీయుడనీ, పరిపూర్ణుడనీ కొరాన్ చెప్పగా గీత [అజ పుట్టుక లేని వాడని], పరబ్రహ్మమని చెప్పిందని, లెబనాన్‌లోని అత్యున్నత ఇస్లామ్ పండితుడు ఇస్లాంను సంపూర్ణముగా అర్థం చేసుకోవాలంటే గీత చదవాలని అరబిక్ గీతకు తాను వ్రాసిన పీటికలో పేర్కొన్నాడనీ త్వరలో తాను మీనాక్షీ పురం, ఇతర గ్రామాలు సందర్శిస్తాననీ చెప్పారు.

మత మార్పిడులు భౌతిక మయినవి మాత్రమే గానీ ఆత్మకు సంబంధించినవి గావనీ భగవత్సేవ అన్నది జీవుల ధర్మమనీ, అది హిందువయినా, ముస్లిం అయినా, క్రైస్తవుడయినా మారదనీ చెప్పారు.

కోయంబత్తూరు, బెంగుళూరు, బొంబాయి, ఢిల్లీలలో కూడా యిట్టి సమావేశాలు జరుప బడతాయనీ చెప్పారు.

"తెలుగు సాహితీ సంస్థల సమాఖ్య"

విజయవాడలో డిశంబరు నెల 13 వ తారీఖున తెలుగు సాహితీ సంస్థల ప్రతినిధుల ప్రథమ మహాసభలు జరిగాయి. ఈ సభలలో అనేక సాహితీ సంస్థలు ఏకమై 'తెలుగు సాహితీ సంస్థలసమాఖ్య'గా జాతీయ స్థాయిలో ఏర్పడింది.

ఈ సంస్థకు గౌరవాధ్యక్షుడుగా శ్రీ త్రిపురాన రాఘవదాసు, అధ్యక్షుడుగా శ్రీ గుత్తికొండ సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా శ్రీ వంశీ రామరాజు, శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ జి. వి. పూర్ణచందు, కార్యదర్శిగా శ్రీ ఎం. ఏ. మూర్తి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీమతి సి. వేదవతి, డాక్టర్ పోతుకూచి వెంకటేశ్వర్లు, శ్రీ బి. ఎల్. ఎన్. స్వామి, కోశాధికారిగా శ్రీ డోకల నారాయణరావు, కన్వీనరుగా డాక్టర్ పరుచూరి రాజారామ్ మరో 30 మంది సభ్యులతో కార్యవర్గం ఏర్పాటు చేయబడింది.

విజ్ఞప్తి

గంగాధరం సాహితీకుటుంబం (రిజి) చిత్తూరు ప్రతి సంవత్సరం మే 29వ తేదీ రు. 1,116 లతో జరిపే సాహితీ సత్కారానికి కవితా గ్రంథాలు పంపే కవులు ఈ సూచనలు పాటించాలని కార్యదర్శి శ్రీ ఎస్. మునిసుందరం తెలియ చేస్తున్నారు.

ఈ సంవత్సరం సత్కారం కవితా గ్రంథాలకు మాత్రమే. 1.1.79 నుండి 31.12.81 వరకు ప్రథమ ముద్రణ పొందిన కవితాగ్రంథాలను మాత్రమే పంపాలి. వ్రాత ప్రతులు పంపరాదు.


కవితా గ్రంథం ఆధునిక ప్రాచీన రీతులలో ఏ రీతికి చెందినా ఫర్వాలేదు. అయితే అది వివిధ కవుల కవితా సంకలనం కాకూడదు. అనువాదాలు పంపరాదు. ప్రచురణ కర్తలు కూడా పుస్తకాలు పంపవచ్చు, కానీ బహుమతి కవికే యివ్వబడుతుంది.

పరిశీలనార్థం ప్రతిపుస్తకం నాలుగుప్రతులు 15.3.82 లోగా కార్యదర్శి, గంగాధరంసాహితీ కుటుంబం, 3—4—58, గిరింపేట చిత్తూరు– 2 కు పంపాలి.

నాలుగు దశాబ్దాల బాలానందం ప్రగతి సంచిక

ఆంధ్ర బాలానంద సంఘం గత నలభయి ఏళ్ళుగా (1940- 1980) సాధించిన ప్రగతిని కళ్ళకు కట్టినట్లు చూపించే ఈ ప్రత్యేక సంచికలో శ్రీ న్యాయపతి రాఘవరావు, శ్రీమతి కామేశ్వరి గారల ఆధ్వర్యంలో సంఘం నిర్వహించిన అనేకానేక కార్యక్రమాల గురించి బాలల మనోవికాసానికీ విజ్ఞానానికీ సంఘం చేసిన కృషిని గురించి వివరించే ప్రముఖ రచనలు, ఎన్నెన్నో ప్రత్యేక సందర్భాలలో తీసిన ఛాయాచిత్రాలనేకం ఉన్నాయి. రేడియో అక్కయ్య కీ.శే. శ్రీమతి న్యాయపతి కామేశ్వరి గారికి దీన్ని అంకితం యివ్వడం సముచితంగా ఉంది.

176 పేజీల ఈ సంచిక వెల ఎంతో తెలియదు. వివరాలకి ఆంధ్ర బాలానందసంఘం 3—4- 665, నారాయణగూడ, హైదరాబాదు, –500027 కి రాయాలి.



ఉత్తరాలు

ముఖచిత్రం

82 కొత్త సంవత్సరం ప్రారంభం నాటి హిందీనటి తున్నా ముఖచిత్ర ఆంధ్ర సచిత్రవార పత్రిక సుందర మనోహరంగా నున్నది. ప్రతీ సంవత్సరము లాగే 81 సంవత్సరంలో మీ (మా) పత్రికలు మాకు నచ్చే విధముగా తీర్చిదిద్ది మాకు అందజేశారు. ఈ సంవత్సరము కూడా ఆకర్షణీయమైన నటీనటుల ముఖ చిత్రాలతో మంచి సీరియల్ నవలలు, సరికొత్త కథలతో మా హృదయాలను ఆకట్టుకొనే విధముగా మాకు అందజేయగలరని ఆశిస్తున్నాము. మీ (మా) ఆంధ్ర సచిత్ర వార పత్రికకు సంక్రాంతి శుభాకాంక్షలు ఈ లేఖ ద్వారా తెలియజేస్తూ,

నరేష్, సర్వేష్, ప్రసాద్, కమేష్, సతీష్, రామ్, ప్రకాష్ (ఖర్గపూర్)

కథలు

1-1-82 నాటి ముఖచిత్రం చాల బాగుంది. 'న్యూవేవ్ నాకెంత ఇష్టం', 'డైనమైట్' కథలు చాల బాగున్నవి.

ఆలమూరు థామసు డేనియుల్ (విశాఖపట్నం)

* * *

శ్రీపాంచాలిగారు రచించిన "దేవతా వస్త్రాలు" కథ చదివిన తరువాత, సోషల్ సినిమాలు చూచి విసిగిపోయిన తరువాత చూచిన పౌరాణిక సినిమా లాగుంది. చాలా ఆనందించితిమి ఇలాంటిది ఇదే మొదటిసారి. రచయితగార్కి అభినందనములు. మున్ముందు యీలాంటి భాగవతంలోని ఘట్టముల, పూర్వ ఆంధ్ర కవులను తరుచు పరిచయం చేస్తారని ఆశిస్తున్నాము. రావుగారి చిత్రము కూడా చాలా బాగుంది.

ఎల్లా అచ్యుత నారాయణ (కలకత్తా)

* * *

పాంచాలిగారి "దేవతా వస్త్రాలు" కథ చాలా బాగుంది. ఇలాంటి కథా స్వరూపాన్ని అందజేసి అలనాటి పోతన శ్రీనాథుల కవితా విశేషాలను కనుసన్నలలో నిల్పిన రచయితకి నా అభినందనలు.

'మంజి' కథ శాముండులపాల్లెం యొక్క స్వభావాన్ని భూత భవిష్యత్కాలాన్ని తెల్పుతూ అందరి తారతమ్యాలను సూచిస్తూ వ్రాసినది. యెంతో నచ్చింది.

ఎస్. వి. దాసు (దుబయ్)

25-12-81 పత్రిక జి. రాజ్యలక్ష్మి గారి ముఖచిత్రంతో చాలా నీట్‌గా ఉండి మమ్మల్నెంతగానో ఆకర్షించింది.

"బలిపీఠం", "కథ నిజమైతే" కథలు హైలైట్!!

జి. శివశంకర్‌రావ్ (గొల్లపోలు)

* * *

25-12-81 సచిత్ర వార పత్రికలో వెలువడిన "కథ నిజమైతే?"... వాస్తవికత నిజమయినదే. ఈ కాలం ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్‌కు భయపడుతారు. ప్రిన్సిపాల్ నిర్వాహక కమిటీకి భయపడుతాడు. నిర్వాహక కమిటీ విద్యాశాఖకు భయపడుతుంది. విద్యాశాఖ విద్యార్థుల్ని చూసిభయపడుతుంది. విద్యార్థులు ఎవరికీ భయపడరని భారత ఉపాధ్యక్షులు శ్రీ ఎం. హిదయతుల్లా అన్నారు. ఇక్కడ ఒక పంతులుగారిని అన్యాయ రీత్యా మేనేజిమెంటు పని నుండి తీసివేస్తే, విద్యార్థులు సమ్మెచేసి, గవర్నమెంటును మేలు కొలిపి తిరిగి ఆయన ఉద్యోగం నిలబెట్టారు. విద్యార్థులు తలచుకుంటే మంచి పనులు కూడా చేయగలరు.

ఎ. లక్ష్మణ్ (మదరాసు)

సీరియల్

జీవిత వనములో కొత్తగాలి, సీరియల్ చాలా ఇంట్రెస్టుగా ఉంది. ముఖ చిత్రాలతో పత్రికదే ప్రత్యేకం.

జె. యస్. నాయుడు, యస్. డి. ఎసీప్ (కువైట్)

* * *

1-1-82 ఆంధ్ర సచిత్ర వార పత్రిక వెరైటీగా ఉంది 'తార' "జీవితవనంలో కొత్తగాలి" సీరియల్స్ మంచి ఇంటరెస్ట్‌గా ఉన్నవి.

జగతా సత్యవేణు (కొవ్వూరు)

* * *

1-1-82 ఆంధ్ర సచిత్రవార పత్రిక ముఖచిత్రం ఆకర్షణీయముగా వుంది. జీవిత వనంలో కొత్తగాలి సీరియల్ ఇంట్రస్టింగ్‌గా సాగుతోంది. సంధ్య పాత్ర బాగుంది.

సానా నాగిని, విజయ, ఎ. సరోజ (కొత్తపట్నం)

* * *

ఈ వారం (అనగా 1-1-2 పత్రిక) ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ముఖచిత్రం చాలాబాగుంది. ముఖ్యముగా సీరియల్ 'తార' చదవడానికి చాలా ఇంట్రస్ట్‌గా ఉంది. ఇలాంటి సీరియల్‌ను అందిస్తున్న మీ పత్రికకు ఇవే మా ధన్యవాదములు. మీ పత్రిక ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాము.

ధవళ శ్రీనివాసరావు (బారువ)

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.


అత్యుత్తమమైన† డిటర్జెంట్ పౌడర్
రూ.14.26*కు దొరుకుతున్నప్పుడు
మరొక డిటర్జెంట్ పౌడరుకు రూ.20.50
మీరు ఇప్పుడు ఎందుకు చెల్లించాలి?

ఇప్పుడే కొనండి

సూపర్ పవర్

చెక్†

డిటర్జెంట్ పౌడరు



ప్రతి కిలోకు
రూ.6/-కు
పైగా ఆదా
చేయండి

చెక్ తో ఉతకండి, తేడా చెక్ చేయండి

200 గ్రా. ప్యాక్ కూడ దొరుకుతుంది.

† పూర్తిగా తృప్తి కలుగనిచో ప్యాకెట్ తిరిగియిచ్చి సొమ్మును వాపసు పొందండి.

* స్థానిక పన్నులు అదనం

AB & M/M/DIL/CP/881/TEL/1

Regd. No. H/YJ-41 ANDHRA SACHITRA VARA PATRIKA

